
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 122 | హైదరాబాద్ | శుక్రవారం 31-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

## చంద్రుడిపైకి వ్యోమగాములు..
### లక్ష్యాన్ని ప్రకటించిన చైనా



11లో

## గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ హబ్‌గా భారత్

రంగంలో 400 స్టార్టప్‌లు

- 20 బిలియన్ డాలర్లకు చేరిన సైబర్ సెక్యూరిటీ పరిశ్రమ
- ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదన్న సెర్ట్-ఇన్

## బీహార్‌లో వేడెక్కిన రాజకీయం



11లో

- బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ
- నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలో రెండు బహిరంగ సభలు
- ఎన్డీఏ కూటమిదే ఘన విజయమని ధీమా
- ఓట్ల కోసం మోదీ ఏ డ్రామా అయినా ఆడతారన్న రాహుల్ గాంధీ
- మహారాష్ట్ర, హర్యానా లాగే బీహార్‌లో ఓట్లు దొంగిలిస్తారని ఆరోపణ
- నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పోలింగ్

## నేటి భారతం

- మనం నమ్మిన వారికి ఓట్లు వేస్తాం..
  వారి సేవలను విశ్వసిస్తాం..
  కానీ వారు అవినీతి పరులా.. మంచివాల్లా..?
  తెలుసుకోవడం ఎలా..? అందుకే ఆర్.టి.ఐ. ఉంది..
- ఇది మన హక్కు, ఓటేసిన ప్రతి ఒక్కరి హక్కు..
  నిజానికి ప్రభుత్వాలు, నాయకులు.. మంత్రులు,
  ముఖ్యమంత్రులు, అధికారులు..
- వీళ్లంతా మన సేవకులు..
  మనమీద అజమాయిషీ చెలాయించడం నేరం..
- ఎందుకంటే చెమటోడ్చి సంపాదిస్తాం..
  ప్రతిచోటా పన్నులు చెల్లిస్తాం..
  మన డబ్బులతోటే వీళ్ళకి జీతాలు లభిస్తున్నాయి..
  సకల సౌకర్యాలు అందుతున్నాయి..
- మన డబ్బులతోటే మనకు సంక్షేమ పథకాలు
  అందుతున్నాయి..
- ఆ వివరాలు తెలుసుకోవడంలో తప్పేముంది..
  అది మన బాధ్యత, మన హక్కు.. మాన హక్కును
  కాలరాచేవాళ్ళు ఎవరైనా సరే..
  క్షమించేది లేదు.. ఉపేక్షించేది అసలే లేదు..
  ఖబడ్దార్...

– బోయినపల్లి రమణా రావు,
సీనియర్ జర్నలిస్ట్..

## కే కన్వెన్షన్ రిసార్ట్ 10 ఎకరాలలో అక్రమ నిర్మాణాన్ని ఎందుకు ఉపేక్షిస్తున్నారు..?

- హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓసారి ఇటువైపు చూడటానికి టైం లేదా..? ఓపిక లేదా..?
- సర్వే నెం. 681/1/3, శంకర్‌పల్లిలో వెలుగు చూసిన అక్రమం..
- లంచాల మత్తులో జోగుతున్న నార్సింగి మున్సిపల్ అధికారులు
- అంతులేని అవినీతి చరిత్రను రాసుకున్న నార్సింగి మున్సిపల్ కమిషనర్, టిపిఓలు..
- ఈ వ్యవహారంపై స్పెషల్ కమిషనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి దృష్టి సారిస్తారా..?
- 111 జీవోలో 10 ఎకరాలలో "కే కన్వెన్షన్ హాల్" అక్రమ నిర్మాణం.
- నాలా కన్వర్షన్ లేదు.. పైగా అది ప్రభుత్వ భూమి.. నిస్సిగ్గుగా కబ్జా..
- నార్సింగి మున్సిపల్ అనుమతులు లేవు.. ఓ కుంటను కూడా మింగేశారు,
- ఇరిగేషన్, రెవెన్యూ, హెచ్ఎండిఏ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు లక్షల్లో మామూళ్ళు
- ఎస్.టి.ఎఫ్ ఇంచార్జ్ కలెక్టర్, మున్సిపల్ శాఖ మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి...




12లో



## మంత్రులు జూబ్లీహిల్స్‌లో.. వరంగల్ నీళ్లలో..

- వరంగల్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు, వరదలు
- నీట మునిగిన కాలనీల్లో బీఆర్ఎస్ నేత రాకేశ్ రెడ్డి పర్యటన

11లో


## నా చివరి కోరిక ఇదే

- బీసీలకు రాజ్యాధికారం దక్కాలన్నదే తన చివరి ఆకాంక్ష అన్న ఆర్. కృష్ణయ్య
- బీసీ బంద్ సందర్భంగా 350 మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపణ
- తెలంగాణ నుంచే బీసీ ఉద్యమం ప్రారంభమైందని వెల్లడి



11లో

## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా నైపుణ్యం పోర్టల్, ప్రతి నెల జాబ్ మేళాలు




- నైపుణ్యాభివృద్ధితో పాటు ఉన్నత విద్యకు సహకారం
- శిక్షణ పూర్తయితే స్కిల్ టెస్టింగ్, ధృవపత్రాల జారీ
- ఆర్టీఐహెచ్‌తో విద్యార్థుల ఆవిష్కరణల అనుసంధానం
- నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

11లో

## హక్కును.. కాలరాస్తున్నారు..

2005 ఈ సంవత్సరంలో ఒక అద్భుతమైన చట్టాన్ని రూపొందించింది అప్పటి ప్రభుత్వం.. ఆ చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారింది.. అవినీతి అధికారులు, నాయకుల గుండెల్లో గుబులు రేపింది.. అదే సమాచార హక్కు చట్టం.. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, 2005.. ఈ చట్టం భారత ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైనది. కానీ దాని వలన ఎంతో ఉపయోగం ఉన్నా.. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న దూర్తుల నుంచి పెను ప్రమాదం ఎదురవుతోంది.. దాంతో మన వ్యవస్థ బలహీనమవుతోంది.. సమాచార హక్కు చట్టం ఉద్దేశ్యం ఎంతో అద్భుతంగా వుంది.. మనం ఓట్లేసి గెలిపించిన ప్రభుత్వంలో నాయకులు, అధికారులు ఎలా పనిచేస్తున్నారు.. మనకోసం ఎంతెంత ఖర్చుపెడుతున్నారు..? ఆ పెట్టె ఖర్చు సద్వినియోగం అవుతోందా..? దుర్వినియోగం అవుతోందా..? మనం కడుతున్న పన్నులకు న్యాయం జరుగుతోందా..? అన్న విషయాలను తెలుసుకోవచ్చు.. పాలన ఎలా సాగుతోందో తెలుసుకోవచ్చు.. అధికారుల అవినీతిని తెలుసుకోవచ్చు.. కానీ దురదృష్టం ఏమిటంటే సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వాల్సిన అధికారులు సరిగా స్పందించడం లేదు.. విధి విధానాలను కూడా పాటించడం లేదు.. అంతే కాదు మనం ఎవరిగురించి అయినా సమాచారం అడిగినప్పుడు ఆ విషయాన్ని అవతలివారికి చేరవేస్తున్నారు.. ఇది ప్రమాదకరంగా మారిపోతోంది.. అంతే కాకుండా కొంతమంది కేవలం ఎదుటివారిని బ్లాక్ మెయిల్ చేయడానికే సమాచారం అడుగుతున్నారు.. ఇది మరీ ప్రమాదకరంగా మారిపోయింది.. నిజాలను తెలుసుకోవడానికి ప్రవేశపెట్టబడిన ఈ చట్టం.. దుర్వినియోగం అవుతుండటం దురదృష్టకరం..

12లో



## సంపాదకీయం

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2.0

ఎన్నికల సంఘం మరో అడుగు ముందుకు వేసేందుకి సిద్ధమైంది. ఎంత వ్యతిరేకత వచ్చినా.. ఎన్ని రకాల విమర్శలు వచ్చినా.. పాన్ ఇండియా లేవెల్లో.. ఓటర్ సర్వే నిర్వహించాలని డిసైడ్ అయింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్.. రెండో విడతకు తేదీలు కూడా ప్రకటించేసింది.. బీహార్ ఎన్నికల ముందు.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో చేసిన ఓటర్ జాబితా సవరణ.. ఇండియన్ పాలిటిక్స్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. బీహార్‌లో ఓటర్ సర్వేతో 60 లక్షలకు పైగా నకిలీ, బోగస్ ఓట్లని తొలగించింది ఎన్నికల సంఘం. దీనిపై.. అక్కడి రాజకీయ పార్టీల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ.. ఈ అంశంలో ఎన్నికల సంఘం దూకుడుగా ముందుకెళ్లాలని నిర్ణయించుకుంది. బీహార్ తర్వాత.. రెండో దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో.. ఓటర్ జాబితా సవరణ చేపట్టనున్నట్లు తెలిపింది. తొలి దశలో బీహార్‌లో.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపింది ఈసీ. ఎన్నికల అధికారులతో ఈసీ సమావేశాలు:. బీహార్‌లో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ జాబితా సవరణలో.. 90 వేల కంటే ఎక్కువ పోలింగ్ బూత్‌లను కవర్ చేశారు. ఈ ప్రక్రియలో.. రాష్ట్రం మొత్తం మీద ఎలాంటి అభ్యంతరాలు రాలేవని ఎన్నికల సంఘం తెలిపింది. బీహార్‌లో ఓటర్ల భాగస్వామ్యం ఆదర్శమని.. ఎస్ఐఆర్‌లో పాల్గొన్న ఏడున్నర కోట్ల మంది బీహార్ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు సీఈసీ జ్ఞానేశ్ కుమార్. తొలి దశ తర్వాత.. 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులతో.. ఈసీ సమావేశాలు నిర్వహించి.. సమగ్రంగా చర్చించింది. రెండో దశలో.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టబోయే 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పేర్లను ప్రకటించారు. అండమాన్ నికోబార్, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, యూపీ, పశ్చిమబెంగాల్‌లో.. సెకండ్ ఫేజ్ ఎస్ఐఆర్ నిర్వహించనున్నారు. ఇందులో.. 51 కోట్లమంది ఓటర్లు భాగం కానున్నారు. నవంబర్ 4 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ రాష్ట్రాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ జాబితాను డిసెంబర్ 9న ప్రకటిస్తామని, తుది జాబితాను వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న విడుదల చేస్తామని చెప్పారు. అస్సాంలో ఓటర్ల జాబితా సవరణని.. విడిగా నిర్వహిస్తామని తెలిపారు. పోలింగ్ అధికారులకు ట్రైనింగ్:. ఓటర్ లిస్టుల్లో.. ఎలాంటి లోపాలు లేకుండా కచ్చితత్వాన్ని నిర్ధారించడమే లక్ష్యంగా.. ఎన్నికల సంఘం ఈ ఓటర్ సర్వే చేపట్టబోతోంది. 1951 నుంచి.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ని నిర్వహించారు. 2004లో చివరిసారి ఈ ఎస్ఐర్ ప్రక్రియ జరిగింది. వలసలు, ఫేక్ ఓట్లు, బోగస్ ఓట్లు, 2002 తర్వాత నమోదిత ఓటర్లలో మరణించిన వారి ఓట్లని తొలగించడం లాంటి కారణాలతో.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించడం తప్పనిసరిగా మారింది. ఇప్పుడు.. తొమ్మిదోసారి ఓటర్ జాబితాను సవరిస్తోంది ఎన్నికల సంఘం. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించబడే 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన ఓటర్ లిస్టులను ప్రస్తుతానికి బ్లాక్ చేశారు. తర్వాత.. ఓటర్లకు అన్ని వివరాలతో కూడిన ప్రత్యేకమైన ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇస్తారు. అర్హత కలిగిన ఏ ఓటరుని కూడా మిస్ చేయకుండా.. లిస్టులో అనర్హమైన ఓటర్లు ఎవరూ లేకుండా చూసుకుంటారు. పౌరసత్వానికి ఆధార్ ఓ ధ్రువీకరణ పత్రం కాదని, అయితే.. ఎస్ఐఆర్‌లో దానినొక ఐడెంటిటీ ప్రూఫ్‌గా సమర్పించొచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది. పాన్ ఇండియా లెవెల్లో ఓటర్ సర్వే అంటే మామూలు విషయం కాదు. అయినాసరే.. ఈసీ ఈ విషయంలో బలంగానే ముందుకెళ్తోంది. మన దేశంలో ఓటరు జాబితా సమగ్రతను కాపాడటమే లక్ష్యంగా.. డూప్లికేట్ ఓట్లు, మృతి చెందిన వారి ఓట్లు, వలస వెళ్లిన ఓటర్ల పేర్లను తొలగించేందుకే.. ఎన్నికల సంఘం.. ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపడుతోంది. ఓటు వేసేందుకు అర్హత కలిగిన ప్రతి పౌరుడి పేరు.. ఓటర్ లిస్టులో ఉండేలా చూస్తోంది. కోట్లాది మంది యువ ఓటర్ల చేరిక వల్ల.. ఓటర్ లిస్టులు కూడా అప్‌డేట్ కావాల్సిన అవసరం ఉంది. అయితే.. కొన్ని రాజకీయ పార్టీలు ఈ రివిజన్‌ని మద్దతిస్తుండగా.. మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు ఈ ప్రక్రియ పట్ల తీవ్ర అభ్యంతరాలు, ఆందోళనని వ్యక్తం చేస్తున్నాయ్. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని.. ఈ రివిజన్ చేస్తున్నారని.. ఇది ఓటరు జాబితాలను తారుమారు చేసే ప్రయత్నమని ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ.. తమకు అనుకూలంగా లేని వర్గాలు, మైనారిటీలు, షెడ్యూల్డ్ కులాలు, మహిళలు, పేద వర్గాల ఓటర్ల పేర్లను.. వ్యూహాత్మకంగా జాబితా నుంచి తొలగించే కుట్ర అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌లో.. ఓటర్లు తమ అర్హతని నిరూపించుకునేందుకు బర్త్ సర్టిఫికెట్ల లాంటి పత్రాలను సమర్పించాల్సి రావడం.. నిరక్షరాస్యులు, పేదలు, వలస కార్మికులకు కష్టమని వాదిస్తున్నారు. బీహార్‌లో జరిగిన ఫస్ట్ ఫేజ్ రివిజన్ తర్వాత.. లక్షలాది మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించారు. ముఖ్యంగా.. ప్రతిపక్ష పార్టీలకు ఓటు వేసే అవకాశం ఉన్నవారి పేర్లు.. ఎక్కువగా తొలగించారనే ఆరోపణలు వచ్చాయి. దాంతో.. ఎస్ఐఆర్‌పై కొన్ని పార్టీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వన్ మ్యాన్.. వన్ ఓట్ అనే సిద్ధాంతం:. ముఖ్యంగా.. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లందరూ జాబితాలో ఉండేలా చూడటమే.. ఎస్ఐఆర్ లక్ష్యం. వన్ మ్యాన్.. వన్ ఓట్ అనే సిద్ధాంతాన్ని బలోపేతం చేసే ఉద్దేశం కూడా ఉంది. అనేక రాజకీయ పార్టీలు గతంలో ఓటర్ లిస్టులపై ఆందోళన వ్యక్తం చేశాయి. వాటన్నింటిని పరిష్కరించేందుకు కూడా ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఎస్ఐఆర్‌లో భాగంగా.. ఓటర్ జాబితాలోని ఓటర్లందరికీ.. బూత్ లెవెల్ ఆఫీసర్లు.. ప్రత్యేక ఎన్యుమరేషన్ ఫామ్స్ అందిస్తారు. అందులో.. సమగ్రమైన ఓటర్ జాబితాకు కావాల్సిన అన్ని వివరాలు ఉంటాయి. బీఎల్‌వోలు.. ప్రతి ఇంటికి 3 సార్లు వెళ్తారు. వలస వచ్చిన ఓటర్ల సమస్యని కూడా పరిష్కరిస్తారు. అంతేకాదు.. ఓటర్లు కూడా తమ ఎన్యుమరేషన్ ఫామ్స్‌ని ఆన్‌లైన్‌లోనూ సమర్పించొచ్చు. బీఎల్‌వోలు.. ఫామ్స్ పంపిణీ చేయడం ప్రారంభించాక.. ఓటర్లు తమ వివరాలను పాత ఓటర్ లిస్టుతో ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. 2003 ఓటర్ లిస్టులో.. తమ పేరు ఉందో లేదో చూసుకోవాల్సి ఉంటుంది. వారి పేర్లు గానీ వారి తల్లిదండ్రుల పేర్లు గానీ 2003 నాటి ఓటర్ లిస్టులో కనిపిస్తే.. వారు ఎలాంటి అదనపు పత్రాలను సమర్పించాల్సిన అవసరం లేదు.ఓటర్లు.. తమ చేరికను నేరుగా ఆన్‌లైన్‌లోనే ధ్రువీకరించుకునే అవకాశం కల్పించారు.



# ఎంత కష్టం.. ... ఎంత నష్టం...
# రైతు కంట కన్నీరు...

విజయవాడ, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ లో మొంథా తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందకుండానే నాశనమయిపోయింది. 243 మండలాల్లో తీవ్ర పంటన నష్టం జరిగింది. చేతికి వచ్చిన పంట నేలవాలింది. అరటి, బత్తాయి వంటి తోటలు పూర్తిగా ఈదురుగాలులకు ధ్వంసమయ్యాయి. మిరప, పత్తి రైతులు నష్టపోయి కూడా ఆందోళన చెందుతున్నారు. కంది, అరటి, బొప్పాయి, వేరుశెనగ వంటి పంటలు భారీగా దెబ్బతిన్నాయి. 22 రెండు జిల్లాల్లో మొంథా తుపానుతో భారీగా పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతి వరకూ అన్ని జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు... వరి సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. భారీ వర్షాలకు, ఈదురుగాలులకు వరిపంట దెబ్బతినింది. డెల్టా ప్రాంతంలో సాగవుతున్న వరి నేలకొరిగింది. వరి ప్రస్తుతం కంకుల దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో పంట చేతికి వస్తున్న దశలో భారీ వర్షం, గాలులకు పంట దెబ్బతినింది. మరో పదిహేను రోజుల్లో పంట చేతికి వస్తుందనుకుంటున్న దశలో నష్టం వాటిల్లినట్లు అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పంటపై ఆశలు వదులుకోనున్నారు. వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు ఇక కోలుకోలేని పరిస్థితి నెలకొంది. పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. పెట్టుబడి వచ్చే అవకాశం కూడా కనిపించడం లేదు. . వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో పంట పూర్తిగా నాశనయినట్లేనని అన్నదాతలు విలపిస్తున్నారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. ఈదురుగాలులు కూడా బలంగా వీస్తాయని, గంటకు అరవై నుంచి డెబ్బయి కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశమున్నందును ఎవరూ వీలయినంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని అధికారులు కోరుతున్నారు. వాగులు, నదులు దాటే ప్రయత్నం ఎవరూ చేయవద్దని, అలాగే ప్రయాణాలు కూడా వీలయినంత మేరకు మానుకోవాలని సూచించింది. ఈదురుగాలులు వీస్తూ... మొంథా తుపాన్ ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలు పడుతున్నాయి. గాలుల తీవ్రత కూడా పెరిగింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. తుపాన్ ప్రభావంతో భారీగా ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

అనేక గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తీర ప్రాంతాల్లో పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. తుపాన్‌గా బలహీనపడుతున్న మొంథా రానున్న ఆరు గంటల్లో తీవ్ర వాయుగుండంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ శాకఖ తెలపింది. ఆంధ్రప్రదేశ్ లోని 12 జిల్లాలకు భారీ వర్ష సూచన చే?ంది. తొమ్మిది జిల్లాలకు మోస్తరు నుంచి భారీ వర్ష సూచనచేసిదం?. 9శ్రీకాకుళం, విజయనగరం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఎకరాకు ముప్ఫయి నుంచి నలభై వేల రూపాయలు నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అరటి, కంది, బొప్పాయి, బత్తాయి వంటి పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్ లో అన్నదాతలు కోలుకోవడం కష్టమేనని అనిపిస్తుంది. ప్రభుత్వం పంట నష్టంపై అంచనాలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశించింది. అయినా ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారం వీరి నష్టాన్ని ఏమాత్రం పూడ్చలేదన్నది మాత్రం వాస్తవం.

# కూలిన బ్రహ్మంగారి ఇల్లు....అరిష్టమా...




కడప, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి): ఏపీలో పలు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మొంథా తుపాను ప్రభావంతో పలుచోట్ల ఎడతెరిపి లేకుండా వానలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే వైఎస్ఆర్ జిల్లా కడపలోని బ్రహ్మంగారిమఠంలో కురిసిన వర్షానికి వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం కూలిపోయింది. గత రెండు మూడు రోజులుగా ఇక్కడ వర్షం కురుస్తోంది. దీంతో ఈ నివాసం కూలిపోయింది. అయితే అధికారుల అలసత్యం కారణంగానే ఈ చారిత్రక స్థలానికి ఈ పరిస్థితి వచ్చిందని భక్తులు మండిపడుతున్నారు. వారసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శిస్తున్నారు.మొంథా తుపాను నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జనం ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే వైఎస్ఆర్ కడప జిల్లా బ్రహ్మంగారిమఠంలో భారీ వర్షాలకు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి నివాస గృహం కుప్పకూలింది. మొంథా తుపాను ప్రభావంతో గత కొన్ని రోజులుగా బ్రహ్మంగారిమఠంలో వర్షం పడుతోంది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవటంతో వీరబ్రహ్మేంద్రస్వామి నివాసం కూలిపోయింది. అయితే ఈ ఘటనపై భక్తులు మండిపడుతున్నారు. కాలజ్ఞానకర్తగా వీరబ్రహ్మేంద్రస్వామి ప్రసిద్ధి చెందారు. ఎంతో మంది భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి సమాధిని దర్శించుకోవటానికి వస్తుంటారు. అలాగే నివాస గృహాన్ని సందర్శిస్తూ ఉంటారు.ఇంతటి చారిత్రక ప్రాశిస్త్యం కలిగిన బ్రహ్మంగారి నివాస గృహాన్ని కాపాడాల్సిన అధికారులు.. ఆ విషయంలో అలసత్వం వహించారని భక్తులు మండిపడుతున్నారు.16 శతాబ్దం నాటి వీరబ్రహ్మేంద్ర స్వామి నివాసం పట్ల అధికారులు శ్రద్ధ చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్నప్పుడు మరమ్మతులు చేయించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నారు. ఈ విషయంలో బ్రహ్మంగారి వారసులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. రూ.కోట్లు ఖర్చుపెట్టి బ్రహ్మంగారి మఠాన్ని అభివృద్ధి చేస్తున్నామంటున్న అధికారులు.. ఈ ఘటనకు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నిస్తున్నారు.మరోవైపు బ్రహ్మంగారిమఠాన్ని సందర్శించేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటుగా పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో బ్రహ్మంగారిమఠం అభివృద్ధి చేస్తామని అధికారులు చెప్తున్నారు. అయితే భక్తులకు మాత్రం కనీస వసతులు కల్పించడం లేదని ఇక్కడికి వచ్చే భక్తుల నుంచి ఆరోపణలు ఉన్నాయి. తాజాగా వర్షం కారణంగా బ్రహ్మంగారి నివాస గృహం కూలిపోవటంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చారిత్రక కట్టడాన్ని కాపాడడంలో అధికారులు, వారసులు విఫలమయ్యారని భక్తుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వీరబ్రహ్మేంద్రస్వామి నివాస గృహం కూలిపోవటంతో కొంతమంది భక్తులు అరిష్టమా అనే భయాందోళనకు కూడా గురౌతున్నారు.మరోవైపు బ్రహ్మంగారి మఠం నూతన అధిపతి నియామకం కోసం చర్యలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే వీరబ్రహ్మేంద్రస్వామివారి శిష్యులు, భక్తులతో పాటుగా పలువురు మఠాధిపతులు, స్వామిజీలతో దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మఠాధిపతిగా తమకు అవకాశం కల్పించాలని వేంకటాద్రి స్వామి, గోవింద స్వామి, భద్రయ్య స్వామి కోరారు. అలాగే తమ అర్హత పత్రాలను అధికారులకు అందించారు. ఆ తర్వాత భక్తులు, శిష్యులు, సమావేశానికి వచ్చిన ఇతర మఠాధిపతులు, స్వామిజీలు తమ అభిప్రాయాలు ఏమిటో రాతపూర్వకంగా అధికారులకు నివేదించారు. ఈ అభిప్రాయాలను పరిశీలించి ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోనున్నారు.

# మారుతోన్న స్వరం

నెల్లూరు, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి): ఏపీలోవైయస్సార్ కాంగ్రెస్ వాయిస్ మారుతోంది. తమకు తాము బలం పెంచుకొని గెలుస్తామన్న ధీమా ఉంటే పర్వాలేదు. కానీ కూటమి మధ్య విభేదాలు వస్తాయని.. సామాజిక వర్గాల లెక్కలు మారుతాయని.. అందుకే ఒంటరిగా పోటీ చేసే తాము గెలుస్తామని లెక్కలు వేసుకుంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే ఇటువంటి లెక్కలు మూడుసార్లు వేసుకుంది ఆ పార్టీ. కానీ ఒక్కసారి మాత్రమే గెలిచింది. అయితే ఇప్పుడు అదే ఫార్ములా తో 2029లో సైతం గెలుస్తామన్న ధీమాతో ఉంది. కానీ అది ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందికరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా టిడిపి, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరుగుతోందని వైసీపీ చెబుతోంది. ఆ గ్యాప్ తమకు లాభమని అంచనా వేస్తోంది.

ప్రధానంగా ఈసారి కాపు సామాజిక వర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు టర్న్ అవుతుందని వైసిపి అంచనాగా ఉంది. అందుకే కాపు సామాజిక వర్గంలో ఆగ్రహం, ఆవేదన పెంచే పనిలో పడింది. నందమూరి బాలకృష్ణ వైసిపి హయాంలో చిత్ర పరిశ్రమకు ఎదురైన పరిణామాల గురించి అసంతృప్తి వ్యక్తం చేశారు. తనదైన శైలిలో జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు చేశారు. అయితే చిరంజీవిని తెరపైకి తెచ్చి కాపు సామాజిక వర్గాన్ని, మెగా అభిమానుల ముసుగులో రాజకీయం చేయాలని చూసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇంకోవైపు కందుకూరు లో ఓ హత్యను కాపు, కమ్మ సామాజిక వర్గ మధ్య జరిగిన ఆధిపత్య పోరుగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. కాపుల్లో ఒక రకమైన మార్పు కోసం ఈ ఘటనను సాకుగా చూపే సాహసం చేసింది. కానీ ఈ విషయంలో అనుకున్నంత సక్సెస్ కనిపించలేదు.టిడిపి, జనసేన, బిజెపి నాయకత్వం విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్పష్టత ఉంది. ఆ మూడు పార్టీలు మరో 15 ఏళ్ల పాటు కలిసి వెళ్తాయని వారు బాహాటంగానే చెప్పుకొస్తున్నారు. ఏకంగా రాయలసీమ వచ్చి ప్రధాని నరేంద్ర మోడీ కీలక ప్రకటన చేశారు. పవన్ కళ్యాణ్ పార్టీ చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తామని తేల్చి చెప్పారు. అందుకే ఇప్పుడు నాయకత్వంతో పని లేకుండా రెండు పార్టీల క్యాడర్ పై ఆశగా ఎదురుచూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఎన్నికలు సమీపిస్తున్న కొలది ఆ రెండు పార్టీల క్యాడర్ మధ్య గ్యాప్ పెరుగుతుందని అంచనా వేస్తోంది. 2024 ఎన్నికలకు ముందు కూడా క్యాడర్లో ఇదేవిధంగా గ్యాప్ వస్తుందని అంచనా వేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అటువంటిది ఏమీ లేకుండా పోయింది.

# ఏపీకి తీర ప్రాంతం..
# అదే ప్లస్.. అదేమైనస్...

కాకినాడ, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి): సువిశాల తీర ప్రాంతం ఏపీ సొంతం. తిరుపతి జిల్లా తడ నుంచి



శ్రీకాకుళం జిల్లా డొంకూరు వరకు తీరం విస్తరించి ఉంది. అయితే ఏపీకి తీరం వరమో.. శాపమో తెలియని పరిస్థితి. ఎందుకంటే తరచూ తుఫానుల బెడద ఉంటుంది బంగాళాఖాతం నుంచి. ఏటా రెండు నుంచి మూడు తుఫాన్లు.. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పెను తుఫాను. తుఫాన్లు వచ్చే క్రమంలో ఏపీ చిగురుటాకుల వణికి పోతుంది. తుఫాన్లతో అంతులేని నష్టం జరుగుతోంది. అయితే దేశంలో ఇతర రాష్ట్రాలకు లేనివిధంగా ఏపీకి మాత్రమే ఈ విపత్తులు ఎందుకు అనేది ఒక ప్రశ్న. అయితే ఏపీ భౌగోళిక స్థితిగతులే ఈ తుఫానులకు తరచూ కారణం. అందుకే ఏపీలో తీర ప్రాంతం పై తుఫాన్లు విరుచుకుపడుతుంటాయి.

- గుజరాత్ తర్వాత పెద్ద తీర రాష్ట్రం..

గుజరాత్ తరువాత అతి పెద్ద తీర రాష్ట్రం ఏపీ మాత్రమే. సుమారు 974 కిలోమీటర్ల పొడవైన తూర్పు తీరరేఖ మనది. ఇది బంగాళాఖాతం వల్ల ఏర్పడింది. బంగాళాఖాతం ఉష్ణ మండలంలో ఉంటుంది. అందుకే ఇక్కడ ఉండే సముద్రపు నీరు కూడా ఎక్కువ వేడిని కలిగి ఉంటుంది. వేడినీరు తుఫానుల ఉత్పత్తికి ముఖ్యమైన ఇంధనం గా మారుతుంది. అందుకే బంగాళాఖాతంలో తరచూ తుఫానులు వచ్చి ఏపీ ని ఇబ్బంది పెడుతుంటాయి.

- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సముద్రాల కంటే బంగాళాఖాతంలో తుఫాన్లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఈ సముద్రానికి సంబంధించి ఏపీలో తీర ప్రాంతం అధికంగా ఉంటుంది.
- సాధారణంగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాలు, తుఫాన్లు వాయువ్య దిశగా లేదా వాయువ్య పడమర దిశగా కదులుతూ ఉంటాయి. అందుకే ముందుగా ఏపీని తాకుతుంటాయి. అటు తరువాత ఒడిస్సా తో పాటు పశ్చిమ బెంగాల్ వైపు సంభవిస్తాయి.
- ఆంధ్రప్రదేశ్కు ఎక్కువగా ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు తుఫాన్ల బెడద ఉంటుంది. ఒక్కోసారి ఇది డిసెంబర్ వరకు కూడా కొనసాగుతుంది.
- ఈశాన్యం నుంచి వచ్చే రుతుపవనాల గాలులు, సముద్ర ఉష్ణోగ్రతలు కలిపి తుఫాన్లు ఏర్పడడానికి కారణంగా మారుతున్నాయి. బంగాళాఖాతంలో వాయు పీడనంలో వచ్చే తేడాలు కూడా తుఫానులకు కారణం. ఈ తుఫానులకు ప్రభావితం అయ్యేది ముందుగా ఏపీ.
- ఏపీలో ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల వారికి ఎక్కువగా తుఫానుల తాకిడి ఉంటుంది. తీరానికి ఈ జిల్లాలు దగ్గరగా ఉండడమే అందుకు కారణం.

# అన్నదాతలను ముంచిన మొంథా తుఫాన్...

కరీంనగర్ అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి): మొంథా తుఫాన్ అన్నదాతలను ఆగం చేసింది. భారీ వర్షం రైతన్నకు అపార నష్టం మిగిల్చింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేతికందిన పంట వర్షార్పణమయింది. వేలాది ఎకరాల్లో పంటలు నేలవాలి నీట మునిగింది. హార్వెస్టింగ్ చేసే పరిస్థితి నెలకొంది. కల్లాల్లో ఆరబోసిన దాన్యం తడిసి మొలుకెత్తే పరిస్థితి ఏర్పడింది. పలుచోట్ల ధాన్యం వరదకు కొట్టుకుపోయింది. ఐకెపి, సహకార సంఘాల కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాసులు జలమయమయ్యాయి. హుజురాబాద్, హుస్నాబాద్, మానకొండూర్, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ధాన్యం రాశులు నీట మునిగి పలుచోట్ల కనిపించకుండా పోయాయి. ఆరుగాల శ్రమించి పండించిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు.

## క్యాష్ ఫర్ జాబ్... తమిళనాడును కుదిపేస్తున్న స్కామ్

చెన్నై, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి): తమిళనాడు రాష్ట్రంలో రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. అక్కడ అధికార పార్టీకి విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే చుక్కలు చూపిస్తోంది. తాజాగా టీవీకే పార్టీ తమిళనాడు రాష్ట్రంలో చోటు చేసుకున్న కుంభకోణాన్ని బయటపెట్టింది. ఇది ఆ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో చోటుచేసుకుందని టీవీకే ఆరోపించింది. టీవీకే ఆరోపణల ప్రకారం చూసుకుంటే.. తమిళనాడు రాష్ట్రంలోని మునిసిపల్, అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఉద్యోగాల భర్తీ నిర్వహించారు. ఈ క్రమంలో ఒక్క ఉద్యోగానికి 25 నుంచి 35 లక్షల వరకు లంచాలు తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఓ మనీలాండరింగ్ కేసు కు సంబంధించిన వ్యవహారంలో కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ సోదాలు నిర్వహించింది. తద్వారా ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారంపై తమిళనాడు పోలీస్ శాఖకు ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ లేఖ రాసినట్టు తెలుస్తోంది. ఈ ముడుపుల వ్యవహారంలో బలమైన వ్యక్తులు ఉన్నారని ఈడీ అధికారులు అభియోగాలు మోపినట్టు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్రంలోని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ వాటర్ సప్లై విభాగంలో ఇంజనీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, జూనియర్ ఇంజనీర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్ల పోస్టుల భర్తీకి 2024 లో రిక్రూట్మెంట్ ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ ఉద్యోగాలకు తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన తమిళనాడు ప్రభుత్వం 2,538 ని ఎంపిక చేసింది. వీరికి గత ఏడాదిలో ముఖ్యమంత్రి స్టాలిన్ నియామక పత్రాలు అందజేశారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. ముఖ్యంగా 150 మంది అభ్యర్థులకు ప్రయోజనం కలిగించే విధంగా పరీక్షలలో అక్రమాలకు పాల్పడినట్టు కేంద్ర దర్యాప్తు సంస్థ అభియోగాలలో వెల్లడించింది. ఈ 150 మంది అభ్యర్థుల నుంచి 25 నుంచి 35 లక్షల చొప్పున డబ్బులు తీసుకున్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ వ్యవహారం వెనుక అనేక మంది రాజకీయ నాయకులు.. ఇంకా కొన్ని సంస్థలు ఉన్నట్టు ఈడి ఆరోపించింది. ఈ వ్యవహారం పై దర్యాప్తు జరపాలని తమిళనాడు హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్ కు ఈడి లేఖ రాయడం కలకలం కలిగిస్తోంది. ఈ అక్రమాలకు సంబంధించి 232 పేజీలతో ఆధారాలు కూడా. ఈ పరీక్షను అన్నా యూనివర్సిటీ నిర్వహించింది. ఆ విశ్వవిద్యాలయంపై కూడా దర్యాప్తు చేపట్టాలని ఈడీ కోరినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని తమిళనాడు మీడియా పట్టించుకోకపోయినప్పటికీ.. టీవీకే పార్టీ అధినేత ప్రధానంగా దృష్టి సారించారు. ఇటీవల కరూర్ ప్రాంతంలో జరిగిన తొక్కిసలాట ఘటన విషయంలో విజయ్ ని అధికార డిఎంకె టార్గెట్ చేసింది. అనుకూల మీడియాలో అడ్డగోలుగా కథనాలను ప్రసారం చేయించింది. అయితే అనువైన సమయం కోసం ఎదురుచూస్తున్న విజయ్.. అదును చూసి డీఎంకేను దెబ్బ కొట్టారు..

## జగన్ తప్ప అంతా అన్ డ్యూటీ

విజయవాడ, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):



ఎదుటి వారిపై విమర్శలు చేసే ముందు.. మనం ఎలా ఉన్నామో గ్రహించాలి. ఒక వేలితో చూపిస్తే.. పది వేళ్ళు మన వైపే చూపించే రోజులు ఇవి. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది అదే పరిస్థితి. అమ్మ పెట్టదు.. తిననివ్వదు అన్నట్టు ఉంది ఆ పార్టీ దుస్థితి. తుఫాన్ తో ఏపీ అల్లాడిపోతోంది. ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. తన వయస్సును లెక్కచేయకుండా ప్రజలను విపత్తు నుంచి కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వానికి అండగా నిలవకపోయినా పర్వాలేదు. కానీ నిందించే ప్రయత్నం మాత్రం చేయకూడదు. చంద్రబాబు ప్రచార యావతో ఇదంతా చేస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తోంది. అయితే ఇప్పుడు ఆ ప్రచారమే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనస్ గా మారుతుంది. ఇంత జరుగుతుంటే మీ అధినేత ఎక్కడ అంటే మాత్రం సమాధానం కరువవుతోంది. ప్రస్తుతం ఏపీలో తుఫాను ముప్పు కొంతవరకు దాటినట్లు తెలుస్తోంది. ఒక్క సీఎం చంద్రబాబు కాదు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ సైతం అదే పనిలో ఉన్నారు. మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు తమ స్థాయిలో కష్టపడుతున్నారు. సొంత జిల్లాలతో పాటు నియోజకవర్గాల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. ఎలాంటి ఉపద్రవం ఎదురు ఎదురొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే ప్రధాన ప్రతిపక్ష హోదా కావాలని కోరుతున్న జగన్మోహన్ రెడ్డి కనిపించకపోవడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. ప్రజల తరఫున అసెంబ్లీలో ప్రశ్నిస్తానని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి తనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కావాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రజలు కష్టాల్లో ఉంటే అధికార పార్టీతో సమానంగా సేవలందించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. ప్రస్తుతం బెంగళూరు ప్యాలెస్ లో ఉన్నారు జగన్మోహన్ రెడ్డి. తాడేపల్లి కి వచ్చేందుకు ప్రయత్నించారు. కానీ విమాన సర్వీసులు రద్దయ్యాయి. అందుకే రాలేకపోయారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. రద్దయినవి కేవలం విమాన సర్వీసులు మాత్రమే. ఆయన రావాలంటే రోడ్డు మార్గంలో రావచ్చు కదా? కారులో ఓ 6 గంటలు ప్రయాణిస్తే చేరుకోగలరు కదా? అనే ప్రశ్నలు లాజికల్ గా వినిపిస్తున్నాయి. ఎక్కడైనా బలప్రదర్శనలకు, జన సమీకరణలకు దిగాలంటే ఇట్టే ఆలోచన చేసే జగన్మోహన్ రెడ్డి.. పోలీసులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా? ఎన్నెన్ని అడ్డంకులు సృష్టించినా దాటి వెళ్ళిపోతారు. కానీ ప్రజలు కష్టాల్లో ఉంటే ఈ తెగువ ఎందుకు ప్రదర్శించడం లేదు అన్నది ప్రశ్న.

===============

# కమలమా... సైకిలా... ఆలోచనలో వీవీ

విశాఖపట్టణం, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
వి.వి. లక్ష్మీనారాయణ రాజకీయ పార్టీ పెట్టారు. జై భారత్ నేషనల్ పార్టీని పెట్టిన లక్ష్మీనారాయణ ప్రస్తుతం జనం సమస్యలకు దూరంగా ఉంటున్నారు. ఆయన గతకొంతకాలంగా రాజకీయ కార్యక్రమాల్లోనూ పెద్దగా పాల్గొనడం లేదు. సొంత పార్టీ పెట్టిన లక్ష్మీనారాయణ ఏపీలో ఏదైనా రాజకీయ పార్టీలో చేరే అవకాశముందా? అన్న చర్చ కూడా జరుగుతుంది. అయితే ఆయన మాత్రం బయటపడటం లేదు కానీ, లక్ష్మీనారాయణకు మాత్రం పార్లమెంటు సభ్యుడిగా ఎన్నిక కావాలని బలంగా ఉంది. విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఆయన ఎన్నికై లోక్ సభలో అడుగుపెట్టాలని భావించినప్పటికీ రెండుసార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. మరి వచ్చే ఎన్నికలకు ఎలాంటి వ్యూహంతో వెళ్లనున్నారన్నది హాట్ టాపిక్ గా మారింది.. జేడీ లక్ష్మీనారాయణగా దక్షిణాది రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన 1990 నాటి ఐపీఎస్ అధికారి అసలు పేరు వీవీ లక్ష్మీనారా యణ. సీబీఐలో జాయింట్ డైరెక్టర్ గా పనిచేయడంతో ఆయన పేరు జేడీ లక్ష్మీనారాయణగా స్థిరపడిపోయింది. దాదాపు ఏడేళ్ల సర్వీసు ఉండగానే ఉద్యోగానికి స్వచ్ఛంద రాజీనామా ప్రకటించడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. సౌమ్యుడిగా, విజ్ఞాన వంతుడిగా ఆయనకు ఎంతో పేరుంది. మృదు స్వభావిగా కూడా ఆయన పేరు తెచ్చుకున్నారు. వృత్తి రీత్యా ఐపీఎస్ అయినప్పటికీ.. ఆయనలో ఎక్కడా కఠినత్వం జాడలు కూడా మనకు కనిపించవు. ముఖ్యంగా విద్యా విషయాలు, విద్యార్థులకు దిశానిర్దేశం చేయడం వంటి అంశాల్లో జేడీది అందె వేసిన చేయి. వివేకానందుని బోధనలు, దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలా భావనలను జేడీ ఎంతో నమ్మడమే కాకుండా వాటిని ప్రచారం కూడా చేస్తారు. ఇక, ఇప్పుడు ఆయన రాజకీయ నిర్ణయంపై అందరిలోనూ ఆసక్తి ఉంది. మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టిన యావత్‌మల్ సబ్‌డివిజన్ ఏఎస్పీగా మూడేళ్లు, నాందేడ్ ఎస్పీగా మూడేళ్ళు పనిచేశారు. పుణేలోని సాయుధ పోలీసు బెటాలియన్ కమాండెంట్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిం చారు. డీఐజీగా పదోన్నతి పొందిన తర్వాత కేంద్ర సర్వీసులకు వెళ్లి సీబీఐలో బాధ్యతలు స్వీకరించి హైదరాబాద్ విభాగానికి బదిలీ అయ్యారు. హైదరాబాద్‌లోని సీబీఐ విభాగానికి 2006 నుంచి ఏడేళ్లపాటు నేతృత్వం వహించారు. ఇక్కడ ఉన్నప్పుడు లక్ష్మీనారాయణ ఐజీగా పదోన్నతి పొందారు.




ఏడేళ్లలో అక్రమాస్తుల కేసులో జగన్‌తోపాటు ఐఏఎస్ అధికారులు, మంత్రులను అరెస్టు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సత్యం కంప్యూటర్ కుంభకోణమూ ఆయన నేతృత్వంలోనే దర్యాప్తు సాగింది. ఓబులాపురం మైనింగ్ కుంభకోణంలో కర్ణాటక మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డిని అరెస్టు చేశారు. విశాఖ పార్లమెంటు నుంచి... అయితే లక్ష్మీనారాయణ 2019 ఎన్నికలకు ముందు జనసేనలో చేరారు. విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2029 ఎన్నికల నాటికి తన సొంత పార్టీ కాకుండా ఆయన ఏదైనా పార్టీలో చేరి విశాఖపట్నం నుంచి విజయం సాధించాలని కోరుకుంటున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరిస్తారన్న సమయంలోకూ స్టీల్ ప్లాంట్ కార్మికులకు అండగా నిలిచారు. అవసరమైతే తాను టెండర్లలో పాల్గొంటానని చెప్పారు. అలాంటి లక్ష్మీనారాయణ ఇటీవల కాలంలో విశాఖలోనూ పర్యటించడం చాలా అరుదుగానే జరుగుతుంది. ఆయన వచ్చే ఎన్నికల నాటికి మాత్రం ఏదో ఒక పార్టీలో చేరి విశాఖపార్లమెంటు నుంచి పోటీ చేయడం ఖాయమని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏ పార్టీ అన్నది మాత్రం త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశముంది.

## పరుగులు పెడుతున్న వైట్ మెటల్

ముంబై, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
వెండి ధరలు తగ్గాయి. ప్రపంచ వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గాయి, సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ గణనీయంగా తగ్గింది. అయినప్పటికీ వచ్చే ఏడాది వెండి పెట్టుబడిదారులకు 50 శాతం వరకు రాబడిని అందించగలదని నిపుణులు విశ్వసిస్తున్నారు. గత రెండు వారాల్లో వెండి ధర 18 శాతం తగ్గిన తర్వాత, స్టాక్ మార్కెట్ వెలుపల ఆదాయం కోసం చూస్తున్న పెట్టుబడిదారులు కొత్తగా వెండిని కొనుగోలు చేయడాన్ని పరిగణించవచ్చు. ఇటీవలి బలహీనత ఉన్నప్పటికీ వచ్చే ఏడాది నాటికి వెండి 50 శాతం వరకు తిరిగి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. రాబోయే కొన్ని నెలల్లో వెండి ధరలు ఔన్సుకు 50-55 డాలర్ల మధ్య స్థిరంగా ఉంటాయని, ఇటీవలి గరిష్టాల నుండి కొంత లాభం కోలుకునే అవకాశం ఉందని మేం విశ్వసిస్తున్నాము అని నిపుణులు అంటున్నారు. 2026 చివరి నాటికి ఇది ఔన్సుకు 75 డాలర్లకి చేరుకోవచ్చు. డాలర్ 90 వద్ద ఉంటే, దేశీయ ధరలు కిలోకు రూ.240,000కి చేరుకోవచ్చు. అంతర్జాతీయ వెండి ధరలు అక్టోబర్ 16న ఔన్సుకు 54.45 డాలర్ల నుండి 10.9 శాతం తగ్గి 48.59 డాలర్లకి చేరుకున్నాయి, దేశీయ ధరలు అక్టోబర్ 14న కిలోకు రూ.182,500 నుండి 18 శాతం తగ్గి రూ.149,500కి చేరుకున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో మెరుగుదల కారణంగా రిస్క్ అప్పిటైట్ మెరుగుపడటం, సురక్షిత స్వర్గధామాలకు డిమాండ్ పెరగడంతో విలువైన లోహాల పట్ల పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గింది, ఫలితంగా వెండి ధరలు తగ్గాయి. ఈ నెల ప్రారంభంలో భారీ ర్యాలీ తర్వాత ఈ తగ్గుదల వచ్చింది, దీని ఫలితంగా వ్యాపారులు లాభాలను బుక్ చేసుకున్నారు. గత సంవత్సరంలో వెండి డాలర్ పరంగా 44 శాతం, రూపాయి పరంగా 55.72 శాతం రాబడిని ఇచ్చింది.

## ఎల్ ఆర్ఎస్ మరో 3 నెలలు గడువు

విజయవాడ,అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ఆర్ఎస్ గడువు మరో మూడు నెలలు పొడిగించింది. అక్రమ, అనధికారిక లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఆగస్ట్ నెలలో ఏపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తీసుకువచ్చింది. ఈ గడువు అక్టోబర్ 31తో ముగుస్తోంది. అయితే లేఅవుట్ల డెవలపర్లు, ప్లాట్ల యజమానుల నుంచి ఊహించినంత స్పందన లేకపోవటంతో ఎల్ఆర్ఎస్ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని నిర్ణయం తీసుకుంది. జనవరి 23 వరకూ అవకాశం కల్పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం గడువును మరో 3 నెలలు పొడిగించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్‌ను ఈ ఏడాది ఆగస్ట్ నెలలో ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఎల్ఆర్ఎస్ గడువు అక్టోబర్ 31న ముగియనుంది. అయితే ఎల్ఆర్ఎస్ గడువును మరో మూడు నెలలు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం జనవరి 23, 2026 వరకు దరఖాస్తులు దాఖలు చేసుకోవచ్చు. అయితే లేఅవుట్ల డెవలపర్లు, ప్లాట్ల యజమానుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవటంతోనే ఎల్ఆర్ఎస్ గడువును ఏపీ ప్రభుత్వం పొడిగించినట్లు భావిస్తున్నారు. అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించడం కోసం ఆంధ్రప్రదేశ్ ఆమోదం లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ నిబంధనలు, 2020 కింద దరఖాస్తులను సమర్పించడానికి మరో మూడు నెలలు గడువు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని ఏపీ మున్సిపల్ పరిపాలన ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ గడువును 23.01.2026 వరకు పొడిగించినట్లు వెల్లడించారు. మరోవైపు అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం



ఈ ఏడాది ఆగస్టు నెలలో ఒఖీని తిరిగి ప్రవేశపెట్టింది. 2014 - 2019 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అమలు చేసింది. 2024 ఎన్నికల్లో గెలిచి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం .. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన లేఅవుట్లపై అధ్యయనం చేపట్టింది. ఈ క్రమంలోనే అక్రమ లేఅవుట్లు ఎక్కువగా ఉన్నాయని గుర్తించిన ప్రభుత్వం.. ఖజానాకు అదనపు ఆదాయాన్ని సేకరించడానికి ఒఖీను తిరిగి ప్రారంభించింది. ఈ క్రమంలోనే మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ.. మున్సిపల్ కమిషనర్లు, పట్టణాభివృద్ధి అధికారులకు అక్రమ, అనధికార లేఅవుట్లను నియంత్రించాలని మార్గదర్శకాలను జారీ చేసింది. అక్రమ లేఅవుట్లను తొలగించాలని లేదా లేఅవుట్ల డెవలపర్లు ఒఖీ కింద దరఖాస్తులు చేసేలా ప్రోత్సహించాలని ఆదేశించింది. అయితే ఎల్ఆర్ఎస్‌కు ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవటంతో మరో మూడు నెలలు గడువు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. జనవరి 23వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

==================

## అనంత వైసీపీలో షాక్..

అనంతపురం, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
విపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా అభివృద్ధికి అడ్డుపడుతున్నారనే ఆరోపణలపై కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్ కుమార్‌ను ప్రభుత్వం పదవి నుంచి తొలగించింది. ఆరోపణలపై నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటంతోనే ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీలోని పలువురు నేతలు, ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. ముఖ్య నేతలు మొదలుకుని.. ద్వితీయ శ్రేణి నాయకులు కూడా కూటమి పార్టీల్లో చేరిన పరిస్థితి. ఇక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు గురించి చెప్పాల్సిన పని లేదు. దీంతో చాలా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వైసీపీ అధికారం కోల్పోయింది. తాజాగా అనంతపురం జిల్లాలో వైసీపీకి షాక్ తగిలింది. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్ కుమార్‌ను.. ప్రభుత్వం ఛైర్మన్ పదవి నుంచి తప్పించింది. మున్సిపల్ ఛైర్మన్‌గా ఉన్న రాజ్ కుమార్.. 15 నెలలుగా కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సెప్టెంబర్ 22న షోకాజ్ నోటీసులు ఇచ్చింది. అయితే ప్రభుత్వం నుంచి షోకాజ్ నోటీసులు అందుకున్న మున్సిపల్ ఛైర్మన్ రాజ్ కుమార్.. నోటీసులపై వివరణ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 15 రోజుల్లోగా వివరణ ఇవ్వకపోవడంతో కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ రాజ్‌కుమార్‌ను పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధులకు విరుద్ధంగా వ్యవహరించడంతో పాటుగా కౌన్సిల్ సమావేశాలు నిర్వహించలేదనే కారణాలతో పదవి నుంచి తొలగిస్తూ ఏపీ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు 2024 నవంబర్ నెల నుంచి 2025 ఏప్రిల్ నెల వరకూ.. రెండు నెలల వ్యవధిలో నిర్వహించాల్సిన కౌన్సిల్ మీటింగులను రాజ్ కుమార్ నిర్వహించలేదని జీవోలో పేర్కొంది. మరోవైపు తలారి రాజ్ కుమార్.. పండ్లు విక్రయించే వ్యాపారి. మున్సిపల్ ఛైర్మన్ కాకముందు తోపుడు బండిపై పండ్లు విక్రయించేవారు. ఇంటర్ వరకూ చదువుకున్నారు. తలారి రాజ్ కుమార్‌కు భార్య విజయలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణలో భాగంగా రాజ్ కుమార్ 2021కి ముందు తోపుడుబండిపై పండ్లు విక్రయించేవారు. అయితే వైసీపీపై అభిమానంతో ఆ పార్టీలో కార్యకర్తగా పనిచేసేవారు. ఈ క్రమంలోనే వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఆయనకు లభించింది. కళ్యాణదుర్గం పదో వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలుపొందారు. అయితే ఆ తర్వాత ఆయనకు జాక్ పాట్ తగిలింది. ఊహించని విధంగా కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవి వరించింది. అయితే ప్రభుత్వం మారటం.. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన తన పదవిని కోల్పోయారు.

# కలకలం రేపుతున్న ఆపరేషన్ షట్టర్

జైపూర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
ఆపరేషన్ షట్టర్ డౌన్ లో రాజస్థాన్ లోని ఝులావర్ పోలీసులు కేంద్ర ప్రభుత్వ సామాజిక పథకాలకు సంబంధించిన దేశంలోనే అతిపెద్ద సైబర్ మోసాన్ని బయటపెట్టారు. ఈ ముఠాలోని ఎనిమిది మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ లోని కలెక్టర్లతో సహా దేశవ్యాప్తంగా 1,256 మంది అధికారుల లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను తస్కరించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తులు 4,00,000 అద్దె ఖాతాలకు కోట్ల రూపాయలను బదిలీ చేశారు. జైపూర్‌లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా ఉన్న మహ్మద్ లాయక్ ఈ మోసానికి ప్రధాన సూత్రధారిగా పోలీసులు నిర్ధారించారు. ఈ కుంభకోణంలో కేంద్ర ప్రభుత్వ అధికారి కూడా ప్రమేయం ఉందని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నేపథ్యంలోనే 11,000 ఖాతాలను స్తంభింపజేశారు. 10,000 ఖాతాలపై దర్యాప్తు జరుగుతోంది. ఇందుకు సంబంధించి ఝులావర్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అమిత్ కుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. "ఇప్పటివరకు ఎంత డబ్బు బదిలీ చేశారన్న దానిపై దర్యాప్తు జరుగుతోంది" అని అన్నారు. నాగౌర్, టోంక్, బార్మెర్, ఝులావర్, భరత్‌పూర్, ఫలోడి కలెక్టర్ల లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, జనధార్ పోర్టల్, సామాజిక భద్రతా పెన్షన్ పోర్టల్, విపత్తు నిర్వహణ శాఖ కు చెందిన ఆఓమా పోర్టల్ ద్వారా మోసానికి పాల్పడ్డట్లు పోలీసులు గుర్తించారు. మోసగాళ్ల నెట్‌వర్క్ రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, అస్సాం, మణిపూర్ సహా అన్ని రాష్ట్రాలలో విస్తరించి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్టు చేసిన నిందితుల్లో రాష్ట్ర నోడల్ కార్యాలయంలోని ఆపరేటర్ల నుండి కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగుల వరకు ఉన్నారని పోలీసు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. వివిధ రాష్ట్రాల నుండి లక్షలాది మంది లబ్ధిదారులకు చెందిన అనుమానాస్పద డేటా, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లను హ్యాక్ చేయడం ద్వారా లక్షలాది రూపాయలను మోసం చేశారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి పథకం కింద వారు అనేక మంది నకిలీ రైతులను కూడా సృష్టించారు. ఫలితంగా కోట్లాది రూపాయలను కొట్టగొట్టారు. నిందితుడు మొహమ్మద్ లాయక్ జైపూర్‌లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే అదునుగా రాష్ట్ర నోడల్ కార్యాలయం అధికారిక ఐడీలను యాక్సెస్ చేయగలిగాడని పోలీసు సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ప్రైవేట్ వ్యక్తులు అధికారం కోసం ఉపయోగించడానికి రాష్ట్రంలోని జిల్లా నోడల్ కార్యాలయాల నుండి ఐడీలను సృష్టించడానికి అతను దీనిని ఉపయోగించాడు. నిందితులు కార్యాలయ సమయాల్లో, సాధారణంగా రాత్రి సమయంలో చట్టవిరుద్ధంగా సృష్టించిన లను యాక్టివేట్ చేసి, ఉదయం కార్యాలయం నుండి తిరిగి వచ్చిన తర్వాత వాటిని డీయాక్టివేట్ చేసేవాడని ఎస్పీ తెలిపారు. ఏజెంట్లు క్లోజ్డ్ ఖాతాల డేటాను సేకరించి నోడల్ అధికారి లాగిన్ ద్వారా పంపారని ఎస్పీ తెలిపారు. గ్రామాల్లో, ముఠా ఏజెంట్లు అనర్హులైన లబ్ధిదారుల డేటాను సేకరించారు. వారి రిజిస్ట్రేషన్ ల్యాండ్ సీడింగ్ లేదా ఇతర కారణాల వల్ల నిష్క్రియంగా ఉంది. వారు పథకాలకు మళ్లీ జోడించే నెపంతో ఆధార్, ఖాతా వివరాలను ప్రధాన ఏజెంట్‌కు ఇచ్చారు. తర్వాత వారు ఎక్సెల్ షీట్‌ను రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్‌కు పంపారు. రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్ జిల్లా నోడల్ అధికారుల కొత్త ఐడీలను సృష్టించారు. రాష్ట్ర నోడల్ కార్యాలయ ఆపరేటర్, మోసగాళ్ళు ని దాటవేయడం ద్వారా అనర్హులైన వ్యక్తులను కిసాన్ సమ్మాన్ నిధికి అనధికారికంగా అర్హులుగా చేయడానికి కార్యాలయ సమయాల్లో, రాత్రి సమయం తర్వాత లాగిన్ లను ఉపయోగించారు. తరువాత, నిందితులు లాగిన్ లను తొలగించారని పోలీసులు తెలిపారు. మొహమ్మద్ లాయక్: అతను జైపూర్‌లోని ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన రాష్ట్ర నోడల్ కార్యాలయంలో ఆపరేటర్‌గా ఉన్నాడు. రాష్ట్ర నోడల్ కార్యాలయం అధికారిక ఐడీ లను యాక్సెస్ చేయగలిగాడు.

ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా ఉపయోగించడానికి రాష్ట్ర, జిల్లా నోడల్ కార్యాలయాల లను సృష్టించడానికి అతను దీనిని ఉపయోగించాడు.

ఇదిలావుంటే, మరో నిందితుడు షఫీక్ ఝులావర్‌కు పారిపోయాడు. ప్రస్తుతం అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. మొహమ్మద్ షాహిద్: భరత్‌పూర్ నివాసి అయిన షాహిద్, ల్యాండ్ డెవలప్‌మెంట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నప్పుడు, అనర్హుల మోసపూరిత యాక్టివేషన్‌లో లాయక్‌తో పరిచయం ఏర్పడింది .నైరుతి ఢిల్లీ నివాసి సుభాష్ కశ్యప్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. పంజాబ్‌లోని జలంధర్ నివాసి రోహిత్ కుమార్.. వివిధ రాష్ట్రాల రైతు పథకాల క్లోన్ వెబ్‌సైట్‌లను సృష్టించడం వెనుక ప్రధాన సూత్రధారి. పంజాబ్‌లోని జలంధర్ నివాసి సందీప్ శర్మ క్లోన్ వెబ్‌సైట్ డెవలపర్ జలంధర్ నుండి అదుపులోకి తీసుకున్నారు. పంజాబ్‌లోని జలంధర్ నివాసి సునత్ శర్మ, రాజస్థాన్ ఖరా జిల్లా ఫలోడి నివాసి రమేష్ చంద్ర, రాజస్థాన్‌లోని దోస్సా జిల్లా నివాసి భాగ్‌చంద్ సైనీని పోలీసులు అరెస్ట్ చేసి కూపీ లాగుతున్నారు.

# ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలనీ నిరసన

## ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సీఎంరేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర



కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8000 కోట్లకు పైగా విద్యార్థులకు రావాల్సిన బకాయిలు పెండింగ్లో ఉందన్నారు. విద్యార్థులు కళాశాల యజమాన్యాలు అనేక ఇబ్బందులు పడుతున్నారనీ ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే పెండింగ్ బకాయిలు విడుదల చేస్తానని మేనిఫెస్టోలో పెట్టి విస్మరించారని చెప్పారు. విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. రియంబర్స్మెంట్ బకాయిలు క్లియర్ చేస్తే సర్టిఫికెట్లు ఇస్తామని వారిని తిరిగి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కళాశాల యాజమాన్యాలకు అధిక భారం అవుతుందని కళాశాలలు మూసివేసి రోడ్లమీదకి వచ్చి ధర్నాలు చేసే పరిస్థితి దాపురించాయని జోస్యం చెప్పారు. యాజమాన్యాలతో చర్చలు చేపట్టి 1200 కోట్లు విడుదల చేస్తామని హామీ మరిచిరాని చెప్పారు. యాజమాన్యాలు, కళాశాలల పైన విజిలెన్స్ దాడులను నిర్వహిస్తూ విద్యారంగాన్ని గాలికొదిలేశారని చెప్పారు. విజిలెన్స్ అనేది సిగ్గుమాల చర్య అని హెచ్చరించారు. విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా రియంబర్స్మెంట్ రాకపోవడంతో వారి చదువులకు దూరం అవుతున్నారని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మీద ఉన్న శ్రద్ధ కనీసం విద్యార్థుల భవిష్యత్తుపై లేదని ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక్కరోజు విద్యార్థుల పక్షాన కేబినెట్లో ప్రస్తావించకపోడడం సిగ్గుచేటు అన్నారు. వారి సొంత ప్రయోజనాల కోసం మాత్రమే మంత్రుల పదవులలో ఉంటూ రాజకీయంగా లబ్ధి పొందుతూ, ఓటు వేసిన విద్యార్థిని విద్యార్థులను వెన్నుపోటు పొడుస్తున్నారని చెప్పారు. మంత్రులకు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రికి విద్యార్థులు తప్పకుండా బుద్ధి చెబుతారని తెలిపారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి పెండింగ్ బకాలను విడుదల చేయాలని, లేనియెడల సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఆసపెల్లి వినయ్ సాగర్, దుర్గం భోగేష్, జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, జిల్లా కమిటీ సభ్యులు అంబాల సందేశ్, రాకేష్, రక్షక్, నరేష్, నాయకులు సన్నీ, అంజి, అభి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# 42శాతం బిసి రిజర్వేషన్ అమలు చేయాలని నవంబర్ 10న జిల్లా కలెక్టర్ ల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇవ్వండి :

### బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 30: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం ప్రకారం బిసి కులాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42% రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లా కలెక్టర్ ల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు పంపాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర కమిటి నిర్ణయించడం జరిగిందని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పి రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తెలిపారు. గురువారం కామారెడ్డి బిఎల్ టీయూ జిల్లా కార్యలయంలో బహుజన లెఫ్ట్ పార్టి (బిఎల్ పి)జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసి కులాల ప్రజలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో 42% రిజర్వేషన్ల అమలుకు రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్ లో చేర్చి పార్లమెంట్ లో చట్టం చేయాలని తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి, రాష్ట్ర గవర్నర్ లకు తీర్మానం లేఖలను పంపిన ఇంతవరకు స్పందించక పోవడం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ బిసి కులాల వ్యతిరేక వైఖరిని స్పష్టం చేస్తున్నారు.
రాష్ట్ర కమిటి పిలుపు మేరకు నవంబర్ 10న 42% బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వినతి పత్రాలు పంపాలని దండి వెంకట్ బిసి కులాల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బిఎల్ పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ది రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి వడ్ల సాయి కృష్ణ, రాష్ట్ర నాయకులు ముద్రకోల ఆంజనేయులు, నాగపూరు యెల్లయ్య, జిల్లా కమిటి సభ్యులు, కే. గంగామణీ, వడ్ల స్వప్న, అవుల లక్ష్మీ, జిలుకరి రాజశేఖర్, చౌకి ప్రసాద్, కూచిని శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు అప్రపత్తంగా ఉండండి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,అక్టోబర్ 30 (భారత శక్తి): జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ ప్రాజెక్టుల పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నది%-%వాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద నీటితో కడెం, గడ్డెన్న, స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తనున్న నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, ఇతరులు వెళ్లకూడదని హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం 24 గంటలు అప్రమత్తంగా ఉందని, ఎన్ డి ఆర్ ఎఫ్ టీంలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 91005 77132 ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యం పైన నివేదిక సమర్పించాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవర్



సూర్యాపేట, భారత శక్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 30:
భారీ వర్ష ప్రభావిత ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా తడిసిన ధాన్యం ఉంటే వెంటనే నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ వి సి ఛాంబర్ లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడుతూ మొంధా తుఫాన్ వల్ల జిల్లాలో అధిక వర్షాలు కురుస్తాయని అధికారులను, రైతులను అప్రమత్తం చేయడం వల్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులపై టార్పాలిన్ పట్టాలు కప్పటం వల్ల ఎక్కువగా ధాన్యం తడవలేదని అడుగు భాగాన గాని, చివరి అంచుల్లో గాని తడిస్తే వెంటనే మిల్లులకి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక ప్రత్యేక అధికారిని ఇంచార్జిగా నియమించాలని అవసరం ఉన్న చోట ధాన్యాన్ని దగ్గరలోని ఫంక్షన్ హాల్ లో నిలువ చేసుకోవాలని,ప్రతి రోజు సాయంత్రం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యంపై నివేదిక తప్పని సరిగా సమర్పించాలని ఆదేశించారు. తడిసిన ధాన్యం పై అలాగే ఎక్కడైనా ధాన్యం కొట్టుకుపోయిన వెంటనే తమకు తెలియజేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో 24 గంటల పాటు 6281492368 నెంబర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనైనదని ఎవరికైనా ధాన్యం కొనుగోలు, వర్షం వల్ల ఏదైనా సమస్య ఉంటే వెంటనే ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు.వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు మీ ప్రాంతంలోని పంట నష్టం అంచనాలను క్షేత్రస్థాయిలో పర్యటించి రూపొందించాలని,వరి పంట కోతకు రాని పొలాలను పచ్చిగా ఉన్నప్పుడు కోయకుండా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రెవిన్యూ అధికారులు, సివిల్ సప్లై అధికారులు మీ పరిధిలో ఉన్న బ్రాయిలర్ మిల్లులను సందర్శించి తడిచిన ధాన్యాన్ని బ్రాయిలర్ మిల్లులకు తరలించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు పర్యటించి ఎక్కడైనా రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు డ్యామేజ్ అయితే రవాణా సౌకర్యానికి భంగం కలగకుండా వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టాలని ఆదేశించారు.ఎలక్ట్రిసిటీ,త్రాగునీరు సరఫరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఎక్కువ వర్షపాతం నమోదైనా చోట సీజనల్ వ్యాధులు, నీటి సంబంధిత వ్యాధులు వ్యాపించే అవకాశం వుంది కాబట్టి అక్కడ పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వచ్చే 21 రోజులు పాటు వైద్య ఆరోగ్య శాఖ వారు పంచాయతీరాజ్ శాఖ వారిని సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు.జిల్లాలో 80 శాతం చెరువులు పూర్తిగా నిండి ఉన్నాయని,మిగిలినవి 75 % వరకు నిండి ఉన్నాయి కాబట్టి ఎక్కడైనా చెరువు కట్టలు బలహీనంగా ఉంటే తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని, చెరువు కింద ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని,
మూసి, బికేరువాగు, పాలేరువాగు నిండుగా ప్రవహిస్తున్నందున పరివాహక ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్,పోలీస్,రెవెన్యూ అధికారులను ఆదేశించారు.
అధికారులను ముందుగానే అప్రమత్తం చేయటం ద్వారా ప్రాణ నష్టం, పశు నష్టం లు జరగకుండా చూసామని పంట నష్టం పై రెండు రోజుల్లో పూర్తి నివేదిక ఇవ్వాలని అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు.ఎస్పి కే నర్సింహ మాట్లాడుతూ మూసి పరివాహక ప్రాంతాల్లో ఎవరు ప్రాణాలకు ముప్పు కలవకుండా అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని లోతటు ప్రాంతాల్లో, కాలువలు ,బ్రిడ్జిలు వద్ద పై నుండి నీరు ప్రహహిస్తే రాకపోకలను ఆపేసి మరమ్మత్తులు చేపించిన తర్వాత రవాణాకు అవకాశం కల్పించాలని సూచించారు.
అదనపు కలెక్టర్ కె సీతారామారావు మాట్లాడుతూ పంచాయతి సెక్రటరీ,గ్రామపాలనాధికారి అలాగే సీసీలలో ఒక్కరిని ప్రతి కొనుగోలు కేంద్రానికి ఇన్చార్జిగా నియమించి వారిని ఆ కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టే విధంగా చూడాలని తహసిల్దార్లను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జెడ్పి సీఈవో వి వి అప్పారావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ యాదగిరి,ఆర్ అండ్ బి ఈఈ సీతారామయ్య, పంచాయతీ రాజ్ ఈఈ లు వెంకటయ్య, మాధవి, ఇరిగేషన్ ఎస్సీ శివ ధర్మ,డిఎస్ఓ మోహన్ బాబు,డిఎం రాము, డి సి ఓ పద్మ, రవాణా అధికారి జయప్రకాష్ రెడ్డి,అగ్నిమాపక అధికారి కృష్ణారెడ్డి , డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్, సిపిఓ కిషన్, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి తదితరులు హాజరయ్యారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

### -మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 30: వర్షాల కారణంగా పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులు ప్రభావితమవుతున్న నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో రాజంపేట పారిశుద్ధ్య పనుల తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు.
మురుగు నీటి పారుదల, చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా నీటి నిల్వలు లేకుండా చూడాలని, చెత్తను సమయానికి తరలించడంతో పాటు, శానిటేషన్ వర్కర్ల పర్యవేక్షణలో ఉండేలా చూడాలని సూచించారు.
"వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని నివారించేందుకు పారిశుద్ధ్యం అత్యంత ప్రాధాన్యత కలిగినదని అధికారులు, మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు.
మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించారు.
అనంతరం రాజంపేటలో లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల పురోగతిని పరిశీలించి, మాట్లాడుతూ,
నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేల లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, మార్కౌవుట్ అయిన వివరాలు అధికారులను అడిగి తెలుసుకొని వంద శాతం మార్కావుట్ పనులు పూర్తి చేయాలని, బేస్ మెంట్, రూఫ్, స్లాబ్ స్థాయిల వారీగా పూర్తి అయిన పనులకు సంబంధించి లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ గృహ నిర్మాణాలు పరిశీలిస్తూ, లబ్ధిదారులు ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ముచ్చటించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులు ఇంటి నిర్మాణాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయినప్పటికీ నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారులను ప్రోత్సహించి, త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు.
తదుపరి సరంపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారుడి ఇంటి నిర్మాణం భూమిపూజ లో పాల్గొన్నారు. కమిటీ సభ్యులతో సమావేశమై, ఇండ్ల నిర్మాణం వేగవంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఇంకా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసిన పక్షంలో వారికి కూడా శాంక్షన్ మంజూరు చేస్తామని తెలిపారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో ఫైనాన్షియల్ గా ఇబ్బందులు తలెత్తితే ఐకెపి ద్వారా మహిళా సంఘాల ద్వారా బ్యాంక్ రుణాలు ఇప్పించి లబ్దిదారులకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మదన్మోహన్, పి.డి. హౌసింగ్ శ్రీ జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. రాజేందర్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్, ఆర్.ఐలు, వార్డ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# కిస్తీ కట్టలేక... ఆటోల అమ్మకం...

నిజామాబాద్, అక్టోబరు 30, (
రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టడంతో మహిళలు బస్సులలో ప్రయాణం చేస్తున్నారు. దీంతో ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. మహిళా ప్రయాణికులు లేక ఆటోలు వేలవేల బోతున్నాయి. కేవలం పురుషులు మాత్రమే ఆటోలలో ప్రయాణం చేస్తున్నాడంతో ఆటోవాలాలకు భారీగా గిరాకీ తగ్గింది. గతంలో ఎక్కడ చూసినా ఆటోలల్లో మహిళలు కనిపించేవారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో మహిళలు ప్రయాణం చేసేందుకు ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల లో ప్రయాణం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఆటోవాలా ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. ఫైనాన్సులలో తెచ్చుకున్న వారు ఫైనాన్స్ కిస్తీలు చెల్లించక ఆటోలను అమ్ముకుంటున్నారు. మరికొందరు కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.ప్రభుత్వం ఆటోవాలాలకు నెలసరిగా పింఛన్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అమలు చేయడం లేదు. ఉపాధి దెబ్బ తినడంతో ఆటోవాలాలు అవస్థలు పడుతున్నారు. గులాబీ పార్టీ ప్రభుత్వ హాయంలో రయ్యు.. రయ్యున తిరిగే ఆటోల స్పీడుకు కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో బ్రేక్ పడింది. దినమంతా కిటకిటలాడే ఆటో స్టాండ్ లలో ప్రయాణికుల జాడే కనిపించకుండా పోయింది.మహిళలకు ఉచిత ప్రయాణం పేరిట మహాలక్ష్మి పథకాన్ని అమలులోకి తేవడంతో ఆటోవాలాల ఆదాయానికి గండి పడింది. పొద్దంతా అడ్డాలో కూసున్న.. సంపాదన మాత్రం సున్నా గా మారింది. తెలంగాణలో ఆటో రిక్షా కార్మికుల పరిస్థితి ఇలా ఉంటే, ఆంధ్రప్రదేశ్లో మాత్రం అక్కడి ప్రభుత్వం దీపావళి కానుకగా ప్రతి ఆటో రిక్షా కార్మికుడికి 15వేల రూపాయల చొప్పున వారి వారి ఖాతాలో జమ చేస్తున్నట్లు ప్రకటించడం పై ఇక్కడి ఆటో రిక్షా సంఘాల్లో ఆందోళన మొదలైంది.తమ కూడా ఆంధ్రాలో ఇస్తున్నట్లుగా తెలంగాణ ఆటో రిక్షా కార్మికులకు దీపావళి కానుక అందించాలంటూ వారి నుండి డిమాండ్ తెరపైకి వస్తుంది. కాగా, గతంలో ఆటోలు మహిళలతోనే నిండుగా కనిపించేవి. ప్రస్తుతం మహిళా ప్రయాణికులు అందరూ ఆధార్ కార్డుతో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తుండడం వల్ల ఆటోలలో మహిళల సందడి లేకుండా ఉంది. నిజానికి పల్లె నుండి పట్టణానికి రావాలన్న, పట్టణవాసులు మార్కెట్లో ఏదైనా ఖరీదు చేయాలన్న ఆటోలను మహిళల ఆశ్రయించే పరిస్థితి ఉండేది.దీంతో ఆటోవాలాలు రోజుకు 1000 నుండి 1500 రూపాయల వరకు సంపాదించుకునేవారు. ఆర్టీసీ బస్టాండ్ ల ముందు ఆటో అడ్డాలు ఉండటం వల్ల ప్రయాణికులు దూర ప్రాంతాల నుండి వచ్చిన, సమీపంలో ఉన్న పల్లెలకు వెళ్లాలన్న ఆటోలోనే ప్రయాణం చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మహిళలు ఎక్కడికి వెళ్లాలన్నా ఆర్టీసీ బస్సులను మాత్రమే ఆశ్రయిస్తున్నారు. చివరకు పట్టణంలోని మార్కెట్ కు వెళ్లాలన్న బస్సులోనే ప్రయాణం సాగిస్తున్నారు

# పారమిత విద్యార్థుల కిసాన్ వ్యవసాయ క్షేత్ర పర్యటన



కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):అల్గునూర్లోని పారమిత వరల్డ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పర్యవేక్షణలో భువనగిరి సమీపంలోని వన్ డే కిసాన్ వ్యవసాయ క్షేత్రాన్ని గురువారం సందర్శించారు.ఫీల్డ్ ట్రిప్ లో పర్యటనలో విద్యార్థులు పంటల సాగు విధానాలు, సేంద్రీయ ఎరువుల తయారీ, పశు సంరక్షణ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు వంటి అంశాలను ప్రత్యక్షంగా వీక్షించారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, మోట ఎలా కొట్టేవారు యంత్ర సహాయంతో వ్యవసాయం చేస్తున్న విధానాలు వారికి ఆసక్తికరంగా అనిపించాయి.అలాగే విద్యార్థులు పూర్వకాలంలో రైతులు వ్యవసాయం చేసిన పద్ధతులను, ఉపయోగించిన పరికరాలను చూశారు. అప్పట్లో కుందెన (ధాన్యం వడకట్టే పరికరం), రుబ్బురోలు (ధాన్యం లేదా పప్పులు రుబ్బడానికి వాడే రాయి పరికరం), కుమ్మరి చక్రంతో కుండలు ఎలా తయారు చేస్తారో నేర్చుకున్నారు. ఎద్దుల దున్నె, కోడవలి, గొడ్డలి వంటి సాధనాలతో రైతులు కష్టపడి వ్యవసాయం చేసేవారని తెలుసుకున్నారు.పూర్వీకులు ప్రకృతిని సంరక్షిస్తూ, వర్షాధార వ్యవసాయం చేసేవారు. తమ శ్రమతోనే కుటుంబానికి, సమాజానికి ఆహార భద్రత కల్పించేవారని విద్యార్థులు గ్రహించారు.
ఈ పర్యటన ద్వారా విద్యార్థులు పంటల పెరుగుదలలో నేల గుణాత్మకత, నీటి వినియోగం, రైతుల కృషి, సేంద్రీయ సాగు ప్రాముఖ్యతను తెలుసుకున్నారు. వ్యవసాయం పట్ల గౌరవభావం, స్వావలంబన, ప్రకృతి ప్రేమ పెరిగినట్లు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వి.యూ. ఎం. ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎం. శ్రీకర్,పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వాసనీయతకు పట్టంకండి

### -కాంగ్రెస్ పార్టీ ఎంపీ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల

కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
విశ్వాసంగా సేవలందించడమే ధ్యేయంగా మీ ముందుకు వచ్చిన మా పానెల్ అభ్యర్థులను అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఏలాంటి లాభాపేక్ష లేకుండా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, వారిని ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం కరీంనగర్ లోని లేక్ పోలీస్ స్టేషన్, మానేరు డ్యాం కట్టపై అర్బన్ బ్యాంకు అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాకర్స్, మహిళలు, సీనియర్ సిటిజన్స్, స్విమ్మర్స్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పలువురని కలిసి మా అభ్యర్థులను గెలిపించాలని కోరారు.విశ్వాసంగా. అవినీతి రహితంగా సభ్యులు మెచ్చేలా.. డిపాజిట్లకు రక్షణ కల్పించేలా.. వారిలో నమ్మకం కలిగేలా అర్బన్ బ్యాంకును తెలంగాణ రాష్ట్రంలోనే స్మార్ట్ బ్యాంకుగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. జాతీయ బ్యాంకులకు దీటుగా అర్బన్ బ్యాంకును తీర్చిదిద్దుతామని మెరుగైన సేవలు అందించేలా డిజిటలైజేషన్ హామీ ఇచ్చారు. ఖాతాదారులకు వెంట వెంటనే సేవలు అందేలా బ్యాంకును సంస్కరిస్తామని చెప్పారు. అభివృద్ధిలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ జగపతిరావు కీలక పాత్ర ఉందని తెలిపారు. గతంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికల్లో నాలుగుసార్లు సొంతంగా ప్యానల్ ఏర్పాటు చేసి గెలిపించుకున్నారనీ, రెండుసార్లు ముద్దసాని కనుకయ్య ఒకసారి బొమ్మరాతి రాజేశం మరోసారి డి శంకర్ కు చైర్మన్ గా అవకాశం కల్పించారని తెలిపారు. ఎక్కడికెళ్లినా అర్బన్ బ్యాంక్ మెంబర్లు తమ ప్యానెల్ కు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారనీ, బారి మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గతంలో అవినీతి ఆరోపణలు చేసుకున్న వారు, ఎన్నికలను ఆపిన వారు మళ్లీ అధికారం కోసం ప్రాకులాడుతున్నారనీ ఆరోపించారు. అర్బన్ బ్యాంక్ మెంబర్లు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మళ్లీ ముందుకు వచ్చి ఓట్లు అడగడం విచిత్రంగా ఉందని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంక్ మెంబర్లు అప్రమత్తంగా ఉండి తమ ప్యానెల్ ను ఆదరించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పోటీచేస్తున్న అభ్యర్థులు మూల వెంకట రవీందర్ రెడ్డి, ఇ లక్ష్మణ్ రాజు, అనురాసు కుమార్, వజీర్ అహ్మద్, ఉయ్యాల ఆనందం, చిందం శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, మన్నె అనంత రాజు, మునిఫల్లి ఫణిత, దామెర శ్రీలత రెడ్డి కాంగ్రెస్ నాయకులు, ఆకుల ఉదయ్ అనంతుల రమేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పవిత్ర పుణ్యక్షేత్రంలో ఉద్యోగిగా పని చేస్తూ అవినీతికి పాల్పడడం సిగ్గు చేటు

### - గుట్ట దేవాలయంలో అవినీతి అధికారుల అక్రమాస్తులను దేవాలయానికి అటాచ్ చేయాలని సిపిఐ డిమాండ్



అక్టోబర్ 30, భారతశక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఉన్నత స్థాయి ఉద్యోగిగా పని చేస్తూ అవినీతికి పాల్పడడం సిగ్గుచేటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ తెలిపారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అవినీతి అధికారుల ఆస్తులన్నింటినీ దేవాలయానికి అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన యాదగిరిగుట్ట పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేవాలయం ప్రసాద తయారీ మిషన్ నిర్వహణ కాంట్రాక్టర్ కు చెల్లించవలసిన 11 లక్షల రూపాయల బిల్లును ఇవ్వడం కోసం 20% డబ్బులు తనకి ఇవ్వాలని సదరు కాంట్రాక్టర్ ను డిమాండ్ చేసి 1,90,000 రూపాయల లంచం తీసుకుంటూ బుధవారం రాత్రి ఏసీబీకి చిక్కిన ఊడెపు వెంకట రామారావు పవిత్రమైన పుణ్యక్షేత్రంలో ఉన్నత స్థాయి అధికారిగా పని చేస్తూ ఎంతో నిజాయితీగా పని చేయాల్సిన అధికారి ఈ రకమైన అవినీతికి అక్రమాలకు పాల్పడడం సిగ్గుచేటని అన్నారు. ఒక ఇంక్రిమెంట్ రాకుండా ఉంటేనే ప్రమోషన్ కు అర్హతను కోల్పోతాడు కానీ రామారావుకు మూడు ఇంక్రిమెంట్లు కూడా రాకుండా ఉన్నప్పటికీ అతనికి మాత్రం మూడు ప్రమోషన్లు ఇచ్చి అవినీతి అధికారిగా తయారు చేశారని, దేవదాయ కమిషనర్ కి, గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి యాదాద్రి దేవాలయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపైన అనేకసార్లు భారత కమ్యూనిస్టు పార్టీ తరపున అనేక ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ రకంగా అధికారులపైన నిర్లక్ష్యంగా ఉండడం వలన వాళ్ళ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే దేవదాయ శాఖ కమిషనర్ విజిలెన్స్ ద్వారా యాదాద్రి దేవాలయంలో విచారణ జరిపించి అవినీతి అక్రమాలపైన సమగ్ర నివేదిక తయారుచేసి అవినీతి అక్రమాలకు పాల్పడి సంపాదించిన అక్రమ ఆస్తులను దేవాలయానికి అటాచ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లెపల్లి మహేందర్, సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఎఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు, సిపిఐ మండల నాయకులు గుండు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రంగులకు భావుకత నేర్పిన రాజా రవి

"తైల వర్ణాలలో అద్భుతమైన చిత్రాలను, పౌరాణిక ఘట్టాలను చిత్రించిన తొలి భారతీయ చిత్రకారుడు రవివర్మ".

"ఎంతటి పేరుప్రఖ్యాతులు గడించిన, విమర్శలు, కుటుంబ సమస్యలు ఎదురైన తన చిత్రకళ కొరకు కడదాక ప్రయత్నం చేసిన భారతీయ చిత్రకారుడు రవివర్మ"

రాజా రవి వర్మ రామాయణ, మహాభారతం లోని ఘట్టాలను చిత్రాలుగా మలచి మంచి గుర్తింపు పొందాడు. భారతీయ సాంప్రదాయిక, పాశ్చాత్య చిత్రకళా మేళకువల సంగమానికి రవివర్మ చిత్రాలు చక్కని ఉదాహరణలు.చీరకట్టుకున్న స్త్రీలను అందంగా, చక్కని వంపు సొంపులతో చిత్రించడంలో అతనికి అతనే సాటి. 1873లో జరిగిన వియన్నా కళా ప్రదర్శనలో మొదటి బహుమతిని గెలుచుకున్నప్పుడు ఆయన గురించి ప్రపంచానికి తెలిసింది. అప్పటి వరకు ఆయనో సాధారణ చిత్రకారుడు మాత్రమే. భారతీయ చిత్రకళా చరిత్రలో గొప్ప చిత్రకారునిగా గుర్తింపు పొందిన రాజా రవి వర్మ 1906లో 58 సంవత్సరాల వయసులో మధుమేహంతో మరణించాడు. ఇతను మరణించేనాటికి కిలామానూరు ప్యాలెస్‌లో 160 దాకా రవివర్మ చిత్రాలు ఉండేవని,ఆ తరువాత వాటిని అధికారికంగా తిరువనంతపురంలోని చిత్రా ఆర్ట్ గ్యాలరీకి అందచేసినట్టు తెలుస్తుంది.కిలమానూరు ప్యాలెస్‌లో రవివర్మ పుట్టిన ఇల్లు,ముందు భాగంలో ఇతని స్టూడియోలను ఇప్పుడు కూడా చూడవచ్చు.

రాజా రవివర్మ కేరళలో తిరువనంతపురానికి 25 మైళ్ళ దూరంలోని కిలమానూరు రాజప్రాసాదంలో ఉమాంబ తాంబురాట్టి, నీలకంఠన్ భట్టాద్రిపాద్ దంపతులకు 1848 ఏప్రిల్ 29న జన్మించాడు.చిన్నతనంలోనే ఇతను చూపిన ప్రతిభ వలన ఇతనిని, ట్రావెన్ కూర్ మహారాజా అయిల్యమ్ తిరునాళ్ చేరదీసి ప్రోత్సహించాడు. అక్కడి ఆస్థాన చిత్రకారుడయిన శ్రీ రామస్వామి నాయుడు దగ్గర కొద్దిరోజులు శిష్యరికం చేశాడు. తైల వర్ణ చిత్రకళను బ్రిటీషు దేశస్థుడయిన "థియోడార్ జెన్సన్" వద్ద నేర్చుకున్నాడు. పాశ్చాత్య చిత్రకళలోని శక్తి, భావ వ్యక్తీకరణ,చిత్రాలు వేసేవిధానం, భారతీయ శైలికి అనుకూలంగా మార్చి ఎన్నో అందమైన చిత్రాలను వేయగలిగాడు రవివర్మ.

రవివర్మ తన చిత్రాల ఇతివృత్తాల కోసము భారత దేశమంతటా తిరుగుతూ,ప్రతి దృశ్యాన్ని చిత్రానికి అనుకూలంగా మార్చు కునేవాడు. హిందూ దేవతాస్త్రీల చిత్రాలను దక్షిణ భారత స్త్రీలలాగా ఊహించి అందంగా చిత్రించడానికి ప్రయత్నించాడు. ముఖ్యంగా మహాభారతంలోని నలదమయంతుల, శకుంతలా దుష్యంతుల కథలలోని ఘట్టాలను చిత్రాలుగా చిత్రించి ఎంతో పేరు సంపాదించాడు. రాజా రవివర్మ తరువాత నుండి భారతీయుల ఊహలలో పౌరాణిక పాత్రలన్నీ రవివర్మ చిత్రాలలాగా మారిపోయాయి. రవివర్మ తరచుగా తన చిత్ర శైలిలో ప్రదర్శనాత్మకంగానూ, ఛాందసంగానూ ఉంటాడన్న విమర్శలను ఎదుర్కొన్నాడు. అయినాకూడా తనకు తానుగా నచ్చిన చిత్రాలను వేయడం మాత్రం మార్చు కోలేదు.

1894 లో లిథోగ్రాఫిక్ యంత్రాలు, చిత్రించడానికి అనువైన పరికరాలు, సాంకేతిక నిపుణులను జర్మనీ నుంచి తెప్పించి,మన దేశంలోనే మొదటి సారిగా అత్యాధునిక ప్రెస్ ను ముంబైలో ప్రారంభించాడు. అయితే అక్కడ స్థలాభావం కారణంగా, ఆ సమయంలోనే ప్లేగు వ్యాధి వ్యాపించడం వల్ల, కార్మికులు సరిగా లభించకపోవడం వలన నానా ఇబ్బందులు ఎదుర్కొని, చివరకు నాలుగు సంవత్సరాల తరువాత మహారాష్ట్ర లోనే కొండల నడుమ ఉన్న "మలవాలి" అనే గ్రామానికి తన నివాసాన్ని మార్చుకున్నాడు. ప్రెస్ పక్కనే తన నివాసాన్ని ఏర్పరుచుకుని, ఎప్పటికప్పుడు దాని అభివృద్ధికి, చిత్రకళా నైపుణ్యం పాంపొందించు కునుటకు ప్రయత్నించాడు.

రవివర్మ 1904 లో ప్రెస్ ను ఒక జర్మన్ సాంకేతిక నిపుణుడికి అమ్మేసి, దానితో పాటు వంద చిత్రాలకు కాపీరైట్ కూడా ఇచ్చాడు. అయితే 1972లో జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రెస్ కు భారీ నష్టం జరిగింది. ఆ తర్వాత మిగిలిన చిత్రాలను, పరికరాలను ప్రెస్ చుట్టు పక్కల నివసించేవారికి ఇచివేయగా,మిగిలిన వాటిని ముంబై, పుణే ప్రభుత్వాలు కొన్నింటిని మాత్రమే సేకరించి భద్రపరచగలిగాయి.

రవివర్మ బొమ్మల కొలువులో ఎన్నో అద్భుత చిత్రాలు ఉన్నవి.అందులోఅష్టసిద్ధి, లక్ష్మి, సరస్వతి,భీష్ముని ప్రతిజ్ఞ,కృష్ణుని అలంకరించే యశోద,గంగావతరణంపేరు తెచ్చినచిత్రాలు. పల్లె పడుచు, అలోచనలో మునిగిపోయిన స్త్రీ, దమయంతి హంస సంవాదం, వాద్యకారుల బృందం,సుభద్రార్జునులు,లేడీ విత్ ఫ్రూట్స్,శకుంతల, శ్రీ కృష్ణ రాయబారం, రావణ జటాయు వధ,ఇంద్రజీత్ విజయం, బిక్షకుల కుటుంబం,గుడి వద్ద దానాలు ఇస్తున్న స్త్రీ,వరుణుని జయించిన రాముడు,కీచకుని కలవటానికి భయపడుతున్న ద్రౌపది,శంతనుడు మత్స్యగంధి,ప్రేమలేఖ వ్రాస్తున్న శకుంతల, కణ్వుని ఆశ్రమములోని బాలిక లాంటి పెక్కు చిత్రాలు చాల గొప్పగా పెరుగాంచాయి.

రవివర్మ తాత్విక దృష్టి గురించి పాశ్చాత్య చిత్రకళా శైలి మీద అతని అవగాహన గురించి గాని ఎవరికీ తెలియదు. రవివర్మ చిత్రకళపైన తీక్షణమయిన పరిశోధన చేసే వారికి రవివర్మ వ్రాసిన ఎటువంటి పుస్తకాలూ లేకపోవటము వలన వారి పరిశోధన అసంపూర్తిగా మిగిలిపోతుంది. కాని రవివర్మ తమ్ముడు, రాజరాజవర్మ అప్పట్లో రాసిన దినచర్య వల్ల కొంత వరకు రవివర్మ జీవితము,ఆర్థిక పరిస్థితి,అప్పటి సమకాలికుల తోడ్పాటు, మానసిక ఆవేదనలు మొదలగు వాటిని కొంతవరకు తెలుసుకొనే అవకాశం కలిగింది. రాజరాజవర్మ స్వతహాగా మంచి పేరున్న చిత్రకారుడు కావడం వల్ల, రవివర్మకు చిత్రాలు చిత్రించడంలో సహాయము చేస్తూ,ఒక మంచి మిత్రుని వలె,ఒక సహాయకుని వలె ఉండడం వల్ల కొంత సమాచారం బయటి ప్రపంచానికి తెలిసింది.రవివర్మ కొంతమంది దగ్గర చిత్రకళా నైపుణ్యాలు నేర్చుకున్నప్పటికి స్వతహాగా వేసిన చిత్రాలు వారికి మంచిపేరు తెచ్చిపెట్టాయి.

రవివర్మపై అప్పటి మేధావివర్గం చేసిన విమర్శలు,వాటికి వారు చూపిన ఆధారాల వల్ల కొన్నిసార్లు ఇబ్బందులు తప్పలేదు. ఎందుకంటే రవివర్మ చిత్రించిన చిత్రాలను వివిధ రకాల ఉపయోగాల కోసం విపరీతంగా ముద్రించటం వలన, భారతీయ ఇతిహాసాలను తనదైనశైలిలో చిత్రించటం వలన సాంప్రదాయ భారతీయ చిత్రకళా శైలి మరుగున పడిపోయిందనే విమర్శను ఎదుర్కొన్నాడు. అతని చిత్రకళను సాంప్రదాయశైలి కోసం విద్యలాగ నేర్చుకోవలసిందే అనే భావనకు ఊతమివ్వడం ద్వారా శైలిపరంగా, ఇతివృత్త పరంగా గొప్పదైంది. అయిన భారతీయ చిత్రకళను బలహీనపరిచాడని కొంత మంది అభిప్రాయం వెలిబుచ్చి, అది తప్పు అని చెప్పటానికి సరైన ఉదాహరణలుగా మధుబని జానపద చిత్రకళను పశ్చిమ బెంగాల్ లోని దుర్గాదేవి మూర్తులను చూపించారు. రవివర్మ చిత్రాలలో కచ్చితంగా ఇటువంటి చురుకైన భావవ్యక్తీకరణ లోపించడం వల్ల కొంత ఇబ్బంది పడక తప్పలేదు. తనకు నచ్చిన కళానైపుణ్యాన్ని ఎప్పటికప్పుడు మరింత పదునుపెడుతూ మెరుగైన చిత్రాలకు ప్రయత్నించడం రవివర్మ గొప్పతనం గా భావించవచ్చు. పౌరాణిక పాత్రల రూపకల్పనలోని పౌరాణిక సూత్రాలను విస్మరించటం ద్వారా రవివర్మ గొప్పవైన పౌరాణిక నాయకులను, సామాన్య మానవుల స్థాయికి దిగజార్చాడని, అవే భావనలు ప్రసార సాధనాలైన సినిమా, దూరదర్శన్‌లకు పాకిపోయాయని కొందరు వాదించారు.ఏది ఏమైనా భారతీయ గొప్ప చిత్రకారుడని మాత్రం ఒప్పుకోక తప్పలేదు. "ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమా" గా పేరుగాంచిన దాదాసాహెబ్ ఫాల్కే, తో పాటు ఎందరో గొప్పవ్యక్తులు రవివర్మ చిత్రాల వల్ల ప్రభావితమయ్యారు.

రాజా రవివర్మ చిత్రకళకు చేసిన మహోన్నత ఉపకారానికిగానూ కేరళ ప్రభుత్వం అతని పేరిట "రాజా రవివర్మ" పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. ఈ పురస్కారం ప్రతి ఏటా కళలు, సంస్కృతి అభ్యున్నతికై, విశేష కృషి చేసిన వారికి ఇస్తుంది.రాజా రవివర్మ పేరిట కేరళలోని మావలికెరలో ఒక ఫైన్‌ఆర్ట్స్ కళాశాలను నెలకొల్పారు. రవివర్మపై గల ఆసక్తి వల్ల సినిమా, వీడియోలలో కుడా అతని చిత్రాలను ఉపయోగించు కుంటున్నారు.

రవివర్మ చిత్రించిన కొన్ని చిత్రాలను బరోడా లోని మహారాజా ఫతేసింగ్ మ్యూజియంలో, మైసూర్,తిరువాంకుర్, ఉదయపూర్, చెన్నై,న్యూఢిల్లీ తదితర నగరాల్లోని ఆర్ట్ గ్యాలరీలో కుడా నేటికీ మనం చూడవచ్చు. మన దేశస్తులే కాక వివిధ దేశాల ప్రముఖుల ప్రశంసలు పొందిన ఎన్నో చిత్రాలు వర్మ కుంచె నుండి వెలువడ్డాయి.

60 సంవత్సరాలు నిండినాక సన్యాసం స్వీకరించాలని అనుకున్న రవివర్మ 59 ఏళ్లకే 1906 అక్టోబర్ 2 మరణించడం విచారకరం. అనారోగ్యంగా ఉన్నప్పుడు ప్రారంభించిన "కాదంబరి" చిత్రం అసంపూర్తిగానే మిగిలి పోయింది.భారతదేశ చరిత్ర ఉన్నాన్నాళ్ళు భారతీయులు గర్వించదగ్గ చిత్రకారునిగా పేరుపొందిన రవివర్మ ఏనాటికైనా గొప్పవాడే.

గడప రఘుపతిరావు
9963499282



## ప్రముఖ సాహితీవేత్త చౌడూరికి "సాహితీ రత్న" పురస్కారము




హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 30:
ప్రముఖ సాహితీవేత్త, విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీ చౌడూరి నరసింహారావు కు 'సాహితీ రత్న' అరుదైన గౌరవం లభించింది.
ఇటీవల చిక్క రామదాసు స్వర్గస్తులయ్యారు. వారి స్మృత్యర్థం కుటుంబ వారి అభిమానులు, కుటుంబ సభ్యులు కలిసి చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ఆధ్వర్యాన చిక్కా రామదాసు స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ త్యాగరాజ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదిక మీద జరిగింది. ఈ ప్రథమ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభలో న్యూ నాగోల్ కు చెందిన ప్రముఖ కవి, పండి తుడు, విమర్శకుడు, విశ్లేషకుడు శ్రీ చౌడూరి నరసింహా రావు కు 'సాహితీ రత్న' బిరుదు పురస్కా రాన్ని ఆ సంస్థ నిర్వాహకులు అందజేశారు.శ్రీచౌడూరి నరసింహారావు గత నలుబదేళ్ళుగా తెలుగు సాహిత్య రంగానికి చేస్తున్న ఎనలేని సేవలను దృష్టియందుంచుకొని ఈ పురస్కారంతో వారిని గౌరవిస్తున్నామని తెలియజేస్తూ..ఆగస్టు నెలలో నెల్లూరు లో జరిగిన తెలుగు భాషా ఉత్సవాలలో నరసింహారావు గారు తెలుగు భాషా సేవా పురస్కారం అందుకున్నారని వారి సేవకిది తగిన గుర్తింపని చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ చిక్కా దేవదాసు, శ్రీ బింగి నరేంద్ర గౌడ్ లు తెలిపారు. పురస్కార గ్రహీత శ్రీ చౌడూరి నరసింహారావు మాట్లాడుతూ, స్వర్గీయ రామదాసు గారు నాకు మా నాన్నగారికి మంచి సాహితీ మిత్రులని, వారు చక్కనైన భాషతో చిక్కనైన భావంతో లెక్కకు మించిన సన్మాన పత్రాలు వ్రాసారని, పద్య రచనలో వారు సిద్ధహస్తులని డాక్టర్ సినారె గారిచే 'పద్య కంఠీరవ' అనే బిరుదును పొందిన ప్రతిభావంతులని కొనియాడుతూ, వారు లేని లోటు తెలుగు సాహిత్యానికి పూడ్చలేనిదంటూ తమ బాధను వ్యక్తం చేస్తూ, వారి స్మారక పురస్కారం నాకు లభించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని, నాకు పురస్కారాన్ని ఇచ్చి సత్కరించిన చిక్కా రామదాసు గారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా నన్నారు. ఈ కార్యక్రమానికి చిక్కా రామదాసు గారి అభిమానులు, ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి విచ్చేసిన సుమారు 140 కవులు, కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు జరిగిన సినీ సంగీత విభావరి అందరినీ ఎంతో ఆకట్టుకుంది. ఈ సభలో చిక్కా రామదాసు మెమోరియల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు శ్రీ బింగి నరేంద్ర గౌడ్, డాక్టర్ చిక్కా దేవదాసు, అధ్యక్షులు శ్రీ చిక్కా రవి కిరణ్, ప్రధాన కార్యదర్శి శ్రీ చిక్కా శంకర్, కోశాధికారి శ్రీ చిక్క శ్రీనివాస్ లు పాల్గొన్నారు. తమ కాలనీవాసి చౌడూరి కి పురస్కారం లభించడం పట్ల కాలనీకి చెందిన కవులు,ఆయన అభిమానులు అభినందనలు తెలియజేశారు.

## సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

– టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
– నిధులు కేటాయిస్తూ జీవో విడుదలపై హర్షం



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి అక్టోబర్30:
మున్సిపాలిటీల అభివృద్ధికి రేవంత్ సర్కార్ అన్ని విధాల సంపూర్ణ సహకారం అందిస్తుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి సదాశివపేట మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. సంగారెడ్డిసదాశివపేట మున్సిపాలిటీల కు 18 కోట్ల 70 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి టీజీఐఐ సీ చైర్పర్సన్ నిర్మల తో కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రెండు మున్సిపాలిటీలకు కలిపి 37 కోట్ల 40 లక్షల రూపాయల నిధులతో త్వరలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. వీటికి సంబంధించిన పనులను వివరించారు. అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్ కింద నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఈ మేరకు జీవో విడుదల చేయడం జరిగిందన్నారు.

సదాశివపేట మున్సిపాలిటీల పరిధిలో సిసి రోడ్లు డ్రైనేజీల నిర్మాణం ఊబ చెరువు సుందరీ కరణ కోసం 1.5 కోట్లు, అయ్యప్ప దేవాలయం నుంచి బిఎస్ఎన్ఎల్ వరకు సెంట్రల్ మీడియం సెంట్రల్ లైటింగ్ కోసం 1.6 6 కోట్లు, డబుల్ బెడ్ రూమ్ పరిసరాల్లో కనీస సౌకర్యాల కోసం 50 లక్షలు, గురు నగర్ కాలనీలో పార్క్ డెవలప్మెంట్ కోసం 50 లక్షలు, హైమాస్ట్ లైటింగ్ ఏర్పాటు కోసం 30 లక్షలు, అదేవిధంగా సంగారెడ్డి మున్సిపాలిటీలోనీ విలీన గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం కోసం 2 కోట్ల రూపాయలు, వరద నీరు మళ్లింపు కోసం ప్రత్యేక డ్రైనేజీల నిర్మాణం చేపట్టేందుకు 5.9 కోట్లు, పార్కుల అభివృద్ధి కోసం 1 కోటి 35 లక్షలు, పట్టణంలో షాపింగ్ కాంప్లెక్స్ ల నిర్మాణం కోసం 2 కోట్ల రూపాయలను ప్రణాళిక బద్ధంగా చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తామని వివరించారు.

## ప్రజలు ప్రమాదాలకు దూరంగా ఉండాలి

–చెరువులు, కుంటలు, నదుల్లోకి ప్రజలు దిగవద్దు
–సూర్యాపేట ఎస్పీ నరసింహా



సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 30:ప్రజల రక్షణలో పోలీసు అనుక్షణం అప్రమత్తంగా పని చేస్తున్నారు అని జిల్లా ఎస్పి నరసింహ అన్నారు. వర్షాల దృష్ట్యా మూసి నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున ఈరోజు సూర్యాపేట రూరల్ పరిధి వేదేరివారి గూడెం వద్ద మూసి నదిపై భీమారం లో–లెవెల్ బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహ పరిస్థితిని ఎస్పీ నర్సింహా పరిశీలించారు. వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధిక వర్షాల వల్ల చెరువులు నదులు కుంటలు నిండి ప్రమాదకర రీతిలో ఉన్నాయని వాటిలోకి ఎవరు దిగవద్దని ఎస్పీ సందర్భంగా కోరారు. తుఫాను ప్రభావంతో రెండు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలు దృష్ట్యా అతను చెరువులు కుంటలు నీటితో నిండి ఉండి ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తున్నాయి దీనిపై జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమై ప్రమాదకరంగా ఉన్న స్థలాల వద్ద భద్రతా చర్యలు తీసుకోవడం జరిగింది పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం నీటి ప్రవాహం లోకి ఎవరు వెళ్లకుండా రోడ్లపై బారికెడ్ లు, వాహనాలు అడ్డుగా పెట్టడం జరిగింది. అలాగే రోడ్లపై విరిగిపడిన చెట్ల ను తొలగించడం, నీటి ప్రవాహంలో చిక్కుకున్న వాహనాలను తీయడం, ప్రమాదంలో ఉన్న ప్రజలను కాపాడడం జరిగినది, అలాగే తెగిపోయిన రోడ్లను సంబంధిత అధికారితో కలిసి మరమ్మతులు చేయించడం జరిగినది అని తెలిపారు.జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజారక్షణలో నిరంతరం కృషి చేస్తుంది అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సెలవులు రద్దు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచాము అని ఎస్పి అన్నారు.ఆయన వెంట సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, రూరల్ ఎస్సై బాలు నాయక్, సిబ్బంది ఉన్నారు.

## శ్రీ మహాశక్తి దేవాలయంలో శ్రీ శివ వైభవంపై ప్రవచనములు

### గర్రెపల్లి మహేశ్వరశర్మ చే అక్టోబర్ 31నుంచి ఆరంభం

కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో శ్రీ మహాశక్తి దేవాలయంలో శుక్రవారం నుండి శ్రీ శివ వైభవం (పురాణం) గురించి ప్రవచనములు ఆరంభం కానున్నాయి. పౌరాణిక ప్రవర, ప్రవచన చక్రవర్తి, వేదమూర్తులు బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రియశిష్యులు, బ్రహ్మశ్రీ డా గర్రెపల్లి మహేశ్వర శర్మ చే అక్టోబర్ 31 నుండి నవంబర్ 6 వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి 8:30 నిమి.ల వరకు, పవిత్ర కార్తీక మాస పంచపర్వ దినాలు అయినటువంటి ఏకాదశి , ద్వాదశి, త్రయోదశి, చతుర్దశి, పౌర్ణమి (కార్తీక పౌర్ణమి) సందర్భంగా ఈ శ్రీ శివ వైభవం పై ప్రవచన కార్యక్రమం కొనసాగనుంది. శ్రీ శివ వైభవ ప్రవచనములలో ముఖ్యంగా శివ తత్వం, మహిమ, తదితర ఘట్టాలు, అంశాలు వివరించే అమూల్యమైన ప్రసంగాలను ఆధ్యాత్మిక గురువులు గర్రెపల్లి మహేశ్వర శర్మ తెలియజేయనున్నారు. సమస్త హిందూ బంధువులందరూ ప్రతిరోజు సాయంత్రం శ్రీ శివ వైభవ ప్రవచనాల కార్యక్రమంలో పాల్గొని ఆ పరమశివుడి అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.



నవంబర్ 2న తులసి దామోదర కళ్యాణం

కార్తీక ద్వాదశిని పురస్కరించుకొని శ్రీ మహాశక్తి దేవాలయంలో నవంబర్ 2 సాయంత్రం 6:30 నిమి.ల నుండి శ్రీ తులసి దామోదర కళ్యాణం జరగనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులు ఈ కల్యాణంలో పాల్గొని ఆ తులసి దామోదరుని ఆశీస్సులు పొందాలని కోరారు.

నవంబర్ 5న సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు


కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ మహాశక్తి దేవాలయంలో నవంబర్ 5 ఉదయం 7:30 నిమి.ల నుండి సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కావున భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సిసిఐ కొనుగోలు కేంద్రాలను అక్టోబర్ 31న ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్, మార్కెటింగ్ అధికారి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 30: వ్యవసాయ మార్కెట్ కమిటీ మద్నూర్ జిల్లా కామారెడ్డి ఆధీనంలో 7 జీన్నింగ్ మిల్లులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సీసీఐ కొనుగోలు కేంద్రాలుగా నోటిఫికేషన్ చేసి ఉన్నారు. కానీ స్లాట్ బుకింగ్ ద్వారా సిసిఐ వారి ఎల్ 1 ప్రకారం ఒక మిల్లు కెపాసిటీ వరకు ఆ మిల్లు మాత్రమే కనబడుతుంది. అక్కడికి తీసుకుని వెళ్ళాలి. సిసిఐ ద్వారా పత్తిని అమ్మకమునకు తీసుకొని వచ్చే రైతు సహోదరులకు తెలియజేయునది ఏమనగా, పత్తి యొక్క తేమ 8% నుంచి 12 % నకు మించి ఉండరాదు. పత్తి యొక్క పింజ రకాన్ని బట్టి 50రూ. తేమ శాతాన్ని బట్టి 81B82 రూ. రేటు తగ్గుతుంది. కావున ఇది రైతులు గమనించగలరు. కావున పత్తి అమ్ముకోవడానికి వచ్చే రైతులు పత్తిని తమ కల్లాల వద్దనే ఆరబెట్టుకుని తీసుకొని రావాల్సిందిగా విన్నపము. సీసీఐ కేంద్రానికి అధిక తేమశాతంతో పత్తిని తీసుకొని వచ్చి రైతులు ఇబ్బంది పడవద్దని కోరుచున్నాము. అకాల వర్షాల కారణంగా ముందుగానే ప్రారంభించవలసిన సిసిఐ కొనుగోలు కేంద్రాలను తేదీ 31 అక్టోబర్ శుక్రవారం రోజున ప్రారంభించబడుతుందని తెలుపుచున్నాము. రైతులు తాము పండించిన పత్తి పంటను సీసీఐ కేంద్రానికి అమ్మకానికి తీసుకువచ్చే రైతులు /కౌలు రైతులు ముందుగా వ్యవసాయ అధికారులను సంప్రదించి కిసాన్ యాప్ లో వ్యవసాయ అధికారుల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అనంతరం రైతులు కిసాన్ కపాస్ యాప్ ద్వారా రైతులు ముందుగానే స్లాట్ బుకింగ్ చేసుకొని, ఈ కిసాన్ కపాస్ యాప్ నందు ముందుగానే పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ ను జత చేయవలసి ఉంటుంది . ఒకవేళ స్లాట్ బుకింగ్ చేసుకున్న తేదీ రోజున అనివార్య కారణాల చేత పత్తిని అమ్ముకోవడానికి రాని ఎడల తిరిగి అదే రోజు స్లాట్ బుకింగ్ క్యాన్సల్ చేసుకోవలసి ఉంటుంది. ఈ సౌకర్యం రైతు సహోదరులకు మూడు పర్యాయాలు ఉంటుంది. కానీ మూడు పర్యాయాలు ముగిసిన అనంతరం రైతుల స్లాట్ బుకింగ్ నిలిపివేయబడుతుంది. తిరిగి చేసుకోవాలంటే సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించిన పిదపనే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారికి అమ్ముకునే వెసులుబాటు ఉంటుందని కామారెడ్డి జిల్లా మార్కెటింగ్ అధికారి పి. రమ్య, తెలిపారు.

## సమూలంగా ప్రక్షాళన చేస్తాం



### 20 సంఘాలు మద్దతు ప్రకటించాయి
### అర్బన్ బ్యాంకు ప్యానల్ అభ్యర్థులతో వెలిచాల స్పష్టం

కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):
గత పాలకవర్గాల హయంలో అర్బన్ బ్యాంకు అధ్వాన స్థితికి చేరుకుందనీ, అస్తవ్యస్తంగా మార్చారనీ, మాకు అవకాశం ఇస్తే బ్యాంకును సమూలంగా ప్రక్షాళన చేస్తామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. నీతి నిజాయితీతో మీ ముందుకు వచ్చిన మా ప్యానల్ అభ్యర్థులకు అర్బన్ బ్యాంకు మెంబర్లు మార్పు కోసం ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.
గురువారం సాయంత్రం ప్రైవేట్ హోటల్లో బ్యాంక్ ప్యానల్ అభ్యర్థులతో కలిసి రాజేందర్ రావు మీడియా సమావేశంలో మాట్లాడారు. ముందుగా అర్బన్ బ్యాంకు ను ఏ విధంగా తయారు చేస్తామనే అంశంపై ఒక మేనిఫెస్టో ను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు పాలకవర్గాలు, బ్యాంకు అభివృద్ధి కోసం దోహదపడాలి కానీ వారి సొంత లాభం కోసం చూసుకున్నారనీ, బ్యాంకును ఏ మాత్రం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 8 సంవత్సరాలుగా ఎన్నికలు జరగకుండా కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని, మళ్ళీ వారే మాకు అధికారం కావాలని ఓట్లు అడుగుతున్నారని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధి ఏమోగానీ ప్రతిష్టను దెబ్బ తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. గోల్డ్ పేట రోల్డ్ గోల్డ్ పెట్టి రుణాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయని చెప్పారు.ఇలాంటి పరిస్థితుల్లో మార్పు కోసం కాంగ్రెస్ భావాజాలం,వ్యక్తిత్వం సామాజిక సేవ, నిజాయితీ వంతంగా, జ్ఞానం, పరిజ్ఞానంతో ప్యానెల్ ను ఏర్పాటు చేశానని తెలిపారు. సేవా భావం, ఎలాంటి లాబాపేక్ష లేకుండా పనిచేసేందుకు ముందుకొచ్చిన నిర్మల భరోసా ప్యానల్ ను గెలిపించాలని కోరారు.కరీంనగర్ లోనీ 20 సంఘాలు లారీ అసోసియేషన్, ఆటోనగర్ అసోసియేషన్, హమాలీ సంఘం పద్మశాలి సంఘం, కాపు సంఘం, రెడ్డి సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, గౌడ సంఘం, ఐఎంఏ డాక్టర్ల సంఘం బార్ అసోసియేషన్ సంఘాలు తమ ప్యానెల్ కు మద్దతు ప్రకటించాయని తెలిపారు. అర్బన్ బ్యాంక్ అభివృద్ధిలో మా తండ్రి జగపతిరావు పాత్ర గణనీయంగా ఉందన్నారు. అర్బన్ బ్యాంకు అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారని ఆయన ఆశయ సాధనకు తాను అర్బన్ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో 18 వేల మెంబర్లతో నడిచిన అర్బన్ బ్యాంకు నేడు 9000 పరిమితమైందని బ్యాంకును మొత్తం లోపభూయిష్టంగా మార్చి వేశారని పారదర్శకతకు పాతర వేశారని ఆందోళన వ్యక్తం చేశారు.ఖాతాదారులను చేర్పించడం మర్చిపోయారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన కర్ర రాజశేఖర్, గడ్డం విలాస్ రెడ్డిలు ఇరువురు ఆరోపణలు చేసుకొని బ్యాంకు ప్రతిష్టను దెబ్బతీశారని ఆరోపించారు. ప్యానల్ అభ్యర్థులతో కలిసి మంత్రులు పొన్నం ప్రభాకర్ తుమ్మల నాగేశ్వరరావు ,విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వద్దకు వెళ్లి ఆశీస్సులు తీసుకున్నామని రాజేందర్రావు పేర్కొన్నారు. బ్యాంకును సంస్కరిస్తామని ఆన్లైన్లో లావాదేవీలు ఎలక్ట్రానిక్ ట్రాన్స్ఫర్స్ చేపడుతామనీ, ఖాతాదారులకు సత్వరమే సేవలందించేలా చూస్తామన్నారు. హుస్నాబాద్, హుజురాబాద్ జమ్మికుంట, చొప్పదండి లో కొత్త బ్రాంచులను ఏర్పాటు చేస్తామన్నారు. 72 కోట్లు ఉన్న డిపాజిట్లను వచ్చే మూడేళ్లలో 200 కోట్లు డిపాజిట్ చేరుకునేలా బ్యాంకు ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

## సూర్యాపేట దంతాలపల్లి రోడ్డులో సమస్యలు వెంటనే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



సూర్యాపేట,భారతశక్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30:
సూర్యాపేట-దంతాలపల్లి రోడ్డు లో నెమ్మికల్లు వద్ద చౌడ చెరువు నుండి రోడ్డుపై ప్రవహించడం వల్ల రోడ్డు కుంగిపోవటంతో ఆరోడ్డుపై రాకపోకలకు ఆటంకం ఏర్పడింది కాబట్టి వెంటనే పునరుద్ధరణ పనులు చేపట్టి శుక్రవారం ఉదయం నాటికి రాకపోకలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి ఈ పద్మావతిని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. గురువారం ఆత్మకూరు (ఎస్ )మండలం, నెమ్మికల్ వద్ద అధిక వర్షం వల్ల కుంగిపోయిన రోడ్డు ను, నేలకు వాలిన వరి పంటను పరిశీలించి పంట నష్టం పై పూర్తి నివేదిక అందించాలని వ్యవసాయ అధికారిని ఆదేశించారు.తదుపరి ఆత్మకూరు ఎస్ మండలం దాచారం వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి తేమ శాతం పరిశీలించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం 17 రాగానే వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు.వర్షం వల్ల ఏమైనా ధాన్యం తడిచాయా అని అడగగా కొనుగోలు కేంద్రం ఎత్తులో ఏర్పాటు చేయటంతో పాటు, ధాన్యం పై టార్పాలిన్ పట్టాలు కప్పటం వల్ల ధాన్యం తడవలేదని నిర్వాహకులు తెలిపారు.కలెక్టర్ వెంట తహసీల్దార్ అమీన్ సింగ్, ఎంపిడిఓ ఎం డి హాసీం,ఏ ఓ దివ్య, సెంటర్ ఇంచార్జి అనిత తదితరులు ఉన్నారు.

## రైతులకు అండగా ఉంటాం

-గ్రామాల్లో దెబ్బతిన్న పంటల పరిశీలన
-రైతులను ఓదార్చిన వెలిచాల



కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):తుఫాను ప్రభావంతో బుధవారం కురిసిన భారీ వర్షాలకు పంటలు పూర్తిగా నేలకొరిగాయి..ఆరుగాలం శ్రమించి వేసిన పంటలు చేతికి అందక పోవడంతో దిగాలు చెందిన రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని కలిగించి మనోధైర్యాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇంచార్జి వెలిచాల రాజేందర్ పంటలు దెబ్బతిన్న గ్రామాల్లోకి వెళ్ళి వారిని ఓదార్చారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్, వల్లంపహాడు, తీగలగుట్టపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంటతో పాటు వివిధ పంటలను రాజేందర్ రావు పరిశీలించారు. తీగల గుట్టపల్లి లో ఐకెపి కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంతో ఇబ్బందుల్లో ఉన్న రైతులను ఓదార్చారు. ధైర్యం కోల్పోవద్దనీ, మీకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని భరోసా కల్పించారు. ఎలాంటి నష్టం జరగకుండా చూస్తామని పేర్కొన్నారు. పంట నష్టం వివరాలను తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వ్యవసాయ అధికారులు పక్కాగా నష్టం వివరాలు తనకు అందించాలని సూచించారు. నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నుంచి సహాయం అందేలా కృషి చేస్తానని, వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన రైతుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నష్టపోయిన రైతులకు సత్వరమే పరిహారం అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే తడిసిన వరి ధాన్యాన్ని ప్రతి గింజను కొనుగోలు చేసేలా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ప్రత్యేకంగా మాట్లాడుతానని రాజేందర్ రావు రైతులకు హామీఇచ్చారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తుందని, రైతులకు నిరంతరం అండగా ఉంటుందని పేర్కొన్నారు. రైతులందరూ ఏలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదనీ రైతులకు కొండంత అండగా ఉంటామని భరోసా కల్పించారు. కేంద్రంలో వర్షపు నీరు భారీగా చేరడంతో తక్షణమే మున్సిపల్ సిబ్బందితో కాల్వ తీయించి నీటిని బయటకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ధాన్యం తడవకుండా ఉండేలా చర్యలు తీసుకున్నారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సత్యం, కాంగ్రెస్ నాయకులు కొలగాని అనిల్ కుమార్, అనంతల రమేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రచ్చ శ్రీనివాస్



అక్టోబర్ 30, భారతశక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): మొంధా తుఫాన్ ప్రభావంతో కురిసిన అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వంగపల్లి గ్రామంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, మండల అధ్యక్షురాలు గుంటిపల్లి మహేశ్వరిలతో పాటు పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులతో కలిసి నష్టపోయిన పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు వెంటనే నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ తరపున డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి నష్టపోయిన రైతులను చూసి ఇకనైనా వారి ధోరణి మార్చుకొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని సూచించారు. ఇప్పటికే బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఫసల్ బీమా యోజన అమల్లో ఉందని, దానివల్ల అక్కడి రైతులు వారి పంటలకు ఏ చిన్న నష్టం జరిగిన కేంద్ర ప్రభుత్వం వెంటనే వాళ్ళకి నష్ట పరిహారం అందిస్తుందని తెలిపారు. కానీ కాంగ్రెస్ పాలిత ప్రాంతం అయిన మన తెలంగాణలో మాత్రం ఫసల్ బీమా పథకం అమలు చేయకపోవడం వలన ఇలాంటి సమయంలో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో ఫసల్ బీమా పథకం అమలు చేస్తే మన రాష్ట్రంలో బీజేపీ ఎదుగుతుంది అనే భయంతో రైతులకు అన్యాయం చేస్తుందని, ఇప్పటికైనా రైతుల కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే నష్ట పోయిన రైతులకు పరిహారం చెల్లించి ఫసల్ బీమా పథకం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ముత్యాలు, ఉప్పలయ్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుంటిపల్లి సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు దొంతు భరత్, సీసా వెంకటేష్, శనిగారం బాలు, తాటిపాముల వెంకటేష్, కాలువ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక భద్రతకు పొదుపు పునాది

## (అక్టోబర్ 30 అంతర్జాతీయ పొదుపు దినోత్సవం సందర్భంగా)

(ఒక్కొక్క బిందువు కలిస్తేనే పెద్ద మహా సముద్రం)
ఒక్కొక్క బిందువు కలిస్తేనే పెద్ద మహా సముద్రం తయారవుతుంది అని.ఒక్క రూపాయి అంటుంది నన్ను వందకు పెంచు తరువాత నిన్ను నేను పెంచుతాను అన్న సామెతలు అన్ని పొదుపు గురించి చెప్పినవే. కాళ్ళు వంకర పోకుండానే కంటి చూపు తగ్గిపోక ముందే వయస్సు ఉడుగక ముందే వీలైనంత కూడబెట్టు అనేది మనకు పెద్దలు ఉగ్గుపాలతో నేర్పే మొదటి ఆర్థిక సూత్రం. సాధారణంగా వాడుక భాషలో పొదుపు అంటే తమ ఆదాయంలో.డబ్బును ఖర్చు పెట్టకుండా అట్టేపెట్టుకోవడం ఉదహారణకు బ్యాంకులో ఖాతాలో వేసుకోవడం.

ఆర్థిక పరిభాషలో పొదుపు
ఆర్థిక శాస్త్ర పరిభాషలో ఆదాయంలో వినియోగం చేయగా మిగిలిందే పొదుపు. మరింత విస్తృత అర్థములో పొదుపు అంటే ఖర్చును తగ్గించుకోవడం. పెట్టుబడుల్లో నష్ఠభయం (రిస్క్) వుంటుంది కనుక ధనాన్ని ఖర్చు పెట్టకుండా ఉంచుకోవడమే పొదుపుకు సరైన అర్థం . వ్యవహారికంగ పొదుపు ఒకవిధమైన ఆలోచనా విధానం జీవన విధానం.ప్రజలలో పొదుపు ప్రవృత్తిని పెంచడం.పొదుపు పట్ల ప్రజల ప్రవర్తన సమీకరించడం సంపద ప్రాముఖ్యతను నిరంతరంగుర్తు చేస్తూ దేశములో పొదుపు పెంచే వాతావరణాన్ని సృష్టించడానికి అనువైన పరిస్థితులు కల్పించడం .దేశ ఆర్థిక పురోభివృద్ధికి కావలసిన పెట్టుబడి పొదుపు ద్వారానే సాధ్యమౌతుంది అని ప్రజలకు తెలియచేయడం .ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పొదుపు పెట్టుబడి ప్రధాన పాత్ర పోషిస్థాయి.ఆర్థిక వ్యవస్థ లో మూలధనం పెరుగుదల పొదుపు రేటు మీద ఆధారపడి వుంటుంది.

ప్రపంచ పొదుపు దినోత్సవం బి చరిత్ర
ప్రపంచ పొదుపు దినోత్సవం ప్రతి సంవత్సరం అక్టోబర్ 30న నిర్వహిస్తారు. సామాన్య పౌరులకు పొదుపు ప్రాముఖ్యత పొదుపు పదతుల పట్ల అవగాహన కల్పించడం కోసం జరుపుతారు. స్పెయిన్ లో 1921 లోమొదటి జాతీయ దినోత్సవం జరిగింది. 1924 లో ఇటలీలోని "మిలాన్" నగరంలో జరిగిన మొదటి అంతర్జాతీయ పొదుపు సమావేశంలో అక్టోబర్ 30ని ప్రపంచ పొదుపు దినోత్సవం గా ప్రకటించింది. ఇటాలియన్ ప్రొఫెసర్ "ఫిల్లోపో రవిజ్జా" ఈ రోజును అంతర్జాతీయ పొదుపు దినంగా ప్రకటించారు.
దీనినే ప్రపంచ పొదుపు దినంగా కూడా పిలుస్తారు. పొదుపు కాంగ్రెస్ తీర్మానంలోప్రపంచ పొదుపు దినంగా పాటిస్తున్నారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా వున్న ద్రవ్య సంస్థలు' ఆర్థిక సంస్థలు బ్యాంకులు 'పొదుపు దినాన్ని నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకులన్ని ప్రపంచ పొదుపు దినోత్సవం జరుపుకోవడం ప్రారంభించాయి. ప్రస్తుతం ప్రపంచంలో "ఇంటర్నేషనల్ సేవింగ్స్ బ్యాంక్ ఇన్స్టిట్యూట్ కి" చెందిన 940 బ్యాంక్స్ క్రియాశీలకంగా 'నిర్మాణాత్మకంగా పనిచేస్తున్నాయి. భారతదేశంలో అక్టోబర్ 30 న పొదుపు దినోత్సవం జరుపుకుంటారు. పొదుపు విషయములో స్త్రీ 'పురుషులు పెద్దలు 'పిల్లలు అన్న బేధం లేకుండా అందరూ పొదుపు చేయడానికి అర్హులే. పొదుపు అనేది అన్ని విషయాలకు వర్తిస్తుంది. విద్యుత్ ' నీటిని ఆహారాన్ని అనవసరంగా వృధా చేయకుండా పొదుపు చేసే ఉద్దేశ్యముతో పొదుపు దినోత్సవాన్ని నిర్వహిస్తారు.ఇంతకు ముందు తరాల వారితో పోలిస్తే ప్రస్తుతం పొదుపుపై ప్రజల్లో అవగాహన చైతన్య%శీ% పెరిగింది. ఉన్న వనరులను ఒక్క సారిగా పూర్తిగా వాడకుండా తెలివిగా జాగ్రత్తగా భవిష్యత్తు అవసరాల కోసం ఒక క్రమపద్ధతిలో ఉపయోగించడాన్ని పొదుపు అంటారు. మారుతున్న పరిణామాలను గుర్తిస్తూ అందుబాటులో వున్న వనరులను క్రమపద్ధతిలో అభిలషణీయం వాడుకోవాలన్న ఉద్దేశ్యముతో నిర్వహిస్తున్న ఈ దినానికి అభివృధి చెందిన అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మంచి స్పందన వచ్చింది.1921 లో స్పెయిన్' అమెరికా వంటి దేశాల్లో జాతీయ స్థాయిలో సేవింగ్స్ డే జరుపుకోవడం ఒక ముఖ్యమైన సాంప్రదాయమైంది . రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ పొదుపు దినం1955 మరియు 1970 మధ్య సంవత్సరాలలో పొదుపు ప్రజాదరణ పొందింది.

ప్రపంచ దేశాల జిడిపి లో పొదుపు రేటు
ప్రపంచలోనే స్థూల జాతీయ ఉత్పత్తి లో (జిడిపి) 65.9 శాతం పొధుపుతో "ఐర్లాండ్" ప్రథమ స్థానం ' 56.3 శాతం పొదుపు తో"సింగపూర్ "రెండో స్థానం ఆక్రమించింది."ప్రపంచ బ్యాంక్ అభివృధి నివేదిక" ప్రకారం ఇండియా స్థూల జాతీయ ఉత్పత్తి లో(జిడిపి) 2019 లో పొదుపు 27.99 శాతం నమోదు అయింది.మార్చి 2019 లో బ్యాంక్ డిపాజిట్ లలో గృహరంగ పొదుపు3.8 శాతం ఉండగా 2018 లో పొదుపు 32.4 శాతం నమోదు కావటం గమనార్హం.
ప్రజలు రియల్ ఎస్టేట్ రంగములో పెట్టుబడులు పెట్టే దోరిణి పెరిగింది.దాని వల్ల ఆర్థిక వ్యవస్థలో ని పొదుపు రేటు లోతగ్గుదల చోటుచేసుకుంది. ప్రజలు తమ భవిష్యత్తు అవసరాలకోసం చిన్న 'పెద్ద మొత్తాలలో పొదుపు చేయడం అలవాటు చేసుకున్నారు. పొదుపు చేయడం ఆచరణాత్మకంగా కొన్ని దేశాల్లో సంప్రదాయంగా మారింది. "మన పెద్దలు నిరంతరం మనం సంపాదించే దానికంటే తక్కువ ఖర్చు చేసి భవిష్యత్తులో ఉపయోగ కోసం కొంత భాగాన్ని ఆదా చేసుకోవాలని చెబుతారు.మన ఆదాయానికి అనుగుణంగా డబ్బు ఖర్చు .చేయమని భోదిస్తారు. మరియు ఖర్చులు మన ఆదాయానకి మించ కూడదు "పిండికొద్ది.రొట్టె"అన్న సామెత మన జీవన విధానం కావాలి".పొదుపు విజయానికి మార్గం .ఆదాయం అదా చేసిన డబ్బు ఏదైనా అత్యవసర వైద్య పరిస్థితి వంటి కఠినమైన సమయంలో ఉపయోగపడుతుంది .పెట్టుబడి ద్వారా ఎక్కువ డబ్బులు సృష్టించడానికి ఉపయోగపడుతుంది.

అభివృధి లో బి పోటీ
నేడు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అభివృద్ధిలో పోటీ నెలకొంది. దేశాల ఆర్థిక.పారిశ్రామిక.వాణిజ్యాభివృధికి కావలసిన పెట్టుబడులను మూలధన వనరులను 'పొదుపు సమకూరుస్తుంది.అయా దేశాల జీఎన్ పి లో ఉపాంత ఉత్పాదక మూలధన నిష్పత్తి దేశములో ప్రజలు చేసే పొదుపు ప్రవృత్తి మీద ఆధారపడి వుంటుంది. కాబట్టి" "నేటి పోధుపే భవిష్యత్తు అభివృద్ధికి మదుపు "అనేది నినాదం కాకుండా ఒక విధంగా ప్రభుత్వాలు ఆర్థిక సంస్థలు" "ప్రపంచ పొదుపు దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించాలి. గృహాలకు మరియు దేశ ఆర్థిక వ్యవస్థకు పొదుపు యొక్క ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన చైతన్యం కలిగించాలి. .వారు చేసే పొదుపులో తమ భద్రత దేశబద్రత ఇమిడి వుందన్న వాస్తవాన్ని ప్రచారం చెయ్యాలి. మరియు ప్రతి డిపాజిటర్ తమ పొదుపు జాతియ ఆర్తిక వ్యవస్థ అభివృద్ధికి ఎలా తోడుపడుతుంది అనే అంశాల పై సదస్సులను చర్చలను'గోస్టులను ఉపన్యాసాలను నిర్వహించి ప్రజలలో పొదుపు ప్రవృత్తిని పెంపొందించాలి.
కుటుంబాలను 'పిల్లలు 'సమాజాన్ని ఇందులో భాగస్వాములు చెయ్యాలి. .సమాజములో పొదుపు ప్రాముఖ్యత పట్ల అవగాహన కలిగిస్తారు. పొదుపును అనేక రూపాల్లో చేయవచ్చు. విద్యుత్తు ఆదా టెలిఫోన్ ఖర్చులనుతగ్గించడం .విద్యుత్తు వృధా చేయడం లైట్లను ఫ్యాన్లను మరియు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అవసరం లేనప్పుడు ఉపయోగించడం. అదేవిధంగా టెలిఫోన్ విషయంలో సరైన మోడల్ కొనుగోలు చేయడం. కారు ఉపయోగం పై నియంత్రణ మొదలగు వాటి ద్వారా డబ్బులను ఆదా చేయవచ్చు పొదుపు అనేక ప్రయోజనాలుచేకూరుతాయి. ఆహార వ్యర్థాలను నివారించడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సహజవనరుల సంరక్షణకు దోహధపడుతుంది.

పొదుపు ప్రాముఖ్యతను గుర్తించాలి
మారుతున్న సమకాలీన సమాజిక ఆర్థిక' రాజకీయ' సాంకేతిక సాంస్కృతిక' పరిస్థితులు. గ్లోబలైజేషన్' విజృంభిస్తున్న కరోనా మహమ్మారి నేపథ్యంలో ఆర్థిక భద్రత ఆరోగ్యం సంరక్షణ కోసం భవిష్యత్తు అవసరాల కోసం ముందు జాగ్రత్తల కోసం ఆర్థిక వనరులు ఎల్లప్పుడు సమృద్ధిగా వుండవు .దీన్ని దృష్టిలో పెట్టుకొని డబ్బును ఆదా చేయడంతో పాటు పొదుపుపై పూర్తి అవగాహన చైతన్య ము పెంచుకోవాలి .ఆర్థిక అక్షరాస్యత పరివ్యాప్తి ద్వారా ప్రభుత్వం పౌరసమాజం పొదుపు ప్రాముఖ్యత మీద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. పొదుపు విలువ తెలియపరచడానికి 'మీడియా ఎలక్ట్రానిక్ మీడియాను ఉపయోగించుకోవాలి .
నేటి పొదుపు భవిశ్యతు దేశాభివృద్ధికి గొప్ప మదుపు అన్న విషయాన్ని చాటి చెప్పాలి. పొదుపు అన్ని విషయాలకు వర్తిస్తుంది.
సహజవనరుల ,,'జలవనరుల వినియోగం 'విద్యుత్తు ను పొదుపు చేయడం నీటిని 'ఆహారాన్ని అనవసర వృదాను 'అరికట్టడం పొదుపుగా వాడుకోవాలి.
పాఠశాలలో కళాశాల స్థాయిలో పొదుపు ప్రాముఖ్యత పద్ధతుల పట్ల పాఠ్యాంశాన్ని ప్రవేశ పెట్టి బాల్యదశలో విద్యార్థులకు పొదుపు చెయ్యడం అలవాటు చెయ్యాలి.డబ్బు ఆదా చేయడం నేర్పితే పెద్దయ్యాక వారికి ఉపయోగడ పడుతుంది.

ఆర్థిక భద్రతకు భరోసా
ప్రపంచ పొదుపు దినోత్సవం కేవలం డబ్బులు ఆదా చెయ్యడానికి మాత్రమే పరిమితం కాలేదు. దేశ పారిశ్రామిక వ్యవసాయ' సేవా రంగాల అభివృద్ధికి దేశ ఆర్థిక భద్రతను బలోపేతం చేయడానికి దోహద పడుతుంది.

డిజిటల్ బ్యాంకింగ్ సేవలు విస్తరించాలి
అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రజలు బ్యాంకులు అందించే సేవలకు దూరంగా ఉన్నారు. పేద వర్గాలు మహిళలు 'యువత బ్యాంకింగ్ కార్యకలాపాలలో భాగ స్వామ్యములయ్యేట్లు "డిజిటల్ బ్యాంకింగ్ సేవలను" విస్తరించాలి. ఆన్లైన్ ఆర్థిక లావాదేవీల్లో జరుగుతున్న అక్రమాలను మోసాలను అరికట్టాలి. .ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు' స్వశక్తి 'డ్వాక్రా పొదుపు సంఘాలు ఈ దిశగా ,,"ఆర్థిక అక్షరాస్యతా "వ్యాప్తి తో పొదుపును ఉద్యమంగా కొనసాగించాలి. ప్రతి మనిషి తమ సంపాధనలో 20 శాతం పొదుపు చెయ్యాలి.నెలవారీ పొదుపు అలవాటు చేసుకోవాలి.బడ్జెట్లో పొదుపుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఆన్లైన్ బ్యాంకింగ్ వనరులను ఉపయోగించాలి. పోస్టాఫీసు లో వున్న వివిధ పొదుపు పథకాల మీద భీమా సౌకర్యాల మీద ప్రజలకు అవగాహన కలిగించాలి. ప్రభుత్వాలు అనుత్పాధక ప్రాజెక్టను సకాలములో (పరిమిత కాలములో) పూర్తి చెయ్యాలి . ప్రాజెక్టుల ను పూర్తి చేయడములో జరుగుతున్న అనవసర జాప్యాన్ని "అవినీతిని" అరికట్టాలి. దేశములో ఆర్థికాభివృద్ధికి' అభివృధికి సహాయ పడటానికి ప్రభుత్వాలు అనవసర వ్యయాన్ని తగ్గించాలి. హేతుబద్దమైన ' ద్రవ్య 'కోశ విధానాల ద్వారా ఉపాధి ఉత్పాదకతను గణనీయంగా పెంచే ఆర్థిక సంస్కరణల అమలుతో ఆర్థిక వ్యవస్థలో పొదుపు రేటు పెరుగుటానికి చర్యలు తీసుకోవాలి. కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్లు రేపో రివర్స్ రెపో రేట్ సరళీకరణ తో సమగ్రమైన ద్రవ్యవిధానాన్ని అమలుచెయ్యాలి.ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటించి ఆర్థిక వ్యవస్థలో పొదుపు రేటు ద్విగుణీకృతమయ్యే చర్యలతో కూడిన కార్యాచరణకు పూనుకోవాలి .

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
హైదరాబాద్ 9440245771



# పెద్దలు కుదిర్చిన పెళ్ళీలకు మొగ్గు చూపుతున్న యువత

భారతీయ సమాజంలో పెళ్ళికి చాలా ప్రాధాన్యత వుంది .పెళ్లంటే నూరేళ్ల పంట వంశాభివృద్ధికి పునాది.ఇద్దరు వ్యక్తుల మధ్య శారీరక మానసిక ఆత్మ సంబంధమైన అన్యోన్య బంధమే పెళ్ళి .పెళ్లి అనేది భాగస్వాముల మధ్య ప్రత్యేకమైన వ్యక్తిగత అనుభ%శీ%ధం ఏర్పడేందుకు పునాది.పరస్పరం ఒకరికి ఒకరు గౌరవించుకుంటు ఒకరిపై ఒకరు ఆధారపడి షరతులు లేని ప్రేమాభిమానాలతో సాగిపోయే జీవితానికి ఆహ్వానం పలికే ఒక మధురమైన సన్నివేశం పెళ్లి.

జీవితం పెళ్ళి
మనిషి జీవితంలో వివాహం ప్రధాన ఘట్టం పెళ్లి తో మనుషుల జీవితాలలో కొత్త మలుపు మొదలవుతుంది.. పెళ్లి కుటుంబ వ్యవస్థ ఏర్పాటుకు సమాజ నిర్మాణానికి పునాది .రెండు కుటుంబాల మధ్య వారధి.

ప్రేమ పెళ్లి పెద్దలు చేసిన పెళ్ళి
భారత దేశములో పెద్దలు కుదిర్చిన పెళ్ళీలు మరియు ప్రేమ పెళ్ళీలతో జంటలు ఏకమౌతున్నరు.మతాలు ఏవైనా' కులాలు 'ఏవైనా పెళ్లి అనేది భాగస్వాములు జీవిత కాలం కలిసి ఉండాలన్నది ప్రధాన ఆశయం.గతంలో తల్లి తండ్రుల ఇష్ట ప్రకారం పెళ్ళిళ్ళు జరిగేవి. ఇప్పుడు పెళ్లికి ముందే యువతి యువకులు స్నేహాలు' ప్రేమలు డేటింగులు' షికార్లు తోగడుపుతున్న సందర్భాలు ఉన్నాయి.తెలిసి తెలియని ఉరకలు వేసే వయసులో ఒకరికి ఒకరు ఇష్టపడి ప్రేమ మొదలై పెళ్లిళ్లకు దారితీస్తుంది. ఇద్దరి మధ్య జీవితం పై అవగాహన లేక పెళ్లి ఐయిన కొద్ది రోజులకే విడాకులు తీసుకుంటున్న జంటలను ఈ సమాజంలో చూస్తున్నాం. దీనికి ప్రధాన కారణం సరైన గైడెన్స్ చెప్పే వారు లేక పోవడం. మెరుగైన సామాజిక సంభందాలు లేక పోవడం. సకాలములో పెద్దల సలహాలు సహకారం లోపించడం ప్రధాన కారణాలు.

యువత ప్రేమ పెళ్ళిలు
భారతీయ యువత ప్రేమ పెళ్ళిల మీద శ్రద్ధ చూపుతున్నారు. యుక్త వయసులో తమకు కాబోయే జీవిత భాగస్వామి ఎంపికలో యువత వ్యక్తి గత స్వేచ్ఛ ఎంపిక పట్ల ఉత్సాహం చూపిస్తున్నారు.
చిన్నప్పటి స్కూల్ కాలేజ్ క్లాస్ మట్ లను పెళ్లి చేసుకోవడంలో యువత తమ ఇష్టాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచీకరణ 'విదేశీ సంస్కృతి 'విదేశీ చదువులు' విదేశీ కొలువులు చేస్తూ కులాంతర వివాహాలు ప్రేమ వివాహాల వైపు మొగ్గు చూపే సంస్కృతి యువతలో రాజ్యమేలుతుంది.
భారతీయ సినిమాలు చూస్తే ప్రేమ తప్ప మరొకటి కనిపించదు. యువత ఆలోచనలన్నీ ప్రేమ పెళ్లి చుట్టూనే తిరుగుతూ ఉంటాయని పిస్తుంది .అది కొంత వరకు వాస్తవమే.

పెళ్ళిల పై అధ్యయనం సర్వే
దేశంలో ఇటీవల వివాహాల స్వరూపం స్వభావం మీద జరిపిన అధ్యయనాల ప్రకారం యువత అధిక సంఖ్యలో పెద్దలు కుదిర్చిన వివాహాలనే చేసుకుంటున్నారని తేలింది.
2018 సంవత్సరం లో 1'60'000 కంటే ఎక్కువ కుటుంబాల పై జరిపిన సర్వేలో వివాహితుల్లో 93 శాతం తమది పెద్దలు కుదిర్చిన వివాహమే అని చెప్పారు.కేవలం 3 శాతం మాత్రమే ప్రేమ వివాహం చేసుకున్నారు. మరో 2 శాతం ప్రేమ ప్లస్ పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్నారు అంటే పెద్దలే ఈ సంభ్నందాన్ని కలుపుతారు. పరిచయం అయ్యాక అబ్బాయి అమ్మాయి ప్రేమలో పడి పెళ్లికి ఒప్పుకుంటారు కాలముతో పాటు ఈ శాతాలలో పెద్దగా మార్పులేదు .
80 యేళ్లు దాటి వారిలో 94 శాతం మంది తమది పెద్దలు కుదిర్చిన వివాహం అని చెప్పారు20.యేళు దాటిన వారిలో90 శాతం కన్నా ఎక్కువ జంటలు పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకున్న వారేనని అధ్యయనంలో తేలింది.

ప్రేమ పెళ్లిలుతక్కువే
2014 లో 70000 కంటే ఎక్కువ మందిపై జరిపిన సర్వేలో పట్టణ ప్రాంతాల్లో నివసించే భారతీయుల్లో కులాంతర వివహం చేసుకున్నవారు 10 శాతం కంటే తక్కువే అని తేలింది. మతాంతర వివాహం అంతకన్న తక్కువ కేవలం 5 శాతం మాత్రమేనని అధ్యయనాలు తెలుపుతున్నాయి.
కులాంతర 'మతాంతర 'వివాహాలు చేసుకోవడానికి అభ్యంతరం వ్యక్తం చేయని యువత వివాహ సమయంలో వివాహం మాత్రం పెద్దలు కుదిర్చిన వారితోనే చేసుకుంటున్నారని తేలింది . పెళ్ళిల మీద జరిగిన పలు అధ్యయనాలు సర్వేలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి క్షేత్ర స్థాయిలో జరుగుతున్న వివాహాల తీరుకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది.జనవరి 2018 నాటికి భారత దేశములో ప్రేమ వివాహాలు చేసుకున్న వారు 3 శాతం మందే అని సర్వేలో తేలింది .మంచి చదువు ఉద్యోగం చేస్తున్న ఒక దళిత యువకున్ని వివాహం చేసుకోవడానికి ముందుకు వచ్చే వారి సంఖ్య అతి తక్కువగానే ఉంటుంది.తెగించి పెళ్లి చేసుకుంటే కుటుంబ సభ్యుల భందువుల ద్వారా బెదిరింపులు తిరస్కారాలు సాంఘిక బహిష్కరణ' గృహ బహిష్కరణకు గురౌతున్నారు.పరువు కోసం ప్రాణాలను భలికొనే సంస్కృతి సామాజిక లక్షణంగా పరిణమించడం శోచనీయం.లిపరువు హత్యలులి ఇటీవలదేశంలో అనేక ప్రాంతాల్లో కులాంతర వివాహాలు చేసుకున్న జంటల పట్ల అమానుష అమానవీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. పరువు హత్యలు సమాజానికి సవాళ్ గా పరిణమించాయి.
ఇలాంటి పరిస్థతుల్లోయువతీ యువకులు మనసుకు నచ్చిన వారిని పెళ్లి చేసుకోవాలంటే పెద్ద యుద్ధమే చేయ్యలసి వస్తుంది.

సొంత కులం వారితో పెళ్లి
2015లో మాట్రి మోనియాల్ సైట్లలో 1000మంది అమ్మాయిలను సంప్రదిస్తే సగం మంది కులాంతర వివాహాలకు అభ్యంతరం లేదని చెప్పిన చాలా వరకు అమ్మాయిలు వివాహ సమయంలో సొంత కులానికి చెందిన అమ్మాయిలను వివాహం చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారని సర్వేలోతేలింది.
,..2013 సం"లో ఢిల్లీలో ఏడు జిల్లా కోర్టుల్లో అత్యాచారానికి సంబంధించిన కేసుల విచారణ జరిగింది. ప్రతి కేసులో విచారణ ముగిసిన 460 కేసుల్లో 40 శాతం సమ్మతి వున్న జంటలకు సంబందించిన కేసులు కావటం గమనార్హం.
కోర్టు విచారించిన 460 కేసుల్లో 40శాతం అమ్మాయి అబ్బాయి ఒకరికి ఒకరు ఇష్టపడ్డ కేసులే చాలా వరకు కులాంతర మతాంతర వివాహాలు చేసుకున్న వారే వాళ్ళు ప్రేమించుకొని ఇంటినుండి పారిపోయిన తర్వాత అమ్మాయి తల్లి తండ్రులు అబ్బాయి మీద అత్యాచారం అపహరణ కేసులు పెట్టారు.తమ బిడ్డ కులాంతర వివహం చేసుకుంది అనే దాని కంటే అత్యాచారానికి గురైంది అని చెప్పుకోవదానికి ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయని మానసిక స్థితికి తల్లి తండ్రులు గురౌతున్నారనీ సర్వేల్లో వెల్లడైంది.

సామాజిక శాస్త్రవేత్తల ఆందోళన
తమ కంటే తక్కువ కులం అబ్బాయిని ప్రేమించిందని పరువు హత్యాలకు పాల్పడే ప్రమాదకర దోరుణులు ప్రభలి శాంతి భద్రతల సమస్యగా పరిణమించడం గమనార్హం .కులాల మధ్య కుమ్ములాటలు .కుల విద్వేషాలు చోటుచేసుకుని సామాజిక సమరసత కులాల మధ్య సంఘీభావం సామరస్యత దెబ్బతింటుంది. కులాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకోవడం సామాజిక శాంతికి విఘాతం కలుగుతుందని సామాజిక శాస్త్ర వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చట్టాలు శిక్ష
దేశములో రాను రాను పరిస్థితులు దిగజారే ప్రమాదం వుంది.కొన్నేళ్లుగా అతివాద హిందూ గ్రూపులు "లవ్ జిహాదీ" అనే పదం తెరపైకి వచ్చింది. పెళ్ళి పేరుతో అమ్మాయి మతం మార్పిడి చేసే అబ్బాయిలకు కటిన చట్టాలు శిక్షలు అమల్లోకి తేవటానికి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి.

భార్య భర్తల ప్రేమ నమ్మకం
ప్రేమ పెళ్లి కాని పెద్దలు కుదిర్చిన పెళ్లి కాని కేవలం భార్య భర్తలపైనే ఆధారపడి ఉంటుంది.ముఖ్యంగా వారి మధ్య వున్న ప్రేమ నమ్మకం విశ్వాసం పరస్పరం కురిపించుకునే ప్రేమానురాగాలు ఈ విషయములో కీలక పాత్ర పోషిస్థాయి.జీవితం పంచు కోవడానికి తగిన వ్యక్తిని ఎంపిక చేసుకుంటే అది ప్రేమ వివాహమైన లేక పెద్దలు కుదిర్చిన వివాహమైన జీవితం అద్భుతంగా ముందుకు సాగుతుంది. పరస్పరం అవగాహన సహకారం మంచితనం ఆత్మీయత బంధువులతో మెరుగైన సంభందాలు కష్ట సుఖాలు పంచుకోవడం మంచిని పెంచడం కుటుంబ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పండుగలు ఆత్మీయుల కలయికలు భందువులతో సామూహిక పండుగలు జరుపుకోవడం .కుటుంబ పెద్దల పట్ల గౌరవం ఆత్మీయత అభిమానం అనురాగం ప్రేమ మెరుగైన జీవనవి లువలు కుటుంబాల సాంప్రదాయాన్ని ఆచారాలను పాటించాలి.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థ
సమాజం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పునర్జీవంతో వివాహ వ్యవస్థ పవిత్రతకు పునరంకితం కావాలి.
మమత మానవీయత ఆదరణ ఆర్థత అనురాగాల ఆలంబనగా ఆదర్శనీయమైన జీవన శైలితోయువత వివాహ వ్యవస్థ పవిత్రత పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం 9440245771



# బ్రహ్మంగారి మఠం12వ మఠాధిపతి నియామకం సనాతన ధర్మం ప్రకారం అనుసరించాలి

-శ్రీశ్రీశ్రీ నారాయణి ప్రత్యంగిరా దేవాలయం పీఠాధిపతి కృష్ణవేణమ్మ ( పెదారికట్ల)

-డాక్టర్ పోకూరి లక్ష్మణాచారి, సినీ నిర్మాత, హీరో



బ్రహ్మంగారి మఠం, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 30: భూత భవిష్యత్తు వర్తమాన కాలజ్ఞాన సృ ష్టికర్త శ్రీ శ్రీ శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 11వ మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీర భోగ వసంత వెంకటేశ్వర స్వాముల వారు శివైక్యం పొందిన అనంతరం 12వ మఠాధిపతి నియామకం కొరకు కుటుంబ సభ్యులలో మొదలైన అంతర్గత పోరులో కోర్టును ఆశ్రయించగా హైకోర్టు ఉత్తర్వులు మేరకు ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ రీజనల్ అధికారి చంద్రశేఖర్ ఆజాద్ అధ్యక్షతన 12వ మఠాధిపతి నియామకం కొరకు సనాతన ధర్మం ప్రకారం అనుసరించి అలాగే మఠంకు సంబంధించిన ఆచారాలు కట్టుబాట్లు పరిధిలో స్వాములు, అఘోరాలు, శిష్యుల, మరియు హిందూ సాంప్రదాయకు చెందిన భక్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మంగళవారం నాడు శ్రీ మద్ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం పరిధిలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఆంధ్ర తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల నుండి స్వామి వారి భక్తులు తరలివచ్చి తమ అభిప్రాయాన్ని వెల్లడించారు.

మంధా తుఫాను సైతంలెక్కచేయని భక్తులు

ధార్మిక పరిషత్, మరియు భక్తులు,స్వాములు, అఘోరాలు సంయుక్త నిర్వహణలో వీర బ్రహ్మేంద్ర స్వామి వారి మఠం లో 12వ మఠాధిపతి నియామకం కొరకు అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించగా ఈ కార్యక్రమానికి శ్రీ సద్గురు శాంకరి అఘోరి మాతాజీ శ్రీశ్రీశ్రీనారాయణి ప్రత్యంగిరా మహాదేవి పీఠాధిపతి పెదారికట్ల గజేంద్ర గిరి కొండ ప్రకాశం జిల్లా. డాక్టర్ పోకూరి లక్ష్మణాచారి సినీ నిర్మాత హీరో హైదరాబాద్ వాసి తో కలిసి రీజనల్ జాయింట్ కమిషనర్ కి శ్రీశ్రీశ్రీ వెంకటాద్రి స్వామి వారిని వీర బ్రహ్మేంద్ర స్వామి వారి మఠం, మఠాధిపతిగా నియమించాలని వినతి పత్రాలు అందించడం జరిగినది.

# పకడ్బందీగా వరి కొనుగోలు: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 30 (భారత శక్తి): జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

లోకేశ్వరం మండలంలోని హవర్గా గ్రామంలో పీఏసీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, టార్పాలిన్లు సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయా అని తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కేంద్రంలో నిర్వాహకుల వివరాలు, మద్దతు ధర, టోల్ ఫ్రీ నంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. టెంట్, త్రాగునీటి వంటి సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు, వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి, పంట రుసుము సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చూడాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు.

రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పంటకు మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు తమ పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే ఇవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ధాన్యాన్ని శుభ్రపరిచి, తగిన తేమ శాతం కలిగిన తర్వాత మాత్రమే తూకానికి ఇవ్వాలన్నారు. వరి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా, టోల్ ఫ్రీ నంబర్ 9182958858 ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డి సి ఓ నర్సయ్య, జిల్లా పౌర సరఫరా అధికారి రాజేందర్, పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, తహసీల్దార్ భోజన్న, ఎం పి డి ఓ రామకృష్ణ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దళితుల భూముల్ని రక్షించాలని ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేత

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 30 (భారత శక్తి): సోన్ మండలంలోని పాక్ పట్ల గ్రామంలో దళితుల భూమిని దౌర్జన్యంగా ఆక్రమించిన గ్రామ విడీసీ సభ్యులపై చర్యలు తీసుకొని దళితుల భూమిని తిరిగి వారికి అప్పగించాలని కోరుతూ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ ఆధ్వర్యంలో సోన్ ఎమ్మార్వో నీ కలిసి వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోల్ల వెంకటస్వామి మాట్లాడుతూ పాక్పట్ల గ్రామంలోని బోర ముత్యం, బోర చిన్న గంగన్న, బోర నడిపి నరసయ్య కి చెందిన భూమిలో బుధవారం రోజు ఉదయం ఏడు గంటల సమయంలో వీడీసీ సభ్యులు అందరూ వచ్చి దౌర్జన్యంగా వారి అనుమతి లేకుండా వారి పట్టా భూములలో మట్టి రోడ్డును వేశారని వెంటనే ఎమ్మార్వో స్పందించి వారి భూమిలో వేసిన రోడ్డును తొలగించి దళితులను రక్షించాలని వారి భూములను పరిరక్షించాలని అన్నారు జిల్లా నాయకులు రవి, సుధీర్, రమేష్, బోర ముత్యం, బోర చిన్న గంగన్న, బోర నడిపి నరసయ్య, బోర శ్రీనివాస్ తదితరలు ఉన్నారు.

# బీసీ రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం కొనసాగుతుంది

## బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు



ఖమ్మం ప్రతినిది (భారత శక్తి ), అక్టోబర్ 30: స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో 42% రిజర్వేషన్ సాధించేత వరకు ఉద్యమిస్తామని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు స్పష్టం చేశారు. గురువారం నాడు ఆయన ఖమ్మం జిల్లా మధిర సిపిఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవితో కలసి పాత్రికేయులతో మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న బీసీ ఉద్యమాన్ని అనగదొక్కేందుకు ప్రయత్నం చేస్తున్న బిజెపి నిజస్వరూపాన్ని బీసీల తో పాటు ఎస్సీ ఎస్టీ మైనారిటీలు గమనించాలని, ఇటీవల కొంతమంది కొన్ని పత్రికలు కొంతమంది ఉద్యమకారులు బిసిలకు ఎస్సీలు వ్యతిరేకంగా ఉన్నారని వ్యాఖ్యలు చేస్తున్నారని అది నిజం కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగతో పాటు అనేకమంది ఎస్సీ నాయకులు ప్రొఫెసర్ ఖాసీం డాక్టర్ విశారదన్ మహారాజ్ లాంటి అనేక మంది బీసీ ఉద్యమానికి ఇప్పటికే మద్దతు ప్రకటించి ఉన్నారని తెలంగాణ రాష్ట్రంలో నడుస్తున్న అస్తిత్వ ఉద్యమాలను ప్రస్తుత తరుణంలో బీసీ ఉద్యమానికి బలహీనపరిచేందుకు బిజెపిలోని కొంతమంది కావాలనే ఇలాంటి కట్టుకథలు ప్రచారం చేస్తున్నారని, ప్రజా ఉద్యమాలు ఏనాటికి అపజయం పాలు కావని అనేది చరిత్ర చెబుతున్న సత్యం అని ఆయన ఉద్ఘాటించారు ఖచ్చితంగా తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లతో పాటు చట్టసభలో 50% రిజర్వేషన్ సాధించేవరకు మడమ తిప్పని పోరాటం చేస్తామని, 56% గా ఉన్న బీసీలు ఐక్యమైతే గ్రామపంచాయతీ వార్డు మొదలుకొని ప్రధాని వరకు అందరూ బీసీలు అవుతారని బీసీలకు రాజ్యాధికారం చేతికి వస్తే బీసీలకు కావలసిన అన్ని రకాల చట్టాలు అమలు చేసుకుంటారనే విషయాన్ని ప్రతి బీసీ వ్యక్తి గమనించాలని, 2028 లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి బీసీ కూడా బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేసి బీసీల సత్తా చాటాలని అందుకు క్షేత్రస్థాయిలో ఉద్యమాల నిర్మాణ%శీ% చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన వెంట బీసీ హక్కుల సాధన సమితి నాయకులు చిలకరాజు శ్రీను,కొమర్రాజు వెంకట్, బత్తిని శ్రీనివాస గౌడ్ ఉన్నారు.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది:రాష్ట్ర మంత్రి పొన్నం



కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):

తుపాన్ కారణంగా బుధవారం కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను, రహదారులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సిపి గౌస్ అలం లతో కలిసి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని చిగురుమామిడి నుండి వస్తున్న వరద ప్రభావంతో సీతారాంపూర్ దెబ్బతిన్న రోడ్డును, కూలిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.వరద ప్రభావంతో వరి పొలాల్లోకి పూర్తిక ఇసుక మేటలు వేయడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఇందుర్తి కోహెడ మధ్య లోలెవెల్ బ్రిడ్జిపై వరద నీరు ప్రవాహాన్ని పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కరీంనగర్ జిల్లా ఇందుర్తి లో లెవెల్ బ్రిడ్జి లో పై నుండి వరద ఉధృతంగా ప్రవహిస్తుందనీ రహదారి పూర్తిగా దెబ్బతిన్నదని చెప్పారు. ఈ సంవత్సరంలో మూడు సార్లు ఇలా పై నుండి వరద పోతుందనీ ఇందుర్తి నుండి కోహెడ వెళ్ళే బ్రిడ్జి పై నుండి వల్ల రాకపోకలు ఇబ్బందులు కలుగుతున్నాయని చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రేపు ముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చినప్పుడు ఈ బ్రిడ్జిపై రిప్రజెంటేషన్ ఇస్తామని,అలాగేకరీంనగర్ జిల్లా సిద్దిపేట జిల్లా మధ్య ఉన్న లింక్ రోడ్డును మరమ్మతులు చేపడతామని చెప్పారు.

వరదలకు కొట్టుకుపోయిన రోడ్లు ,నష్టపోయిన పంటలను మొత్తం రికార్డ్ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ జిల్లా కి సంబంధించి రైతులకు ఎక్కడ ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందనీ చెప్పారు.

సైదాపూర్ లో ఐకేపీ కేంద్రాని పరిశీలన

సైదాపూర్ లో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని, సైదాపూర్ లోని హుస్నాబాద్- హుజూరాబాద్ రోడ్డుపై నుండి ప్రవహిస్తున్న వరద నీటిని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ వరదలకు కొట్టుకుపోయిన రోడ్లు, నష్టపోయిన పంటలను మొత్తం రికార్డ్ చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులకు ఆదేశిస్తామని అన్నారు. రైతులకు ఎక్కడ ఇబ్బందులూ లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. మంత్రి వెంట అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలు ప్రమతంగా ఉండాలి

-అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలి

-ఏ సమస్యలు వచ్చినా కంట్రోల్ రూమ్ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంచాలి

-జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్

సూర్యాపేట,భారత శక్తి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 30:

మొంథా తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో భారీ నుండి అతిభారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలను అప్రమత్తంగా ఉండెలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో కురుస్తున్న వర్షాలపై ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలో అధిక వర్షాలు కురుస్తున్నందున నేడు జిల్లాలోని పాఠశాలకు స్థానిక సెలవు ప్రకటించడం జరిగిందని, జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా అప్రమత్తం చేయడం జరిగిందని అన్నారు. రోడ్లు,బ్రిడ్జిలు ,కల్వర్టులపై నీరు ప్రవహిస్తే తాత్కాలికంగా వాహనాల రాకపోకలు మూసివేయడం జరిగిందని అన్నారు .నదులు చెరువులు, కాలువల వద్ద ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసు ,రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షణ చేస్తూ ప్రజలను అటువైపు వెళ్ళకుండా చూడడం జరుగుతుందని తెలిపారు.ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ సిబ్బందితో ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి వారిని అప్రమత్తం చేయడం జరిగిందని గ్రామాలలో,పట్టణాలలో క్షేత్ర స్థాయి లో పర్యటించి శిదిలావస్థలో ఉన్న 3 ఇండ్లను గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని స్పష్టం చేసారు.మండల స్థాయి గ్రామస్థాయి అధికారులు కార్య స్థానంలో ఉంటూ ఏలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వి సి ద్వారా తుఫాన్ లపై



ముందస్తు జాగ్రత్తలపై సూచనలు చేసారని అదే రోజు సాయంత్రం అధికారులను ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అప్రమత్తం చేశామని మంగళ వారం అధికారులు అందరు క్షేత్ర స్థాయి లో పర్యటనలు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి ఉంచేలా ప్రజలను అప్రమత్తం చేసారని, రైతులు కూడా సహకరిస్తున్నారని తెలిపారు.జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజల సహాయార్థం కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నెంబర్ 6281492368 ఏర్పాటు చేయడం జరిగిందని అక్కడ అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని ప్రజల నుండి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించి తక్షణమే సహాయక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు సూర్యాపేట, కోదాడ,హుజూర్నగర్ లో మూడు అందుబాటులో ఉన్నాయని, ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఎస్ డి ఆర్ ఎఫ్ బృందం అందుబాటులో ఉందని అత్యవసర సమయంలో వెంటనే స్పందించుటకు జిల్లా అధికార యంత్రాంగం సిద్దంగా ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

# సి పి బ్రౌన్ గ్రంథాలయానికి రానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

## ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాటు పూర్తి చేయండి -జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి


వైయస్సార్ కడప జిల్లా అక్టోబర్ 30(భారత శక్తి): నవంబర్ 2 తేదీ జరిగే బ్రౌన్ శాస్త్రి శతజయంతోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సి పి బ్రౌన్ గ్రంథాలయానికి రానున్న నేపథ్యంలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారుగురువారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నందు జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్రౌన్ శాస్త్రి శతజయంతోత్సవ వేడుకలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరు కానున్న నేపథ్యంలో అధికారిక ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ అదితి సింగ్,ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చేరుకొని మాట్లాడుతూ.. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు జిల్లాకు రానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు సంబంధించి అధికారిక ప్రోటోకాల్ ప్రకారం ఏర్పాట్లు చేయాలని అధికారులను. ఆదేశించారు. జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో సి పి బ్రౌన్ ప్రాంగణం నందు నిర్వహించనున్న గ్రంథాలయ సాహిత్య సేవా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన నవంబర్ రెండో తేదీన పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా స్వాగత ఏర్పాట్లు, కాన్వాయ్, బస ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అలాగే కాన్వాయ్ లో కచ్చితంగా 108 వాహనం,మెడికల్



సిబ్బంది ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఆయన బసచేస్తున్న ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద మెడికల్ టీం ఏర్పాటు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. శానిటేషన్ సంబంధిత అంశాలను పర్యవేక్షించాలని కడప మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అలాగే ప్రోటోకాల్ ప్రకారం వెహికల్స్ ఏర్పాటు చేయాలని ఆర్టీవోను ఆదేశించారు. సాధారణ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ వంటి అంశాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే అధికారులందరూ జానమద్ది సాహితీ పీఠం వారితో సమన్వయం చేసుకుంటూ, ప్రోటోకాల్ ప్రకారం అవసరమైన అన్ని ఏర్పాట్లను ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి ఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవో జాన్ ఇర్విన్,కడప కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి,డీఎస్పీ వెంకటేశ్వర్లు,జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ,ఇతర శాఖల అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట కలెక్టర్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్

## అక్కన్నపేటలో ఇద్దరు గల్లంతుపై ఆరా ఎస్డీఆర్ఎఫ్ టీంలను పంపి గాలింపు చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రి ఆదేశం



కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):మొంతా తుపానుకు కురిసిన భారీ వర్షానికి హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలంలోని మల్లంపల్లి చెరువులో ఇద్దరు (భార్యభర్తలు) గల్లంతయ్యా రనే సమాచారం తెలుసుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సిద్దిపేట జిల్లా కలెక్టర్ కు గురువారం ఫోన్ చేశారు. ఆ ఇద్దరి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇద్దరూ భార్యాభర్తలని వారి బైక్ లభ్యమైందే తప్ప ఆచూకీ తెలియలేదని కలెక్టర్ వివరించారు. వెంటనే ఎస్డీఆర్ఎఫ్ టీంలను రప్పించి గాలింపు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయంలో అవసరమైతే అన్ని రకాల సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. స్థానిక బీజేపీ శ్రేణులు సైతం సహాయక చర్యల్లో పాల్గొనాలని, వర్ష బాధిత ప్రాంతాల్లో పర్యటించాలని పిలుపునిచ్చారు.

# ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలి: కలెక్టర్ పి.ప్రావీణ్య



సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, అక్టోబర్ 30 :ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ, ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లాలో "ఆయిల్ పామ్ పంట అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాల్గొన్నారు. ఆయిల్ పామ్ పంట ఆర్థికంగా లాభదాయకం. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో ఈ పంట విస్తరణకు రైతులు ముందుకు రావాలి. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, ప్రోత్సాహక పథకాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయి అని పేర్కొన్నారు. ఉద్యాన శాఖ అధికారులు ప్రతి మండలంలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన భూభాగాలను గుర్తించాలి. రైతులకు తగిన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.పి.ఎ.సి.ఎస్.సెక్రటరీ లు గ్రామస్థాయిలో రైతులను చైతన్యపరచడం లో కీలకపాత్ర పోషించాలి అని సూచించారు.ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, సహకార సంఘాల ప్రతినిధులు, రైతులు, పి.ఎ.సి.ఎస్. సెక్రటరీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, అక్టోబర్ 30(భారతశక్తి ప్రతినిధి):తుఫాన్ నేపథ్యంల జిల్లాలో 2 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో అక్టోబర్ 29, 30 తేదీలలో వర్షాలు ఉండే అవకాశం ఉందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. నీటి వనరులలో నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు.జిల్లావ్యాప్తంగా మత్స్యకారులు ఎవరు చేపలు పట్టడానికి వెళ్ళవద్దని సూచించారు. కల్వర్టులు దాటువద్దని, నీటి వనరుల సమీపంలో ప్రయాణాలు చేయవద్దని, అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అత్యవసమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# ఘట్టమనేని కథానాయిక సిద్ధం

సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణ కుటుంబం నుంచి కథానాయిక తెరపైకి రావడానికి సిద్ధమైంది. మంజుల ఘట్టమనేని కుమార్తె, మహేశ్‌బాబు మేనకోడలైన జాన్వి కథానాయికగా ఓ సినిమా కోసం ఎంపికైంది. ఆ వివరాల్ని త్వరలోనే ప్రకటించనున్నారు. జాన్వి తన పదేళ్ల వయసులోనే తల్లి మంజుల దర్శకత్వంలో రూపొందిన 'మనసుకు నచ్చింది' సినిమాతో తెరపై సందడి చేసింది.

అప్పట్నుంచి ఆమె నటన, నృత్యంపై దృష్టిపెడుతూ తనని తాను తీర్చిదిద్దుకుని కథానాయికగా కెరీర్‌ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. సామాజిక మాధ్యమాల్లో తన అందంతో ఇప్పటికే అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది జాన్వి. పలు ప్రకటనల్లోనూ నటించింది.

సంప్రదాయం, ఆధునికత కలగలిసిన రూపం ఆమె సినీ ప్రయాణం అంటూ తల్లి మంజుల ఘట్టమనేని స్పందించారు. "కొన్ని దశాబ్దాల కిందట కథానాయికగా నేనూ నా కెరీర్ గురించి కలలు కన్నా. కానీ ప్రతిఘటన ఎదురైంది.

అప్పుడు నన్ను వ్యతిరేకించినవాళ్లే ఇప్పుడు నా శ్రేయోభిలాషులు. నా ప్రార్థనలు ఫలించాయనడానికి రుజువు నా కుమార్తె జాన్వి చిరునవ్వే. ఆమె నా పరిపూర్ణత" అన్నారు. ఘట్టమనేని కుటుంబం నుంచి జాన్వితోపాటు, రమేశ్‌బాబు కుమారుడు, కుమార్తె కూడా సినీ ప్రయాణానికి శ్రీకారం చుట్టబోతున్నారు.




## రామాయణ.. అలా ట్రోల్ చేయడం తప్పు

బాలీవుడ్ డైరెక్టర్ నితీశ్ తివారీ రామాయణాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకుతీసుకురానున్న విషయం తెలిసిందే. 'రామాయణ' పేరుతో ప్రతిష్ఠాత్మకంగా ఇది రూపొందుతోంది. అయితే ఇందులో రాముడిగా రణ్‌బీర్‌ను ఎంపిక చేయడాన్ని కొందరు తప్పు పడుతూ ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ స్పందించారు. ఈ చిత్ర నిర్మాత నమిత్ మల్హోత్రాకు సద్గురు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఆయన వీటిపై స్పందించారు. రాముడిగా రణ్‌బీర్ ఎంపికను సమర్థించారు.

"అలా ట్రోల్ చేయడం అన్యాయం. గతంలో రణ్‌బీర్ అలాంటి పాత్రలు చేశాడు. ఇప్పుడు ఇలాంటి పాత్ర చేయడానికి వీల్లేదనడం అన్యాయమైన తీర్పు. భవిష్యత్తులో రాముడి పాత్ర చేయాల్సి వస్తుందని అతడికి తెలియదు కదా.. రేపు ఇంకో సినిమాలో రావణుడిగా నటించవచ్చు.. అప్పుడూ ట్రోల్స్ చేస్తారా?. అలా చేయడం సరైన పద్ధతి కాదు" అని అన్నారు. అలాగే ఈ సినిమాలో రావణుడి పాత్రలో యశ్ కనిపించనున్న విషయం తెలిసిందే. దీనిపై సద్గురు స్పందిస్తూ.. యశ్ అందమైన, తెలివైన వ్యక్తి అని చెప్పారు.

ఇక 'రామాయణ'లో బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కూడా నటిస్తున్నారు. ఆయన ఈ సినిమా కోసం తీసుకున్న పారితోషికం మొత్తాన్ని క్యాన్సర్ బాధిత పిల్లల చికిత్స కోసం విరాళంగా ఇచ్చినట్లు తాజాగా తెలిపారు. ఈ సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్న వివేక్ 'రామాయణ'తో భారతీయ చిత్ర పరిశ్రమకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందన్నారు.రెండు భాగాలుగా రానున్న ఈ ప్రాజెక్ట్‌లో మొదటి పార్ట్‌కు సంబంధించిన షూటింగ్ పూర్తయినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని సమాచారం. రూ.4000 కోట్ల భారీ బడ్జెట్‌తో రానున్న ఈ సినిమాలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ సీతగా సాయి పల్లవి రావణుడిగా యశ్, హనుమంతుడి పాత్రలో సన్నీదేవోల్ నటిస్తున్నారు. కైకేయిగా లారాదత్తా, శూర్పణఖగా రకుల్‌ప్రీత్‌సింగ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానున్నాయి.




## రిటైర్మెంట్ తీసుకోను.. చివరి శ్వాస వరకూ సెట్‌లోనే..: రవితేజ

'మాస్ జాతర' అంటూ ఆడియన్స్‌ను అలరించడానికి సిద్ధమయ్యారు హీరో రవితేజ. భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో రవితేజ ప్రచారం జోరు పెంచారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని ఇండస్ట్రీకి వచ్చినట్లు తెలిపారు.

"ఈ సినిమా కొంచెం ఆలస్యమైంది. దీని చిత్రీకరణలో నాకు కొన్ని గాయాలు అయ్యాయి. వాటి కారణంగానే చాలాసార్లు వాయిదా పడింది. సంక్రాంతికి విడుదల చేయాలని అనుకున్నాం, తర్వాత వేసవిలో రావాలనుకున్నాం, వినాయక చవితికి రిలీజ్ చేద్దాం అనుకున్నాం.. ఆ తేదీలేవీ కుదర్లేదు. ఇన్ని రోజులకు విడుదల చేస్తున్నాం. ఇదే సరైన సమయమని అనుకుంటున్నా. ఏది జరిగినా మన మంచికే. నా కెరీర్‌లో సినిమా ప్రారంభించిన తర్వాత ఇంత ఆలస్యం ఎప్పుడూ కాలేదు. మొదటిసారి ఇలా జరిగింది"."జయాపజయాలను నేను పట్టించుకోను. నా పని చేస్తూ వెళ్తాను. ఎవరికైనా నేను ఇచ్చే సలహా ఇదే. మన పనిని వందశాతం కష్టపడి చేస్తూ వెళ్తే ఏదో ఒకరోజు దానికి తగిన ఫలితం వస్తుందని నమ్ముతాను. ఆత్మవిశ్వాసం తగ్గిపోతే ఏదీ సాధించలేరు. అన్నిటికంటే మనపై మనకు నమ్మకం ముఖ్యం. నటనకు రిటైర్మెంట్ తీసుకోను. నా చివరి శ్వాస వరకూ నటిస్తూనే ఉంటాను. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌ను పట్టించుకోను. అందుకే అవి నన్ను ప్రభావితం చేయవు" అని రవితేజ తెలిపారు.




## 'మహాకాళి'గా భూమి శెట్టి.. ఫస్ట్‌లుక్ రిలీజ్

తన సినిమాటిక్ యూనివర్స్ (పీవీసీయూ) నుంచి ప్రతి ఏడాది ఓ సినిమా వస్తుందని ప్రశాంత్ వర్మ చెప్పిన సంగతి తెలిసిందే. ఇందులోభాగంగా రానున్న మూడో సినిమా 'మహాకాళి' . ఫీమేల్ సూపర్ హీరో చిత్రంగా ముస్తాబవుతోంది. దీనికి ప్రశాంత్ వర్మ కథ అందిస్తుండగా.. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ చిత్రంలో మహాకాళిగా కన్నడ నటి భూమి శెట్టి నటించనున్నట్లు తెలిపారు. 'విశ్వంలోనే అత్యంత శక్తిమంతమైన సూపర్ హీరోలు రానున్నారు' అంటూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను పంచుకున్నారు. భూమి శెట్టి ఇటీవల 'కింగ్డమ్'లో కనిపించిన విషయం తెలిసిందే. అందులో సత్యదేవ్ భార్యగా ఆమె అలరించారు.

ఇక 'మహాకాళి' షూటింగ్ ఇప్పటికే 50 శాతం పూర్తయినట్లు సమాచారం . ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో చిత్రీకరణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా ) శుక్రాచార్యుడిగా నటిస్తున్నారు. గతంలో ఈ సినిమా గురించి ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. "మా యూనివర్స్‌కు కొత్త శక్తి జోడైంది. అత్యంత భయంకరమైన చెడుపై యుద్ధం చేయడానికి కాళికాదేవి స్వరూపం రానుంది. సూపర్ హీరోలు ఎలా ఉంటారో ఈ చిత్రంలో చూపించనున్నాం" అని అన్నారు.

ఈ యూనివర్స్‌లో భాగంగా ఇటీవల 'అధీర'ను ప్రకటించారు. ఎస్‌జే సూర్య కల్యాణ్ దాసరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నట్లు తెలిపారు. ఈ సూపర్ హీరో ఫిల్మ్‌కు శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించనున్నారు.

## ఎప్పటికీ గుర్తుండే సినిమా... రాజు వెడ్స్ రాంబాయి

వరంగల్ మధ్య జరిగిన ఒక వాస్తవ సంఘటన ఆధారంగా మా 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం రూపొందింద"ని చెప్పారు ప్రముఖ దర్శకుడు వేణు ఊడుగుల. ఆయన, రాహుల్ మోపిదేవి కలిసి నిర్మిస్తున్న చిత్రమే ఇది. అఖిల్, తేజస్విని జంటగా నటించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. డా.నాగేశ్వరరావు పూజారి సమర్పకులు. ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్‌తో కలిసి వంశీ నందిపాటి, బన్నీ వాస్ వచ్చేనెల 21న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. విడుదల తేదీని ప్రకటిస్తూ బుధవారం హైదరాబాద్‌లో ఓ వేడుకని నిర్వహించింది చిత్రబృందం. ఈ సందర్భంగా వేణు ఊడుగుల మాట్లాడుతూ "ఒక ఊరిలో జరిగి, అక్కడే సమాధి అయిన ఓ సంఘటన ఆధారంగా దర్శకుడు సాయిలు రాసిన ఈ స్క్రిప్ట్ ఎంతగానో నచ్చింది. ప్రేమతో కూడిన విషాదకరమైన సంఘటన అది. వినగానే మనసుని కదిలించింది. మాస్ వినోదంతో అంతే బలంగా ఈ సినిమాని తెరకెక్కించాడు సాయిలు. ఈటీవీ విన్ సంస్థ కారణంగానే నేను నిర్మాతని అయ్యాను. '7/జి బృందావన్ కాలని', 'ప్రేమిస్తే', 'ఆర్.ఎక్స్.100', 'బేబి' చిత్రాల తరహాలో ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది" అన్నారు. దర్శకుడు సాయిలు మాట్లాడుతూ "చిన్నప్పుడు మా ఇంట్లో టీవీ లేకుంటే మరొకరి ఇంటి కిటికీ నుంచి ఈటీవీలో వచ్చే సినిమాలు చూసేవాళ్లం. ఇప్పుడు నేను దర్శకత్వం వహించిన సినిమా ఈటీవీ సంస్థ నుంచి ప్రేక్షకుల ముందుకు వస్తుండడంతో భావోద్వేగానికి గురవుతున్నా" అన్నారు. కథానాయకుడు అఖిల్ మాట్లాడుతూ "ఈ సినిమాతో కథానాయకుడిగా నన్ను పరిచయం చేస్తున్న ఈటీవీ విన్, వేణు ఊడుగుల, దర్శకుడు సాయిలుకు కృతజ్ఞతలు" అన్నారు.



# పునరాగమనం కోసం తహతహ..

## షమీని మళ్లీ చూడగలమా?



భారత క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ పేస్ బౌలర్లలో ఒకడు మహ్మద్ షమీ. చాలా ఏళ్ల పాటు మూడు ఫార్మాట్లలో జట్టుకు కీలక బౌలర్‌గా ఉన్నాడు. ముఖ్యంగా టెస్టులు, వన్డేల్లో అతడికి గొప్ప రికార్డు ఉంది. దిగ్గజాల జాబితాలో నిలిచే స్థాయి ఉన్న ఈ బౌలర్.. టీమ్ఇండియాకు క్రమక్రమంగా దూరం అయిపోతున్నాడు. సెలక్టర్ల తీరు చూస్తుంటే.. షమీ మళ్లీ భారత జట్టుకు ఆడగలడా అన్న సందేహాలు కలుగుతున్నాయి. 2023 వన్డే ప్రపంచకప్ సందర్భంగా షమీ పేరు ఎంతగా మార్మోగిందో గుర్తుండే ఉంటుంది. సొంతగడ్డపై అప్రతిహత విజయాలతో భారత జట్టును ఫైనల్‌కు చేర్చడంలో షమీది అత్యంత కీలక పాత్ర. 24 వికెట్లతో ఆ టోర్నీలో అత్యుత్తమ బౌలర్‌గా నిలిచాడు షమీ. తన కెరీర్లో మరెన్నో ఉత్తమ ప్రదర్శనలు ఉన్నా.. ఆ ప్రపంచకప్‌లో షమీ బౌలింగ్ మెరుపులను అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. కానీ అంత గొప్ప ప్రదర్శన తర్వాత షమీకి టీమ్ఇండియాలో ఇబ్బందికర పరిస్థితి తప్పలేదు. ప్రపంచకప్‌లో గాయంతో దాదాపు ఏడాది పాటు అతను మైదానానికి దూరంగా ఉన్నాడు. గత ఏడాది చివర్లో కోలుకొని ఆటలోకి వచ్చినా, భారత జట్టులో తిరిగి చోటు సంపాదించడం కష్టమైపోయింది. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు షమీకి జట్టులో చోటివ్వలేదు సెలక్టర్లు. దేశవాళీల్లో ఆడి ఫిట్‌నెస్, ఫామ్‌ను చాటుకున్నా అతడికి అవకాశం దక్కలేదు. టెస్టుల్లో ఆడేంత పరిపూర్ణ ఫిట్‌నెస్ షమీకి లేదన్నట్లుగా మాట్లాడాయి జట్టు వర్గాలు. అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ సైతం ఇదే విషయం చెప్పాడు.

ఆపై ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్‌లో షమీని ఆడిస్తే ఆశించినంత ప్రదర్శన చేయలేదు. 3 మ్యాచ్‌ల్లో 3 వికెట్లే తీశాడు. తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీలో తలపడే భారత వన్డే జట్టులో షమీకి ఛాన్స్ లభించింది. కానీ ఆ టోర్నీలోను షమీ అంచనాలను అందుకోలేకపోయాడు. బలహీన బంగ్లాదేశ్‌పై 5 వికెట్లు తీసినా.. మిగతా 4 మ్యాచ్‌ల్లో 4 వికెట్లే పడగొట్టాడు. పాకిస్థాన్ మీద ఒక్క వికెట్టూ తీయలేకపోయాడు. దీంతో ఈ టోర్నీ తర్వాత షమీని సెలక్టర్లు పూర్తిగా పక్కన పెట్టేశారు. ఇంగ్లాండ్ పర్యటనలో టెస్టు జట్టుకు ఎంపిక చేయలేదు. ఆసియా కప్ టీ20 టోర్నీలో ఆడించలేదు. ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌లోనూ అతడికి ఛాన్సివ్వలేదు. వివిధ ఫార్మాట్లలో జట్టు ఎంపిక సందర్భంగా షమీ పేరును సెలక్టర్లు అసలు పరిగణనలోకే తీసుకోవట్లేదనే సంకేతాలు కనిపిస్తున్నాయి. దీంతో అతని కెరీర్‌పై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

### మాటల దాడి

టీమ్ఇండియాకు షమీని ఎంపిక చేయకపోవడంపై ఇటీవల అతడికి, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌కు మధ్య పరోక్షంగా మాటల దాడి జరుగుతోంది. షమీ ఫిట్‌నెస్ మీద అగార్కర్ సందేహాలు వ్యక్తం చేస్తున్నాడు. టెస్టులు ఆడేంత పూర్తి ఫిట్‌నెస్ షమీలో లేదన్నట్లు అతను మాట్లాడాడు. దీనికి షమీ కూడా దీటుగానే బదులిచ్చాడు. తాను రంజీల్లో ఆడుతున్నానంటే ఫిట్‌గా ఉన్నట్లేనని.. ప్రతిసారీ తన ఫిట్‌నెస్ గురించి సెలక్టర్లకు ప్రత్యేకంగా సమాచారం ఇవ్వలేనని అతనన్నాడు. ఇన్నేళ్ల కెరీర్లో షమీ ఎప్పుడూ ఇలా సెలక్షన్ గురించి బహిరంగ వ్యాఖ్యలు చేసింది లేదు. తాజాగా షమీ రంజీల్లో సత్తా చాటాడు. 2 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీశాడు. అనంతరం అతను మాట్లాడుతూ.. టీమ్ఇండియాకు మళ్లీ ఆడాలని ఉందని.. రాణించడం వరకే తన పని అని, మిగతాదంతా సెలక్టర్ల చేతుల్లో ఉందని వ్యాఖ్యానించాడు. కానీ భవిష్యత్ ప్రణాళికల దృష్ట్యా సెలక్టర్లు షమీ వైపు చూడట్లేదనే చర్చ జరుగుతోంది.

35 ఏళ్ల షమీ, ఇప్పుడు ఉన్న ఫిట్‌నెస్‌తో టెస్టులు ఆడలేడన్నది సెలక్టర్ల అభిప్రాయంగా కనిపిస్తోంది. అతను టెస్టులాడి రెండేళ్లు దాటిపోవడం గమనార్హం. మరోవైపు వన్డేలు ఆడడమే తక్కువ. ఆస్ట్రేలియాకు అతన్ని ఎంపిక చేయలేదంటే.. 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో అతను లేడనే అనిపిస్తోంది. టీ20ల్లో షమీ ఆడడమే తక్కువ. పైగా ఈ ఏడాది ఐపీఎల్‌లో విఫలమయ్యాడు. వచ్చే ఏడాది పొట్టి ప్రపంచకప్ కోసం యువ బౌలర్లకే ఎక్కువగా అవకాశాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏ ఫార్మాట్లోనూ షమీకి పరిస్థితులు ఆశాజనకంగా కనిపించడం లేదు. వయసు, ఫిట్‌నెస్ అతడికి ప్రతికూలతలుగా మారాయి. ఈ నేపథ్యంలో షమీని మళ్లీ టీమ్ఇండియా జెర్సీలో చూసే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి.

## 18వ నంబర్ జెర్సీ ధరించిన
# రిషభ్ పంత్.. నెట్టింట వైరల్



గాయం నుంచి కోలుకొని దక్షిణాఫ్రికా తో రిషభ్ పంత్ అనధికారిక టెస్టు సిరీస్ బరిలోకి దిగాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ సమయంలో పాదానికి గాయం కావడంతో రిషభ్ పంత్ దాదాపు మూడు నెలల పాటు ఆటకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు భారత్ %ూ% జట్టు సారథిగా మ్యాచ్ ఆడుతున్నాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ మైదానం వేదికగా తొలి మ్యాచ్ మొదలైంది. టాస్ నెగ్గిన రిషభ్ పంత్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఇక్కడే అతడు ధరించిన జెర్సీ ఫొటోలు వైరల్‌గా మారాయి.

రిషభ్ పంత్ 18వ నంబర్‌తో ( కూడిన జెర్సీని ధరించి మైదానంలోకి వచ్చాడు. దీంతో అందరి దృష్టి ఆ జెర్సీ పైనే పడింది. ఎందుకంటే, అది ఒకప్పుడు స్టార్ ఆటగాడు, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ జెర్సీ నంబర్ కావడమే విశేషం. విరాట్ టెస్టులకు రిటైర్‌మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీంతో ఆ జెర్సీని పంత్ ధరించాడు. సాధారణంగా పంత్ జెర్సీ నంబర్ 17. పొరపాటున 18గా ముద్రితమైన జెర్సీని ధరించాడా?అనే సందేహం అభిమానుల్లో నెలకొంది. లేకపోతే కావాలనే ఆ నంబర్ జెర్సీని వేసుకొని వచ్చాడా? అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే, ఇంతకుముందు ముకేశ్ కుమార్ (జెర్సీ నంబర్ 49) కూడా గత ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ‘ జట్టు తరఫున బరిలోకి దిగినప్పుడు 18వ నంబర్ జెర్సీని ధరించాడు.

### ఫ్యాన్స్ విజ్ఞప్తి మరోలా..

స్టార్ ఆటగాళ్లు ఆటకు వీడ్కోలు పలికినప్పుడు ఆ జెర్సీ నంబర్లకు కూడా రిటైర్‌మెంట్ ఇచ్చేయడం ఆనవాయితీగా వస్తోంది. సచిన్ తెందూల్కర్ (10), ఎంఎస్ ధోనీ (7) ఆటకు గుడ్‌బై చెప్పినప్పుడు బీసీసీఐ ఇలానే చేసింది. ఆ నంబర్ల జెర్సీలను ఎవరూ వాడేందుకు వీలు లేకుండా చేసింది. కానీ, కోహ్లీ విషయంలో మాత్రం బీసీసీఐ ఇంకా అలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే, విరాట్ ఇప్పుడు వన్డేల్లోనూ ఉండటంతో 18వ నంబర్‌కు రిటైర్‌మెంట్ ఇవ్వలేదు. దీంతో టెస్టుల్లో అందుబాటులో ఉన్న ఈ నంబర్‌ను రిషభ్ పంత్ ఈ అనధికారిక టెస్టు సిరీస్ కోసం ఎంచుకొని ఉంటాడని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకవేళ కోహ్లీ, రోహిత్ (జెర్సీ నంబర్ 45) వన్డే ఫార్మాట్‌నూ వదిలేస్తే మాత్రం బీసీసీఐ ఆ దిశగా ఆలోచన చేసే అవకాశం లేకపోలేదు.

తొలి అనధికారిక టెస్టులో టాస్ ఓడిన దక్షిణాఫ్రికా జట్టు బ్యాటింగ్‌కు దిగింది. భారత బౌలర్లను ఎదుర్కొంటూ మెరుగైన ప్రదర్శనే చేస్తోంది. ఆ జట్టు ఓపెనర్ లెసెగో (0) డకౌట్ అయినప్పటికీ.. మరో ఓపెనర్ జోర్డాన్, వన్‌డౌన్ బ్యాటర్ హమ్జా హాఫ్ సెంచరీలు సాధించారు.

# రోజురోజుకూ మెరుగవుతున్నా:
## గాయంపై శ్రేయస్ అప్‌డేట్



ఆస్ట్రేలియాతో మూడో వన్డే సందర్భంగా శ్రేయస్ అయ్యర్ గాయపడ్డాడు. ప్లీహానికి తీవ్ర గాయం కావడంతో ఐసీయూలో చేరాడు. ఇప్పటికే అతడి ఆరోగ్యంపై బీసీసీఐ అప్‌డేట్స్ ఇస్తూనే ఉంది. శస్త్రచికిత్స అవసరం లేకుండానే ప్లీహం వద్ద రక్తస్రావం ఆగిపోయేలా చేసినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. మరో నాలుగైదు రోజులు శ్రేయస్ ఆసుపత్రిలోనే ఉండే అవకాశం ఉంది. ఈ క్రమంలో శ్రేయస్ తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా అప్‌డేట్ ఇచ్చాడు. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టాడు.

“ఇప్పుడు నేను రికవరీ ప్రాసెస్‌లో ఉన్నా. రోజు గడిచే కొద్దీ మెరుగవుతూ ఉన్నా. మీ అందరి దీవెనలతో త్వరలోనే కోలుకుని వస్తా. మీ మద్దతును ఎప్పటికీ మరిచిపోలేను. భారీ స్థాయిలో ఆశీస్సులు అందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. నా గురించి నిరంతరం ఆలోచిస్తున్నందుకు ధన్యవాదాలు” అని శ్రేయస్ పోస్టులో పేర్కొన్నాడు.

### కనీసం ఎనిమిది వారాలు దూరం

ఒకవేళ ఆసుపత్రి నుంచి శ్రేయస్ ఈ వారంలోనే డిశ్చార్జి అయినా సరే.. కనీసం రెండు నెలలపాటు ఆటకు దూరమవుతాడు. ప్రాణాలు పోయేంత ప్రమాదం నుంచి మాత్రం బయటపడటం అభిమానులకు సంతోషం కలిగించింది. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రాణాల మీదకు వచ్చేదని ఇప్పటికే వైద్య బృందం పేర్కొంది. అతడు ఎనిమిది వారాలపాటు మైదానంలోకి దిగడు. జనవరి నాటికి ఫిట్‌నెస్ సాధిస్తే న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లో ఆడే అవకాశం ఉంది. అప్పటికీ కుదరకపోతే ఇక టీ20 ప్రపంచకప్‌లోనే అదీనూ ఎంపికైతేనే బరిలోకి దిగుతాడు. మళ్లీ వచ్చే ఏడాది జూన్‌లో ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో భారత్ తలపడనుంది. ఆలోగా ఐపీఎల్ కూడా ఉంది. రెండు నెలల్లో పూర్తిగా ఫిట్‌నెస్ సాధిస్తే పొట్టి కప్‌లో ఆడే అవకాశం వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.



# వన్డేల్లో విరాట్.. టీ20ల్లో గిల్ ఆటతీరు ఒకటే: డీకే

: కేవలం టెస్టుల్లోనే మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తాడని.. వన్డేలు, టీ20 ఫార్మాట్‌లో గొప్పగా ఆడలేడని శుభ్‌మన్ గిల్‌పై విమర్శలు ఉన్నాయి. కానీ, ఆసీస్‌తో తొలి టీ20 తర్వాత ఆ విమర్శలు తప్పని తేలిపోయింది. ఓపెనర్ అభిషేక్ శర్మతో కలిసి గిల్ శుభారంభం చేశాడు. అభిషేక్ ఔటైనా సరే తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించిన తీరు అద్భుతంగా ఉందని మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ ప్రశంసించాడు. ఈ సందర్భంగా విరాట్ వన్డేల్లో ఎంత ప్రశాంతంగా ఆడేస్తాడో.. గిల్ కూడా టీ20ల్లో ఇన్నింగ్స్‌ను ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా నిర్మిస్తాడని డీకే వ్యాఖ్యానించాడు. ఇలాంటి గేమ్ ఆడేందుకు కెప్టెన్, వైస్ కెప్టెన్ పదవులతో వచ్చిన ఆత్మవిశ్వాసమే కారణమని డీకే తెలిపాడు.

“విరాట్ కోహ్లీ వన్డేల్లో ఎలాంటి ఆటతీరు ప్రదర్శించాడో.. శుభ్‌మన్ గిల్ కూడా పొట్టి ఫార్మాట్‌లో చూపించాడు. స్కోరు బోర్డు చూసే వరకూ అతడు ఎన్ని పరుగులు చేశాడో కూడా తెలియదు. కోహ్లీ క్రీజ్‌లో ఉంటే పరుగులు ఆటోమేటిక్‌గా వస్తూనే ఉంటాయి. ఇప్పుడు శుభ్‌మన్ గిల్‌ను చూస్తుంటే అలానే అనిపిస్తుంది. అతడు ఈ ఫార్మాట్‌లో ఓపెనర్‌గా రావడానికి కఠినమైన సవాళ్లను ఎదుర్కొన్నాడు. యశస్వి జైస్వాల్, సంజు శాంసన్, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ వంటి ప్లేయర్లను దాటుకొని వచ్చాడు. ఇక్కడ నిలదొక్కుకోవడం అంత తేలికైన విషయం కాదు. ఒత్తిడిని అధిగమించి నిలకడగా పరుగులు చేయాలి. అలా జరగాలంటే అద్భుతమైన నైపుణ్యం ఉండాల్సిందే. మూడు మ్యాచుల్లో ఒకదాంట్లోనైనా విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలి. భారత జట్టులో బ్యాటింగ్ డెప్త్ ఆ స్థాయిలో ఉంది. ఇప్పుడు శుభ్‌మన్ గిల్ టెస్టులు, వన్డేల్లో కెప్టెన్‌గా ఉన్నాడు. టీ20ల్లో వైస్ కెప్టెన్సీ దక్కింది. ఆ బాధ్యతలే అతడిలో ఆత్మవిశ్వాసం నింపింది. అయితే, ఆ కాన్ఫిడెన్స్ ఓ స్థాయి వరకు సహాయపడుతుంది. కానీ నిలకడగా పరుగులు చేయడం మాత్రం ఆపకూడదు. ఇప్పుడదే గిల్ చేసి చూపించాడు” అని డీకే వెల్లడించాడు.

అవన్నీ ఊహాగానాలే: సంజుశుభ్‌మన్ గిల్ వల్ల తన ఓపెనింగ్ స్థానానికి ముప్పు వచ్చిందనే ఆరోపణలపై సంజు శాంసన్ స్పందించాడు. “నేను భిన్నమైన జట్లకు భిన్నమైన పాత్రలు పోషించా. ఇప్పుడు నేను భారత జట్టులో చాన్నాళ్ల నుంచి ఆడుతున్నా. వివిధ స్థానాల్లో బ్యాటింగ్ చేస్తున్నా. మ్యాచులు ముగించిన రోజులూ ఉన్నాయి. ఇప్పుడు నేను మిడిలార్డర్‌లో ఆడుతున్నా. కేవలం ఓపెనర్లే ఫిక్స్ అయ్యారు. మిగతా బ్యాటర్లంతా పరిస్థితికి అనుగుణంగా ఏ సమయంలోనైనా బ్యాటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలి. మేమంతా అలానే ప్రిపేర్ అయి ఉన్నాం” అని సంజు స్పష్టం చేశాడు.



# మెడకు తగిలిన బంతి.. మృత్యువుతో పోరాడి ఆసీస్ యువ క్రికెటర్ మృతి

ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరో విషాదం చోటుచేసుకుంది. పదకొండేళ్ల కిందట ఫిల్ హ్యూస్ మైదానంలోనే కుప్పకూలిన ఉదంతం ఇప్పటికీ అక్కడి అభిమానులను కలవరపెడుతోంది. తాజాగా 17 ఏళ్ల ఓ యువ క్రికెటర్ ఇదేతరహాలో ప్రాణాలు కోల్పోవడం గమనార్హం. అయితే, అతడు రెండు రోజులపాటు ఆసుపత్రిలో ఉన్నా ఫలితం లేకుండాపోయింది.

మెల్‌బోర్న్‌కు చెందిన బెన్ అస్టిన్ టీ20 మ్యాచ్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ట్రైనింగ్ సెషన్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా బంతి అతడి మెడకు బలంగా తగిలింది. దీంతో అతడు కుప్పకూలిపోయాడు. సహచర క్రికెటర్లు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఇది మంగళవారం సాయంత్రం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు రోజులపాటు మృత్యువుతో పోరాడిన యువ క్రికెటర్ గురువారం ఉదయం ప్రాణాలు విడిచినట్లు వైద్యులు తెలిపారు. ప్రాక్టీస్ సమయంలోనూ అతడు తలకు హెల్మెట్ పెట్టుకొని ఉన్నట్లు అక్కడి క్రికెట్ వర్గాలు తెలిపాయి. “బెన్ క్రికెట్ కాకుండా ఫుట్‌బాల్ మ్యాచులు ఆడేవాడు. బెన్ ఆకస్మిక మరణం మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది. అతడి మృతి మా క్రికెట్ కమ్యూనిటీపై ప్రభావం చూపిస్తుంది.

# నర్సింగ్ విద్యాలయాలపై పూర్తి స్థాయి విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలి

* డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్లను సస్పెండ్ చేయాలి
* నర్సింగ్' ప్రమోషన్లలో గోల్మాల్ గుట్టును బయటపెట్టాలి
* కోఠిలోని వైద్య విద్య సంచాలకుల కార్యాలయం ముందు నిరసన ధర్నా, వినతిపత్రం అందజేత
* ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్



హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై పూర్తి స్థాయి విచారణ జరిపి,చర్యలు తీసుకోవాలని, డీఎంఈ, నర్సింగ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో కోఠిలోని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ముందు నిరసన ధర్నా నిర్వహించి, అనంతరం డైరెక్టర్ నరేంద్ర కుమార్ పేషీలో ఏఐవైఎఫ్ రాష్ట్ర బృందం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నర్సింగ్ స్కూళ్లు, కళాశాలల అవకతవకలపై విచారణ జరపాలి. గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వం ఇచ్చినటువంటి జీవో ప్రకారం సంబంధిత చిరునామాల్లో నర్సింగ్ స్కూల్స్, కళాశాలలు నిర్వహించకుండా ఇతర ప్రాంతాల్లో, జిల్లాల్లో నిర్వహిస్తున్నారని, అలాగే ఒకే భవనంలో 2 నుండి 6 ఇన్స్టిట్యూషన్స్ నిర్వహించడం, భవనాలు, ఫ్యాకల్టీ, మౌలిక వసతులు, విద్యార్థులు క్లినికల్ సైడ్ ప్రాక్టీస్ చేస్తున్నారా లేదా అనే విషయాల పట్ల బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి విద్యార్థుల భవిష్యత్తును, ప్రభుత్వ వ్యవస్థని భ్రష్టు పట్టించిన ఈ అధికారులపైన, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ లో నర్సింగ్ ఎడ్యుకేషన్ సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న దాసు కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసుల పైన ఏసీబీ ద్వారా విచారణ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నర్సింగ్ కళాశాలల్లో లెక్చరర్ల ప్రమోషన్లలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటున్నదని, ఏడాదిగా ప్రమోషన్లు చేపట్టకపోవడంతో దాదాపు 200 మందికి పైగా నర్సింగ్ ఆఫీసర్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. స్టాఫ్ నర్సులుగా పనిచేస్తూ ఎంఎస్సీ నర్సింగ్ చేసిన వారికి ఈ పదోన్నతులు ఇవ్వాల్సి ఉండగా.. అధికారుల అలసత్వం కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 560 లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉండగా, ఇటీవల 93 మందికి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించారని, దీంతో ఖాళీల సంఖ్య 653కు చేరిందన్నారు. అదేవిధంగా నర్సింగ్ ఆఫీసర్లకు లెక్చరర్ పోస్టులు ఇప్పిస్తానని చెప్పి డీఎంఈ కార్యాలయంలో పని చేసే ఓ మహిళాధికారి గతంలో 100 మంది వద్ద ఒక్కొక్కరి నుంచి రూ.10 వేలు వసూలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇటీవల 12 మందికి అర్హత లేకున్నా ప్రమోషన్లు కల్పిస్తానని చెప్పిన సదరు మహిళాధికారి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.2 లక్షలు వసూలు చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, ఆర్.బాలకృష్ణ, పి. శివ కుమార్, షేక్ మహమూద్, తదితరులు పాల్గొన్నారు.



## పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న చిగిరింత పారిజాత రెడ్డి

బడంగ్ పేట్, అక్టోబర్ 30 (భారత శక్తి): పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 17వ బ్రాంచి బడంగ్ పేట్ లో ఏర్పాటు చేసిన సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, సామ భాస్కర్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, పెద్దబావి బాబు, శ్రీనివాస్ గుప్త, చైర్మన్ తడక రమేష్, బ్రాంచి హెడ్ మేనేజర్ రేష్మ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్లు ఎపిక్ కార్డు కాకుండా 12 ప్రత్యామ్నాయ ఫోటో ఐడిలలో దేనినైనా ప్రదర్శించి ఓటు వేయవచ్చు

* ఓటు వేసేందుకు
* ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు కార్డులు ఇవే..!
* జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్



హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి): నవంబర్ 11వ తేదీన జరగనున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితలో పేరుండి కూడా ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ క్రింద చూపిన 12




ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు కార్డులలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి ఓటరు తమ ఓటు హక్కును నియోగించుకోవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు.ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు.ఆధార్, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకుతో పాటు, తపాల కార్యాలయం జారీ చేసిన ఫోటోతో కూడిన పాస్ బుక్, కేంద్ర కార్మిక శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు లేదా ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌ఎఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా(ఆర్జిఐ) జారీ చేసిన స్మార్ట్ కార్డు, భారతీయ పాస్ పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ పత్రాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు, కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ జారీ చేసిన యూనిక్ డిజేబుల్ గుర్తింపు కార్డు (యూడీఐడీ)లు కలిగి ఉండాలనీ జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు.ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా....ఈ 12 ఫోటో కార్డులో ఏ గుర్తింపు కార్డు ఉన్నా ఓటు వేయవచ్చునని జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు.



బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని రోమా IV కాలనీలో రాజిరెడ్డి నూతన గృహ ప్రవేశ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బోయపల్లి రాఘవేందర్ రెడ్డి,సామ భాస్కర్ రెడ్డి, పెద్దబావి బాబు,కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బడంగ్ పేట్, అక్టోబర్ 30 (భారత శక్తి ):

## సీఎస్ఆర్ నిధుల వినియోగంలో.. ముష్కిన్ చెరువు నమూనా కావాలి

* హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి): సీఎస్ఆర్ నిధులతో చెరువులు అభివృద్ధి చేస్తున్న పలు సంస్థలకు ముష్కిన్ చెరువు ఒక నమూనా కావాలని తత్వ డెవలపర్స్‌కు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సూచించారు.నార్సింగి మండలంలోని ఈ చెరువు అభివృద్ధిని తత్వా డెవలపర్స్ అనే సంస్థ సీఎస్ఆర్ నిధుల (సామాజిక బాధ్యత)తో అభివృద్ధి చేస్తోంది.గతంలో చెరువు హద్దులను పూర్తి స్థాయిలో మార్కింగ్ చేసి ఇవ్వక పోవడంతో అభివృద్ధి జాప్యం అయ్యిందని సంస్థ ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. దాదాపు 60 ఎకరాల పరిధిలోని ప్రభుత్వ భూముల సర్వే పూర్తి చేసి, అనధికార ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చెరువు పరిసర కాలనీల నివాసితులు, దేవాలయ కమిటీ సభ్యులు, రైతులు, ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువు అభివృద్ధిని చేపట్టిన తత్వా డెవలపర్స్ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి కమిషనర్ చర్చించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చిన రైతులకు టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్స్) కింద నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. చెరువులోకి వరద నీరు వచ్చి చేరడంతో పాటు.. ఔట్‌లెట్ కూడా సరిగ్గా ఉండేలా చూడాలన్నారు. చెరువు చుట్టూ పటిష్టమైన బండ్ నిర్మించి.. మొక్కలు నాటి.. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తత్వా సంస్థ అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.

## సిసి రోడ్ల పనులను పరిశీలించిన కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ..!

ఎల్బీనగర్, అక్టోబర్ 30 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ లోని సిద్ధి వినాయక కాలనీలో నూతన సిసి రోడ్ల నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని, అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ సిసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్స్పెక్టర్ సురేష్, కాలనీ అధ్యక్షులు నాని, డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు అఖిల్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## రూ. 111 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

* 1.28 ఎకరాల ప్రభుత్వ భూమితో పాటు పార్కుకు కబ్జాల నుంచి విముక్తి




హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి) : రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్, బాలాపూర్ మండలాల్లో 976 గజాల పార్కుతో పాటు 1.28 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా గురువారం కాపాడింది. వీటి విలువ రూ. 111 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. మైలార్‌దేవుపల్లి విలేజ్‌లోని శాస్త్రీపురం కాలనీలో 976 గజాల పార్కు స్థలం చుట్టూ గతంలో మున్సిపల్ అధికారులు ఫెన్సింగ్ వేసింది. తప్పుడు డాక్యుమెంట్లతో కొంతమంది పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని అక్కడి నివాసితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా చర్యలు తీసుకుంది. 1996లో వేసిన హుడా లే ఔట్‌లో పార్కుస్థలం కబ్జా అయ్యిందని ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించి ఆ స్థలాన్ని హైడ్రా కాపాడిందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బాలాపూర్ మండలం జిల్లెలుగూడ విలేజ్‌లో సర్వే నంబరు 76లోని 1.28 ఎకరాల ప్రభుత్వ భూమిలో కూడా ఆక్రమణలను హైడ్రా గురువారం తొలగించింది. కొంతమంది ఫేక్ పట్టాలు సృష్టించి ప్లాట్లుగా విక్రయించడంతో పాటు.. ఆక్రమణలకు పాల్పడుతున్నారంటూ హైడ్రాకు ఫిర్యాదు అందగానే ఈ చర్యలు తీసుకుంది. పార్కుతో పాటు.. ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా బోర్డులను ఏర్పాటు చేసింది.

# బీహార్‌లో వేడెక్కిన రాజకీయం.. నేడు మోదీ ప్రచారం, నిన్న రాహుల్ విమర్శలు


బీహార్, అక్టోబర్ 30 (భారత శక్తి) : బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ప్రధాన పార్టీల అగ్రనేతల పర్యటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రధాని నరేంద్ర మోదీ నేడు ముజఫర్‌పూర్, ఛప్రాలలో రెండు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొననున్నారు. ఈ పర్యటన ద్వారా ఎన్డీఏ కూటమి ప్రచారాన్ని మరింత ఉద్ధృతం చేయనున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ బీహార్‌లో బీజేపీ-ఎన్డీఏ కూటమి సంపూర్ణ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "బీహార్‌లోని నా కుటుంబ సభ్యులే ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం కోసం స్వయంగా బరిలోకి దిగారు. ఈ ఉత్సాహపూరిత వాతావరణంలో ఈ ఉదయం 11 గంటలకు ముజఫర్‌పూర్‌లో, మధ్యాహ్నం 12:45 గంటలకు ఛప్రాలో ప్రజలతో సంభాషించే భాగ్యం నాకు కలుగుతుంది. రాష్ట్రంలోని నా సోదర సోదరీమణులు మరోసారి విజయ శంఖాన్ని పూరిస్తారని నాకు పూర్తి నమ్మకం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ముజఫర్‌పూర్‌లో జరిగిన మహాఘట్‌బంధన్ ఉమ్మడి సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీపై తీవ్ర ఆరోపణలు చేశారు. "ఆయనకు (మోదీకి) కేవలం మీ ఓటు మాత్రమే కావాలి. ఓట్ల కోసం డ్రామా చేయమంటే చేస్తారు. మీరేమైనా చేయించగలరు. నరేంద్ర మోదీని డ్యాన్స్ చేయమన్నా చేస్తారు" అంటూ రాహుల్ విమర్శించారు. "వారు మీ ఓట్లను దొంగిలించే పనిలో ఉన్నారు. మహారాష్ట్ర, హర్యానాలలో ఎన్నికలను దొంగిలించారు. ఇప్పుడు బీహార్‌లోనూ అదే ప్రయత్నం చేస్తారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇదిలా ఉండగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా బుధవారం బేగుసరాయ్, సమస్తిపూర్, దర్భంగాలలో ఎన్డీఏ తరఫున ప్రచార ర్యాలీలు నిర్వహించారు. 2025 బీహార్ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ కూటముల మధ్య నెలకొంది. ఎన్డీఏలో బీజేపీ, జేడీ(యూ), ఎల్‌జేపీ (రామ్ విలాస్) వంటి పార్టీలు ఉండగా, మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీలు ఉన్నాయి. వీటికి తోడు ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ కూడా రాష్ట్రంలోని 243 స్థానాల్లో పోటీ చేస్తోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు విడతలుగా జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## నా చివరి కోరిక ఇదే: ఆర్. కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి) : బీసీలకు రాజ్యాధికారం కల్పించడమే తన జీవితంలో చివరి కోరిక అని బీసీ సంఘాల నేత, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. రిజర్వేషన్లు సాధించే వరకు తమ పోరాటం ఆగదని, ఈ ఉద్యమం తెలంగాణ నుంచే ప్రారంభమైందని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల నిర్వహించిన 'బీసీ బంద్' సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 350 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని ఆర్. కృష్ణయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. బీసీల హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న వారిని అరెస్టు చేయడం సరికాదని మండిపడ్డారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించడమే లక్ష్యంగా తన నాయకత్వంలో బీసీ జేఏసీని ఏర్పాటు చేసినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ లక్ష్యం నెరవేరేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని, వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని కృష్ణయ్య అభిప్రాయపడ్డారు.

## మంత్రులు జూబ్లీహిల్స్‌లో.. వరంగల్ నీళ్లలో

హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి) : భారీ వర్షాలతో వరంగల్ నగరం నీట మునుగుతుంటే ముఖ్యమంత్రి, మంత్రులు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఊరేగడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. మంత్రుల జల్సాలకు హెలికాప్టర్లు వస్తాయి గానీ, ప్రజలు ఆపదలో ఉంటే రావా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. హనుమకొండలోని జులైవాడ, అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డు తదితర జలమయమైన ప్రాంతాల్లో ఆయన గ్రేటర్ వరంగల్ అధికారులతో కలిసి పర్యటించి, వరద పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ... "మొంథా తుఫాన్ కారణంగా గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రజల ఇళ్లలోకి నీరు చేరి నిత్యావసరాలు, టీవీలు, బీరువాల వంటి విలువైన వస్తువులు నాశనమయ్యాయి. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీళ్లలోనే గడపాల్సి రావడం దారుణం" అని ఆవేదన వ్యక్తం చేశారు. తుపాన్ తీవ్రతను ముందస్తుగా అంచనా వేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆయన ఆరోపించారు. సమ్మయ్య నగర్‌లో పశువులు, గేదెలు వరద ఉద్ధృతికి కొట్టుకుపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఆస్తి నష్టంతో పాటు పశుపక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా ఉండే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని మండిపడ్డారు. "వరద సమయంలో మంత్రులు జిల్లాలకు ఇన్‌చార్జులుగా ఉండి ప్రజలకు అండగా నిలవాలి. కానీ, జూబ్లీహిల్స్‌లో డివిజన్లకు ఇన్‌చార్జులుగా వ్యవహరించడం విడ్డూరంగా ఉంది" అని ఆయన ఎద్దేవా చేశారు. వెంటనే వరద ముంపు ప్రాంతాల్లో ఆస్తి నష్టాన్ని అంచనా వేసి, బాధితులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.



## చంద్రుడిపైకి వ్యోమగాములు..

### లక్ష్యాన్ని ప్రకటించిన చైనా

చైనా, అక్టోబర్ 30 : అంతరిక్ష పరిశోధనల్లో అగ్రగామిగా నిలవాలనే లక్ష్యంతో దూసుకెళ్తున్న చైనా మరో కీలక ప్రకటన చేసింది. 2030 నాటికి చంద్రుడిపైకి వ్యోమగాములను పంపే ప్రణాళికలు సజావుగా సాగుతున్నాయని గురువారం స్పష్టం చేసింది. అదే సమయంలో, తమ తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లనున్న తదుపరి వ్యోమగాముల బృందాన్ని కూడా పరిచయం చేసింది. చైనా మ్యాన్డ్ స్పేస్ ప్రోగ్రామ్ అధికార ప్రతినిధి జాంగ్ జింగ్బో మాట్లాడుతూ.. "చంద్రుడిపైకి మనిషిని పంపేందుకు అవసరమైన పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు ప్రస్తుతం సజావుగా కొనసాగుతున్నాయి. లాంగ్ మార్చ్ 10 రాకెట్, మూన్ ల్యాండింగ్ సూట్లు, అన్వేషణ వాహనం వంటి వాటి అభివృద్ధిలో మంచి పురోగతి సాధించాం. 2030 నాటికి చంద్రుడిపైకి చైనా వ్యోమగామిని పంపాలన్న మా లక్ష్యం స్థిరంగా ఉంది" అని ధీమా వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా, చైనా తమ తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌కు కొత్త వ్యోమగాముల బృందాన్ని పంపేందుకు సిద్ధమైంది. జాంగ్ లూ, వూ ఫీ, జాంగ్ హాంగ్‌జాంగ్‌లతో కూడిన ఈ బృందం శుక్రవారం రాత్రి 11:44 గంటలకు జ్యుక్వాన్ లాంచ్ సెంటర్ నుంచి బయలుదేరనుంది. ఈ బృందంలోని జాంగ్ లూ గతంలో షెంజౌ 15 మిషన్‌లో పనిచేశారు. మిగిలిన ఇద్దరు వ్యోమగాములకు ఇదే తొలి అంతరిక్ష యాత్ర. వారు స్పేస్ స్టేషన్‌లో ఆరు నెలల పాటు ఉండి పరిశోధనలు చేస్తారు. ఈ యాత్రలో మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, వ్యోమగాములు తమతో పాటు రెండు మగ, రెండు ఆడ ఎలుకలను కూడా తీసుకెళ్లనున్నారు. బరువులేనితనం, పరిమిత ప్రదేశంలో జీవించడం వల్ల జంతువులపై కలిగే ప్రభావాలను అధ్యయనం చేయడమే ఈ ప్రయోగం ఉద్దేశం. అమెరికా భద్రతాపరమైన ఆందోళనల కారణంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో చైనాకు ప్రవేశం నిరాకరించిన సంగతి తెలిసిందే. చైనా అంతరిక్ష కార్యక్రమానికి పీపుల్స్ లిబరేషన్ ఆర్మీతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయనే కారణంతో అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో చైనా సొంతంగా తియాంగాంగ్ స్పేస్ స్టేషన్‌ను నిర్మించుకుంది.

## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం'

# పోర్టల్, ప్రతి నెల జాబ్ మేళాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 30 (భారత శక్తి) : యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు.

**క్లస్టర్ల ఆధారంగా నైపుణ్య శిక్షణ : లోకేశ్**

క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేశ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయ అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను తీర్చిదిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలో ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు.

*** అన్ని శాఖలు, విభాగాల డేటా అనుసంధానం**

ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్‌ను సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు. ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు.

*** విదేశీ భాషల్ని నేర్చుకునేలా శిక్షణ**

'పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలి. విద్యా సంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలి. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలి. స్కిల్ టెస్టింగ్‌కు కూడా అవకాశం కల్పించాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యోగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ అందించాలి. ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఏపీలో యువత అందరికీ ఏ రంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ, ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పునఃశిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

# గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ హబ్‌గా భారత్... రంగంలో 400 స్టార్టప్‌లు

ఢిల్లీ, అక్టోబర్ 30 (భారత శక్తి) : భారత్ వేగంగా గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ హబ్‌గా అవతరిస్తోందని, ఈ రంగంలో 400కు పైగా స్టార్టప్‌లు, 6.5 లక్షల మంది నైపుణ్యం కలిగిన నిపుణులతో దేశ సైబర్ భద్రతా పరిశ్రమ 20 బిలియన్ డాలర్ల స్థాయికి చేరిందని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన 'సెర్ట్‌ఇన్' డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ బహల్ తెలిపారు. ఐరోపా సమాఖ్య (EU) దేశాల నుంచి వచ్చిన జర్నలిస్టుల బృందంతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఆవిష్కర్తలు థ్రెట్ డిటెక్షన్ (ముప్పును గుర్తించడం), సైబర్ ఫోరెన్సిక్స్, ఏఐ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల వంటి అత్యాధునిక పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారని, సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని నిర్మించడంలో ఇది కీలకమని ఆయన వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అనేది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని సంజయ్ బహల్ అభిప్రాయపడ్డారు. ఇది రక్షణ వ్యవస్థలకు ఎంతగా ఉపయోగపడుతుందో, దాడి చేసే సైబర్ నేరగాళ్లకు కూడా అంతే సహాయకారిగా ఉంటుందని అన్నారు. సైబర్ దాడులను నిజ సమయంలో గుర్తించడం, నివారించడం, ప్రతిస్పందించడం కోసం సెర్ట్‌ఇన్ ఏఐ ఆధారిత విశ్లేషణలను, ఆటోమేషన్‌ను సమర్థంగా వినియోగించుకుంటోందని తెలిపారు. అదే సమయంలో ఏఐని దుర్వినియోగం చేస్తూ జరిగే దాడులను ఎదుర్కొనేందుకు కూడా ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సంక్షోభ సమయాల్లో సెర్ట్‌ఇన్ పాత్ర, బాధ్యతలు, సైబర్ దాడుల సమాచారాన్ని పంచుకోవడం, వాటిని సమన్వయంతో ఎదుర్కోవడం వంటి అంశాలను ఆయన జర్నలిస్టులకు వివరించారు. ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించకుండా, సంస్థలకు, పౌరులకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు, సూచనలు జారీ చేస్తూ సైబర్ దాడుల నుంచి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. గతేడాది దేశంలో 147 రాన్సమ్‌వేర్ దాడులు నమోదయ్యాయని డాక్టర్ బహల్ వెల్లడించారు. సెర్ట్‌ఇన్ తీసుకున్న తక్షణ చర్యలు, ఫోరెన్సిక్ జోక్యం, ఇంటెలిజెన్స్ సమాచార మార్పిడి వల్ల వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించగలిగామని పేర్కొన్నారు. దేశీయంగా సైబర్ సెక్యూరిటీ పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్న స్టార్టప్‌లకు పాలసీ మద్దతు, ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అందిస్తున్నట్లు ఐటీ మంత్రిత్వ శాఖ తెలిపింది. డిజిటల్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా ఫ్రాన్స్ జాతీయ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ (ANSSI) వంటి అంతర్జాతీయ సంస్థలతో కలిసి పనిచేస్తూ, పటిష్ఠమైన సైబర్ రక్షణ వ్యవస్థను నిర్మిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్‌లో ఓడిస్తేనే గ్యారెంటీలు అమలవుతాయి

## : కాంగ్రెస్‌పై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి) : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారానే, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన వరుస ట్వీట్లు చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కకుండా చిత్తుగా ఓడించాలని కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. అలాంటి ఓటమి రుచి చూస్తేనే అధికార పార్టీకి భయం పట్టుకుంటుందని, అప్పుడే పెండింగ్‌లో ఉన్న హామీల అమలుపై దృష్టి పెడుతుందని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అధికారంలోకి



వచ్చిన రెండేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి క్షేత్రస్థాయి వాస్తవాలు అర్థమవుతున్నాయని ఆయన ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ 'ఆపదమొక్కులు' మొక్కుతోందని కేటీఆర్ విమర్శించారు. పార్టీ పరువు కాపాడుకోవడం కోసమే రకరకాల ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సినీ కార్మికులకు కొత్త వాగ్దానాలు చేయడం, మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌ను కేబినెట్‌లోకి తీసుకోనుండడం, మంత్రులు గతంలో ఎన్నడూ లేనంత హడావుడిగా హైదరాబాద్ వీధుల్లో తిరగడం వంటివి చేస్తున్నారని ఆరోపించారు. ఇవన్నీ కాంగ్రెస్ తీవ్ర ఒత్తిడిలో ఉందనడానికి నిదర్శనమని కేటీఆర్ తెలిపారు. ఈ ఉపఎన్నికలో ప్రజలు కాంగ్రెస్‌కు గట్టిగా బుద్ధి చెబితేనే, రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# హక్కును కాలరాస్తున్నారు..

- అడ్డగోలుగా దుర్వినియోగం అవుతున్న సమాచార హక్కు చట్టం..
- అడ్డగోలుగా దుర్వినియోగం అవుతున్న సమాచార హక్కు చట్టం..
- వ్యక్తిగత ప్రతీకార సాధనంగా మారిపోయి ప్రమాదాలకు దారితీస్తోంది..
- బ్లాక్‌మెయిల్‌కు ఆయుధంగా వాడబడుతుండటం గర్హనీయం..
- పారదర్శకత కోసం తెచ్చిన చట్టం, వ్యక్తిగత స్వార్థం కోసమా..?
- సమాచారం అడగడం హక్కు.. ఆ హక్కును ఎవరు కాపాడుతున్నారు..?
- సమాచార హక్కు బాధ్యతగల ఒక పౌరుని ఆయుధం..
- ఒక సత్యాన్ని వెలుగులోకి తెచ్చే సాధనం ఆర్.టి.ఐ.
- సమాచార హక్కు చట్టం పౌరులకు కవచం.. కానీ దాన్ని కొందరు కత్తిలా వాడుతున్నారు..
- ప్రజా ప్రయోజనం కోసం అడిగే సమాచారం గొప్పది..
- అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా తిప్పుతున్న అధికారులు..
- నిర్లక్ష్యం వహించిన అధికారులకు జరిమానాలు, శిక్షలు..
- ఇంత జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు..
- సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు సిద్ధం అవుతోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "
వ్యక్తిగత ప్రతీకార సాధనంగా మారిపోయి ప్రమాదాలకు దారితీస్తోంది..
- బ్లాక్‌మెయిల్‌కు ఆయుధంగా వాడబడుతుండటం గర్హనీయం..
- పారదర్శకత కోసం తెచ్చిన చట్టం, వ్యక్తిగత స్వార్థం కోసమా..?
- సమాచారం అడగడం హక్కు.. ఆ హక్కును ఎవరు కాపాడుతున్నారు..?
- సమాచార హక్కు బాధ్యతగల ఒక పౌరుని ఆయుధం..
- ఒక సత్యాన్ని వెలుగులోకి తెచ్చే సాధనం ఆర్.టి.ఐ.
- సమాచార హక్కు చట్టం పౌరులకు కవచం.. కానీ దాన్ని కొందరు కత్తిలా వాడుతున్నారు..
- ప్రజా ప్రయోజనం కోసం అడిగే సమాచారం గొప్పది..
- అడిగిన సమాచారాన్ని ఇవ్వకుండా తిప్పుతున్న అధికారులు..
- నిర్లక్ష్యం వహించిన అధికారులకు జరిమానాలు, శిక్షలు..
- ఇంత జరుగుతున్నా అధికారుల్లో మార్పు రావడం లేదు..
- సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు సిద్ధం అవుతోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

**2005 ఈ సంవత్సరంలో ఒక అద్భుతమైన చట్టాన్ని రూపొందించింది అప్పటి ప్రభుత్వం.. ఆ చట్టం ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారింది.. అవినీతి అధికారులు, నాయకుల గుండెల్లో గుబులు రేపింది.. అదే సమాచార హక్కు చట్టం.. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్, 2005.. ఈ చట్టం భారత ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైనది. కానీ దాని వలన ఎంతో ఉపయోగం ఉన్నా.. ఈ చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న దూర్తుల నుంచి పెను ప్రమాదం ఎదురవుతోంది.. దాంతో మన వ్యవస్థ బలహీనమవుతోంది.. సమాచార హక్కు చట్టం ఉద్దేశ్యం ఎంతో అద్భుతంగా వుంది.. మనం ఓట్లేసి గెలిపించిన ప్రభుత్వంలో నాయకులు, అధికారులు ఎలా పనిచేస్తున్నారు.. మనకోసం ఎంతెంత ఖర్చుపెడుతున్నారు..? ఆ పెట్టె ఖర్చు సద్వినియోగం అవుతోందా..? దుర్వినియోగం అవుతోందా..? మనం కడుతున్న పన్నులకు న్యాయం జరుగుతోందా..? అన్న విషయాలను తెలుసుకోవచ్చు.. పాలన ఎలా సాగుతోందో తెలుసుకోవచ్చు.. అధికారుల అవినీతిని తెలుసుకోవచ్చు.. కానీ దురదృష్టం ఏమిటంటే సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం ఇవ్వాల్సిన అధికారులు సరిగా స్పందించడం లేదు.. విధి విధానాలను కూడా పాటించడం లేదు.. అంతే కాదు మనం ఎవరిగురించి అయినా సమాచారం అడిగినప్పుడు ఆ విషయాన్ని అవతలివారికి చేరవేస్తున్నారు.. ఇది ప్రమాదకరంగా మారిపోతోంది.. అంతే కాకుండా కొంతమంది కేవలం ఎదుటివారిని బ్లాక్ మెయిల్ చేయడానికే సమాచారం అడుగుతున్నారు.. ఇది మరీ ప్రమాదకరంగా మారిపోయింది.. నిజాలను తెలుసుకోవడానికి ప్రవేశపెట్టబడిన ఈ చట్టం.. దుర్వినియోగం అవుతుండటం దురదృష్టకరం..**







**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, అక్టోబర్ 30 (భారత శక్తి) :**

2005లో అమలులోకి వచ్చిన సమాచార హక్కు చట్టం ప్రధాన ఉద్దేశ్యం.. ప్రజలకు ప్రభుత్వ వ్యవహారాలపై సమాచారం పొందే హక్కును ఇవ్వడం, ప్రజాస్వామ్యాన్ని పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చడం. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 (1) (ఏ) "వాక్ స్వాతంత్రానికి మరింత విస్తరణగా భావిస్తారు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో సమాచారం లేకుండా స్వేచ్ఛ అనేది అర్ధరహితం అనేది మేధావుల భావన..

ప్రభుత్వ శాఖలు, మున్సిపాలిటీలు, విద్యుత్ సంస్థలు, పోలీస్ డిపార్ట్మెంట్, ప్రభుత్వ పాఠశాలలు వంటి అన్ని పబ్లిక్ అథారిటీస్ వద్ద నుండి సమాచారం నిర్భయంగా కోరవచ్చు. 30 రోజుల్లో సమాధానం, సమాచారం ఇవ్వడం తప్పనిసరి.. ఒకవేళ అడిగిన సమాచారం ఇవ్వకపోతే లేదా ఆలస్యం అయితే సంబంధిత అధికారులు చట్టపరంగా శిక్షార్హులు అవుతారు..

ప్రతి శాఖలోనూ ఒక సమాచార అధికారి ఉంటారు.. వీరీ వ్యవహారాలన్నీ పర్యవేక్షిస్తుంటారు.. ఇందులో అపీల్ హక్కు అనేది ముఖ్యమైనది.. మొదటి అపీల్, రెండవ అపీల్ ద్వారా ప్రజలు తమ హక్కును రక్షించుకోవచ్చు. కోరిన సమాచారాన్ని పొందవచ్చు..

సంబంధిత అధికారులు అడిగిన సమాచారం ఇవ్వకపోతే రూ. 250 ప్రతీ రోజు జరిమానా, గరిష్ఠంగా రూ. 25,000 వరకు చెల్లించాల్సి ఉంటుంది.. కానీ ఈ విషయం చాలా మందికి తెలియకపోవడం దురదృష్టం..

**ఉపయోగాలు ఎన్నెన్నో ఉన్నాయి :**

అనేక ప్రభుత్వ శాఖలలో బ్లాక్ మనీ, టెండర్ లోపాలు, ఫేక్ బెనిఫిషియరీలు ఈ చట్టం ద్వారా బయటపడ్డాయి. అదేవిధంగా అధికారులు ఆర్.టి.ఐ. వస్తుంది.. అని భయంతో జాగ్రత్త పడుతున్నారు. ఇక అవగాహన ఉన్న పేదలు, మధ్యతరగతి ప్రజలు రేషన్ కార్డు, పెన్షన్, హౌసింగ్, పథకాల్లో తమ హక్కు పొందేందుకు ఆర్.టి.ఐ.ని ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా ఈ చట్టం మీడియాకు బలమైన ఆయుధంగా మారిపోయింది.. జర్నలిస్టులు అనేక స్కాంలను ఆర్.టి.ఐ. ఆధారంగా వెలుగులోకి తీసుకొచ్చిన ఘటనలు అనేకం ఉన్నాయి.. అదేవిధంగా పారదర్శకత పెరిగింది.. కొంతమేర ప్రభుత్వ చర్యలు ప్రజల కంటికి అందుబాటులోకి వచ్చాయి.

**దుర్వినియోగం అవుతున్న చట్టం :**

అయితే, ఈ చట్టాన్ని కొంతమంది బ్లాక్మెయిల్ టూల్ లాగా వాడుతుండటం శోచనీయం.. వ్యక్తిగత పగల కోసం ఆర్.టి.ఐ. వేస్తున్నారు.. అంతే కాకుండా ఉద్యోగులపై, సిబ్బందిపై కక్ష సాధించడానికి కొందరు అపారమైన ఆర్.టి.ఐ.లు వేస్తున్నట్టు తెలుస్తోంది..

ఈ క్రమంలో బ్లాక్మెయిల్ మాఫియా కూడా ఏర్పడింది.. కొందరు ఆర్.టి.ఐ. ద్వారా ఫైల్ తీసుకుని, ఆ సమాచారాన్ని బహిర్గతం చేయకుండా ఉండాలంటే తమకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.. ఇందులో ప్రైవేట్ వ్యక్తులు ఉన్నారు.. పొలిటికల్ లీడర్స్ ఉన్నారు.. ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు.. దురదృష్టం ఏమిటంటే ఆర్.టి.ఐ. వేస్తా.. తర్వాత మీ ఇష్టం అనే బెదిరింపులతో సొసైటీలో ఎన్నెన్నో అవరోధాలు కలుగుతున్నాయి.. ప్రభుత్వ పనితీరు కూడా స్తంభించిపోతుంది. అలాగే ప్రతీ చిన్న విషయం కోసం ఆర్.టి.ఐ. వేసి, అధికారులు దానికి సమాధానం ఇవ్వడంలో సమయం వృధా చేస్తున్నారు.

ఇక ఫేక్ పేర్లతో దరఖాస్తులు వస్తుండటం కూడా జరుగుతోంది.. అసలు వ్యక్తి గుర్తింపు లేకుండా ఆర్.టి.ఐ. వేయడం వల్ల చట్టబద్ధత అనేది లేకుండాపోతోంది..

**ప్రభుత్వ చర్యలు :**

ప్రభుత్వం కూడా ఈ దుర్వినియోగం నేపథ్యంలో కొన్ని చర్యలు తీసుకుంటోంది.. అందులో ఆర్.టి.ఐ. సవరణ చట్టం, 2019 ఒకటి.. ఇన్ఫర్మేషన్ కమిషనర్ల పదవీకాలం, వేతనం వంటి అంశాలను నియంత్రించింది. అయితే కొందరు విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఇది కేంద్రానికి అధిక నియంత్రణ ఇచ్చింది, తద్వారా స్వతంత్రత తగ్గింది. కేంద్రం, రాష్ట్రాలు ఆర్.టి.ఐ. ని ఆన్లైన్లో తీసుకోవడానికి సదుపాయం కల్పించాయి. ఇక ఆర్.టి.ఐ. వేయకుండా, ప్రభుత్వ శాఖలు తాము స్వయంగా సమాచారం విడుదల చేయాలనే నిబంధన కూడా తీసుకుని వచ్చారు.. కానీ అది అమలులో నోచుకోవడం లేదు..

ఆర్.టి.ఐ. చట్టం ప్రజా పారదర్శకతకు ఆయుధం, కానీ పరిపాలనలో విఘాతం సృష్టించే స్థితికి చేరింది. ప్రభుత్వం స్వతంత్ర కమిషన్ల స్వేచ్ఛను తగ్గిస్తూ, సమాచార నియంత్రణ వాతావరణం సృష్టిస్తోంది. అసలు ఆర్.టి.ఐ. చట్టాన్ని తుడిచిపెట్టడానికి గత బీ.ఆర్.ఎస్. ప్రభుత్వం ప్రయత్నం చేసి విఫలమైన విషయం తెలిసిందే.. కాగా కొంతమంది ఆర్.టి.ఐ. యాక్టివిటిస్టులు తమ జీవితాలను కోల్పోయారు.. అవినీతిని బయటపెట్టినందుకు హత్యలు కూడా జరిగాయి.

ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాద సూచికలుగా చెప్పవచ్చు..

ప్రభుత్వ ఏర్పాటులో కీలక భాగస్వాములైన ప్రజలు తమను పాలించే ప్రభుత్వాలు, తమ టాక్సులతో జీతాలు తీసుకుని సేవ చేయాల్సిన, అధికారుల అవినీతిని, తమకు అందుతున్న ఫలితాల గురించి తెలుసుకునేందుకు తీసుకువచ్చిన





సమాచార హక్కు చట్టం భ్రష్టుపట్టిపోతోంది.. ఇంత అద్భుతమైన చట్టాన్ని సజావుగా కొనసాగించడానికి ఇటు ప్రభుత్వాలు కానీ, అటు అధికారులు కానీ సంసిద్ధంగా లేకపోవడం దురదృష్టం..

దీనికి సంబంధించిన కొన్ని వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి.. అడిగిన సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానా విధించబడింది..

నిర్లక్ష్యం వహించిన ఇద్దరు ఉన్నతాధికారులకు రాష్ట్ర సమాచార కమిషన్ జరిమానా విధించింది. సమాచార హక్కు చట్టం అమలులోనిర్లక్ష్యంపై కమిషన్ సీరియస్ అయ్యింది.. వారికి జరిమానాలు విధించింది.. బాగానే ఉంది కేవలం జరిమానాలు విధించడం వలన ఎలాంటి ఉపయోగం ఉండదని విశ్లేషకులు వాదిస్తున్నారు.. సరైన సమాచారం అందించని పక్షంలో సంబంధిత అధికారులను విధులనుండి బహిష్కరించాలి.. చట్టపరమైన కఠిన శిక్షలు అమలు చేయాలని యావత్ తెలంగాణ ప్రజానీకంతో బాటు " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " డిమాండ్ చేస్తోంది..

# కే కన్వెన్షన్ రిసార్ట్ 10 ఎకరాలలో అక్రమ నిర్మాణాన్ని ఎందుకు ఉపేక్షిస్తున్నారు..?

**నార్సింగి మున్సిపాలిటీలో అవినీతి కుప్పలు తెప్పలుగా పేరుకుపోయింది.. ప్రభుత్వ అధికారులం మనకు అడ్డేముంది అన్న అహంకారంతో అవినీతిని ఆలవాలంగా చేసుకుని అధికారులు పనిచేస్తుంటే ఇలాంటి అధికారులను డబ్బుతో కొనేసి అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.. ప్రభుత్వానికి దక్కాల్సిన పన్నును దోచుకుంటున్నారు.. పూర్తిగా ప్రకృతి వైవిద్యానికి విగాథం కలిగిస్తూ.. చెరువులను మింగేశారు.. ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు.. ఈ విషయంపై రాతపూర్వక ఫిర్యాదు చేస్తే.. స్పందించకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ప్రభుత్వ ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి.. కే కన్వెన్షన్ నిర్మాణం దీనికి ప్రతీకగా నిలుస్తోంది..**



హైదరాబాద్, అక్టోబర్ 30 ( భారత శక్తి ) : ప్రజల హక్కులను కాపాడటానికి ప్రభుత్వాధికారులు పని చేస్తారు.. కానీ కాపాడాల్సిన వారే కాటేస్తే పరిస్థితులు ఎంత దారుణంగా వుంటాయో చెప్పనవసరం లేదు.. ఇప్పుడు అలాండి దారుణ పరిస్థితి నార్సింగి మున్సిపాలిటీలో తాండవం చేస్తోంది.. ప్రజల కోసం పనిచేయాల్సిన ప్రభుత్వ అధికారులు అవినీతి దుప్పటి కప్పుకుని, లంచాల మత్తులో జోగుతూ అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆస్తులను దోచేస్తున్నారు. ప్రజల కష్టాన్ని నీరుగారుస్తున్నారు.. చట్టం, న్యాయం, నిబంధనలు అనే పదాలను చెరిపేస్తూ.. పర్యావరణాన్ని చిదిమేస్తూ, కోట్ల రూపాయల భూములను కొందరు దుర్మార్గులు కబ్జా చేస్తూ దౌర్జన్యానికి తెరలేపుతుంటే.. అడ్డుకోవాల్సిన అధికారులు వారి చెప్పులు నాకుతున్నారు.. కే కన్వెన్షన్.. అక్రమ నిర్మాణానికి ప్రతీకగా నిలుస్తోంది.. గండిపేట జలాశయాన్ని ఆనుకుని ఉన్న బయో కన్జర్వేషన్ జోన్ అంటే 111 జీఓ పరిధిలోని శంకర్‌పల్లి మండలం, రంగారెడ్డి జిల్లా, జన్వాడ గ్రామంలో ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమించబడి "కే కన్వెన్షన్ హాల్" పేరుతో భారీ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరుగుతోంది. సర్వే నంబర్లు 725/1, 680, 680/1, 681, 707 లలో ఉన్న భూములు ఈ అక్రమానికి కేంద్రంగా మారాయి. ఈ ప్రాంతం గండిపేట సరస్సుకు సమీపంలో ఉండడం వల్ల ఇది పర్యావరణ పరిరక్షణ జోన్‌లోకి వస్తుంది.. అంటే ఇక్కడ నిర్మాణాలు పూర్తిగా చట్టవిరుద్ధం.



కే కన్వెన్షన్ జన్వాడ గూగుల్ లోకేషన్ అడ్రస్ సర్వే నెం. 681/1/3, శంకర్‌పల్లి - హైదరాబాద్ రోడ్, జన్వాడ, హైదరాబాద్, తెలంగాణ 500075

*** పది ఎకరాలు... ఎవడబ్బసొమ్మని ఆక్రమించారు..?**

ప్రభుత్వానికి కోట్ల రూపాయల పన్ను చెల్లించకుండా నాలా కన్వర్షన్ పేరుతో వ్యవసాయ భూమిని కమర్షియల్‌గా మార్చి అక్రమంగా ఫంక్షన్ హాల్, రిసార్ట్ నిర్మాణం చేపట్టారు. లంచాలతో కప్పేసిన భ్రష్టాచారం ఇది.. ఎన్ని ఫిర్యాదులు చేసినా.. సాక్ష్యాలతో కథనాలు వెలువరించినా అధికారులు మాత్రం లంచాల మత్తులో మునుగుతూ ఏమీ తెలియనట్లు నాటకాలు వేస్తున్నారు. అసలైన సమాచారం ప్రకారం, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, ఇరిగేషన్ అధికారులు లక్షల్లో ముడుపులు తీసుకుని ఈ నిర్మాణాన్ని నిర్లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నారని స్థానిక ప్రజలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ప్రజల ఫిర్యాదులు ఫైళ్లలో దాగిపోయాయి.. ఆ ఫైళ్లపై లంచాల బరువు నిలిచిపోయింది.. నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ కమిషనర్ కి రాతపూర్వక ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతేకాక, ఆ అధికారి స్వయంగా ఈ అక్రమ నిర్మాణం వెనుక ఉన్నారని స్థానిక ప్రజలలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు కూడా ముడుపులు తీసుకుని కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది.


*** నిర్లక్షపు నీడలో ప్రభుత్వం.. పండుగ చేసుకుంటున్న అక్రమార్కులు..:**

ఇటు పర్యావరణానికి తీవ్ర విఘాతం, అటు ప్రభుత్వానికి పన్ను నష్టం.. కొన్ని అమాయకుల జీవితాలు బుగ్గిపాలు.. వీటన్నిటినీ పట్టించుకోకుండా ఈ నిర్మాణాలు కొనసాగుతుండటం ప్రభుత్వ వ్యవస్థ పతనానికి దారి తీస్తోంది అనడానికి నిదర్శనం.. "ప్రభుత్వ భూమిని కాపాడాల్సినవారే కబ్జాకు సహకరిస్తే ప్రజల భవిష్యత్తు ఏమవుతుంది?" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



**స్థానికుల డిమాండ్ :**

"మేము చేసిన ఫిర్యాదులకు స్పందన లేదు. అధికారులే ఈ అవినీతికి తలమానికంగా మారారు. కే కన్వెన్షన్ పేరుతో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపి, సంబంధిత అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి" అని స్థానిక ప్రజలు మున్సిపల్ అధ్యక్ష స్థాయి అధికారి ఎస్ శ్రీనివాస్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నారు.. మరి ఆయనైనా ఈ అక్రమాన్ని అడ్డుకుంటారా..? వేచి చూడాలి..




Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.